మార్చి
2017

131

సంపుటి : 11 సంచిక : 11 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

నల్లడబ్బు రాజకీయాలకు ఊతమిస్తున్న బిజెపి
రాజకీయ విద్య
సంక్షోభ స్థాయికి చేరిన ఆర్థిక అసమానతలు
నయా ఉదారవాదం - కార్మికవర్గం
రైతులందరికీ భూమి
వైబ్రాంట్ గుజరాత్ వట్టి బూటకం
వార్షిక 'కోతల' బడ్జెట్
హిందూత్వ వాదులు సైన్సుకు వ్యతిరేకులు
అసమర్థతకు అబద్ధాలు తోడు
కమ్యూనిస్టు విలువలకు ప్రతిరూపం కామ్రేడ్ సింహాద్రి శివారెడ్డి

## కమ్యూనిస్టు విలువలకు ప్రతిరూపం

# కామ్రేడ్ సింహాద్రి శివారెడ్డి

**పి. మధు**

ఆదర్శ కమ్యూనిస్టు, తెలంగాణా సాయుధ పోరాటయోధుడు, గుంటూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించిన వారిలో ఒకరైన సింహాద్రి శివారెడ్డి గారు 2017 ఫిబ్రవరి 24వ తేదీన 90 సంవత్సరాల వయసులో కన్నుమూశారు. ఉద్యమనిర్మాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అజ్ఞాతవాసం, జైలు జీవితం, చిత్రహింసలు, అన్నింటినీ భరించగలిగారు. హైస్కూలు విద్యార్థిగా 1946లోనే ప్రజాసేవకు పూనుకున్నాడు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, దళితులు, మహిళలపై అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నాడు. భూస్వాముల నుండి ప్రతిఘటన ఎదురైనా లెక్కచేయకుండా రైతు, కూలీల పక్షాన నిలబడ్డారు.

**తెలంగాణా పోరాటం**

కమ్యూనిస్టు పార్టి నాయకత్వంలో 1946లో తెలంగాణా ప్రజలు సాయుధ పోరాటం జరుపుతున్న సమయంలో పార్టి పిలుపును అందుకొని, కొన్ని ఆస్తులు అమ్మి దళాల్లో చేరాడు. నెహ్రూ నాయకత్వంలోని ప్రభుత్వం సైన్యాన్ని పంపి పోరాటాన్ని అణచివేయటానికి పూనుకున్నది. అప్పుడు శివారెడ్డి గారు గుంటూరు జిల్లా వినుకొండ అడవుల్లోని దళాలలోకి వెళ్ళారు. ఆ సందర్భంలో పోలీసులకు దొరకటంతో రహస్యాలు చెప్పమని ఆయనను చిత్రహింసలు పెట్టారు. ఎన్ని చిత్రహింసలు పెట్టినా ఒక్క విషయాన్ని చెప్పలేదు. పోలీసులు కొట్టిన దెబ్బలకు ఆయన వెన్నుముక దెబ్బతిన్నది. దాని ఫలితంగా తీవ్రమైన నడుంనొప్పి బాధను జీవితాంతం అనుభవించారు. ఆపరేషన్ చేయించుకున్నా జీవితాంతం వేధించింది. పోలీసులు ఆయనను మార్కాపురం, కర్నూలు జైళ్ళలో ఆరు మాసాలకు పైగా నిర్బంధించారు. ఆ కేసులో ఆయనకు ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధించి, సేలం జైలుకు పంపారు. సేలం, బళ్ళారి జైళ్ళలో అనేకమంది కమ్యూనిస్టు ఖైదీలను



ప్రభుత్వం నిర్బంధించింది. ఖైదీలు నిర్బంధానికి వ్యతిరేకంగా జైలులో నిరాహారదీక్షలు ప్రారంభించారు. ప్రభుత్వం నిరాహారదీక్షలు చేస్తున్న వారిపై క్రూరంగా కాల్పులు జరిపించింది. కాల్పులలో 22 మంది చనిపోగా, అనేక మంది గాయపడ్డారు. హైకోర్టులో కేసు విచారణ జరిపి, శిక్షాకాలాన్ని సంవత్సరానికి తగ్గించింది. అది పూర్తయిన తర్వాత విడుదల చేశారు.

**సామాజిక అణచివేతకు ప్రతిఘటన**

కాజ గ్రామంలోని పాఠశాలకు 1946లో ఒక దళిత ఉపాధ్యాయులు వచ్చారు. గ్రామంలో ఎక్కడా ఆయనకు ఉండటానికి ఇల్లు దొరక లేదు. అపుడు ఆయనను శివారెడ్డిగారు తల్లిని ఒప్పించి, తన ఇంటిలోనే ఉంచుకున్నారు. సాయంత్రం సమయాలలో శివారెడ్డి గారి ఇంటి ఎదురుగా ఉండే అరుగుపై కూర్చున్నపుడు దళితుడ్ని ఇంట్లో పెట్టుకున్నందుకు గుసగుసలు ప్రారంభించారు. శివారెడ్డిగారు లెక్కచేయలేదు. కొద్ది రోజులకు ఈ వాతావరణాన్ని గమనించిన ఉపాధ్యాయుడు శివారెడ్డి గారికి తెలియకుండా మరో ఊరికి బదిలీ చేయించుకొని వెళ్ళిపోయాడు. ఈ పరిణామం ఆయన్ను కలచివేసింది.

అలాగే వృత్తి శిక్షణ కోసం కొందరు యువకులను నర్సరావుపేట రూరల్ డెవలప్‌మెంట్ స్కూలులో చేర్చారు. అక్కడి మెస్‌లో దళితుల్ని భోజనాల సమయంలో మరోవైపు కూర్చోపెట్టేవారు. దళితులను వేరుగా కూర్చోపెట్టటానికి వ్యతిరేకంగా అందరిని కదిలించాడు. వివక్షకు వ్యతిరేకంగా నాగేంద్రా రెడ్డి, బత్తుల తిరుపతయ్యలు నిరాహారదీక్షకు కూర్చున్నారు. దానితో డిప్యూటి కలెక్టర్ స్వయంగా వచ్చి భోజనాలలో ఎవరూ వివక్ష పాటించరాదని చెప్పడంతో అక్కడ వివక్ష రూపం రద్దయింది. మంగళగిరి డివిజన్, గుంటూరు జిల్లాలో వివిధ సందర్భాలలో గ్రామాలలో దళితులపై వివక్ష, దాడులు జరిగినపుడు వాటిని ప్రతిఘటించటం లో ముందుండేవారు.

**వయోజన విద్య**

ఆనాడు కాజగ్రామంలో చదువుకున్న వారి సంఖ్య తక్కువగా ఉండేది. వయోజనులంతా దాదాపుగా నిరక్షరాస్యులుగానే ఉండేవారు. యువకులను విద్యావంతులుగా చేయటం కోసం గ్రామంలోని రామాలయంలో రాత్రిబడిని ప్రారంభించారు. ఆ బడిలో చదవటం వలన అనేకమంది నిరక్షరాస్యులైన యువకులు ప్రాథమిక విద్యను నేర్చుకున్నారు. నిరక్షరాస్యులకు పేపరు చదివి వినిపించటం ద్వారా వారిని రాజకీయ చైతన్యం కల్పించటానికి ప్రయత్నం చేశారు. మహిళల అణచివేతను కూడా వ్యతిరేకించాడు. స్త్రీలకు సమానహక్కులు కల్పించాలని, కుటుంబంలో మహిళలకు గౌరవాన్నిచ్చే విధంగా సాంప్రదాయాల్లో మార్పును తెచ్చారు.

**అభ్యుదయ వివాహాలు**

వితంతు, అభ్యుదయ వివాహాలను ప్రోత్సహించారు. గ్రామంలో మొదటగా బాపమ్మ అనే వితంతువుకు పునర్వివాహం జరిపించారు. పురోహితుడు లేకుండానే ఈ వివాహం నిర్వహించారు. 'కమ్యూనిస్టుల పెళ్ళి' 'దండల పెళ్ళి', గా ప్రజలలో ప్రచారంలో ఉండేది. అభ్యుదయ వివాహాలకు కాజగ్రామం కేంద్రంగా ఉండేది. శివారెడ్డిగారి ప్రోత్సాహంతో గ్రామంలో పెద్ద సంఖ్యలో అభ్యుదయ వివాహాలు జరిగాయి. ఆ విధంగా అభ్యుదయ పద్ధతిలోవివాహాలు చేసుకోమని యువతను, చేయమని తల్లిదండ్రులను ప్రోత్సహించారు. కాజ ప్రభావంతో చుట్టుపక్కల గ్రామాలలో కూడా అభ్యుదయ పద్ధతిలో చాలా వివాహాలు జరిగాయి. పార్టీ కుటుంబాల్లో కొత్త సంబంధాలు వస్తే వారిని పార్టీ ప్రభావంలోకి తీసుకురావడానికి వీలుగా పథకం రూపొందించే వారని గ్రామంలో సహచరులు చెపుతుంటారు.

**నిబద్ధత**

వివిధ పరిణామాల రీత్యా మంగళగిరి

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1.కమ్యూనిస్టు విలువలకు ప్రతిరూపం కామ్రేడ్ సింహాద్రి శివారెడ్డి
పి. మధు 2

2.నల్లడబ్బు రాజకీయాలకు ఊతమిస్తున్న బిజెపి
ప్రకాశ్ కరత్ 4

3. రాజకీయ విద్య
ఎస్. వీరయ్య 7

4. సంక్షోభ స్థాయికి చేరిన ఆర్థిక అసమానతలు
ఎస్. వెంకట్రావు 9

5. నయా ఉదారవాదం - కార్మికవర్గం
ఎ.కోటిరెడ్డి 13

6. రైతులందరికీ భూమి
అక్టోబర్ సోషలిస్టు విప్లవ శతవార్షిక ప్రత్యేకం 17

7. వైబ్రాంట్ గుజరాత్ వట్టి భూటకం
దివ్యా త్రివేది 18

8. వార్షిక 'కోతల' బడ్జెట్
రాంపల్లి శశి కుమార్ 23

9.హిందూత్వ వాదులు సైన్సుకు వ్యతిరేకులు
మీరా నందా 26

10. అసమర్ధతకు అబద్ధాలు తోడు
ఆనంద్ తేల్‌తుమ్డే 33



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# జాత్యహంకారం

అమెరికాలోని కాన్సస్‌లో ఒక తెల్లజాతి దురహంకారి హైదరాబాదుకు చెందిన తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కూచిభొట్ల శ్రీనివాస్‌ను కాల్చి చంపడంతో భారత దేశంలో పెద్ద ఎత్తున భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిన్నటివరకు డాలరు స్వర్గంగా కనిపించిన అమెరికా నేడు చాలా మందికి నరక ప్రాయంగా కనిపిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయడం, తదనంతరం విజేతగా నిలిచి అమెరికా అధ్యక్షుడయినప్పటి నుండి అక్కడ జాత్యహంకారం రాజ్యమేలుతోంది. ఎన్నికల ప్రచారంలోనూ, అధ్యక్షుడైన తరువాత ఆయన ముస్లింలకు, వలసదారులకు వ్యతిరేకంగా చేసిన, చేస్తున్న రెచ్చగొట్టే ప్రసంగాలే శ్రీనివాస్ ప్రాణాలు తీశాయని ఆయన కుటుంబమే కాదు, అమెరికాలోని మేధావి వర్గాలు కూడా చెబుతున్నాయి. హంతకుడు "టెర్రరిస్టులారా మా దేశం విడిచి వెళ్లిపొండి" అంటూ తమపై కాల్పులు జరిపాడని ఈ ఘటనలో గాయాలతో తప్పించుకున్న మాడసాని అలోక్ చెప్పారు.

అమెరికానే వలసలవల్ల ఏర్పడిన దేశం. వివిధ జాతుల ప్రజలు - ఐరోపానుండి, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలనుండి వివిధ సందర్భాల్లో ఆ దేశానికి వచ్చి స్థిరపడ్డారు. మూలవాసులైన రెడ్ ఇండియన్లు నామమాత్రమైపోయారు. ఆధునిక కాలంలో వివిధ దేశాలనుండి మేధావులను, కార్మికులను తమ దేశానికి రప్పించుకుని, తమ దేశం నుండి పెట్టుబడులు వివిధ దేశాలకు పంపించి అమెరికా బాగుపడింది. ఈ రోజు అమెరికా అగ్రస్థానంలో ఉండడానికి ఈ వలసలే కారణం. మరి ఇప్పుడు ఆ దేశంలో అధ్యక్షుని దగ్గరనుండి కింది వరకు వలసలకు వ్యతిరేకంగా ఈ ప్రచారం ఎందుకు సాగుతోంది? ప్రజల మధ్య విద్వేషాలు ఎందుకు రెచ్చగొట్టబడుతున్నాయి?

మూడు దశాబ్దాల పాటు ప్రపంచీకరణ పేరుతో అనుసరించబడిన నయా-ఉదారవాద విధానాలు అమెరికాలోనూ, ప్రపంచం మొత్తంగానూ దేశాల మధ్య, దేశాల్లో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను విపరీతంగా పెంచేశాయి. ఈరోజు ప్రపంచంలోని 62 మంది సూపర్ ధనికుల చేతిలో ప్రపంచ సంపదలో 50 శాతానికి పైగా కేంద్రీకృతమైంది. 1 శాతం ధనికుల వద్ద మిగతా 99 ప్రజల కన్నా అధిక సంపద పోగుపడింది. నయా-ఉదారవాద విధానాలు అనుసరించిన అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అమెరికాలోని ఒక్క శాతం ధనికుల వద్ద 40 శాతం పైగా సంపద పోగుపడితే భాతర దేశంలో ఈ ఒక్క శాతం సంపన్నులు 53 శాతం సంపద పోగుచేసుకుని కూర్చున్నారు. దేశాల మధ్య కూడా ఆర్థిక అంతరాలు ఇలాగే పెరిగిపోయాయి. ఈ రోజు అమెరికా, జపాన్, యూరప్ వంటి ధనిక దేశాల వద్ద ఇథియోపియా, హైతీ వంటి పేద దేశాల కన్నా 100 రెట్లు ఎక్కువ సంపద పోగై ఉంది.

దేశాల్లోపల అసమానతల వల్ల పేదరికం, నిరుద్యోగం పెరిగి ప్రజల్లో అసంతృప్తి బీజాలు వేస్తుంటే, దేశాల మధ్య అసమానతలు అమెరికా, ఐరోపా వంటి ధనిక దేశాల్లోకి వలసలను ప్రోత్సహిస్తున్నాయి. అసలే అసంతృప్తితో రగిలిపోతున్న ప్రజలను ఆయా దేశాల్లోని పాలక వర్గాలు వలసదారులకు వ్యతిరేకంగా రెచ్చగొడుతూ తమ విధానపరమైన తప్పిదాలనుండి తప్పించుకోజూస్తున్నాయి. తమ దేశాల్లో ప్రజలకు ఉద్యోగాలు రాకపోవడానికి వలసదారులే కారణమని చూపించడం ద్వారా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి. అమెరికాలో ట్రంప్ చేస్తున్న పనే నేడు ఫ్రాన్స్‌లో ఫాసిస్టు నేషనల్ పార్టీ నాయకురాలు లీ పెన్ చేస్తున్నారు. భారత దేశంలో సంఘ్ పరివార్, దాని ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న నరేంద్ర మోడీ అదే పని చేస్తున్నారు. ఇక్కడ నరేంద్ర మోడీ అండ్ కో రెచ్చగొట్టిన ముస్లిం వ్యతిరేక ఉన్మాదం మొహమ్మద్ అఖ్లక్ ప్రాణాలు తీయగా అక్కడ ట్రంప్ రెచ్చగొట్టిన జాత్యహంకారం శ్రీనివాస్ కూచిభొట్లను పొట్టనపెట్టుకుంది. విద్వేషాలు రెచ్చగొట్టే ఈ శక్తులకు కళ్లెం వేయాలంటే వామపక్ష ప్రజాతంత్ర శక్తులు మన దేశంలో, అమెరికాలోనే కాదు ప్రపంచ వ్యాపితంగా బలపడాల్సి ఉంది.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.



**చిరునామా**
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520 002

ఈ మాసం ముఖ్యాంశం

# నల్లడబ్బు రాజకీయాలకు ఊతమిస్తున్న బిజెపి



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**ప్రకాశ్ కరత్**

దేశంలో రాజకీయ పార్టీలకు అందుతున్న నిధులపై పారదర్శకత లేదని కేంద్రబడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి అంగీకరించారు. ఈ పరిస్థితిని మార్చడానికి ఆయన కొన్ని విధానాలను ప్రతిపాదిస్తూ, వాటివలన రాజకీయ పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకత పెరుగుతుందని, అక్రమాలు తొలగిపోతాయని ప్రకటించారు. ఆయన మూడు ప్రతిపాదనలు చేశారు.

1. ఒక వ్యక్తి నుండి ఒక రాజకీయపార్టీ ధన రూపంలో పొందే గరిష్ట విరాళం రెండు వేల రూపాయలకు మించి ఉండరాదు.
2. అంతకన్నా ఎక్కువ విరాళం అందించే వారు చెక్కులు లేదా డిజిటల్ లావాదేవీల ద్వారా మాత్రమే ఇవ్వాలి.
3. విరాళాలిచ్చే దాతలు అధికారిక బ్యాంకుల నుండి చెక్కులు, డిజిటల్ లావాదేవీలకు బదులుగా ఎన్నికల బాండ్‌లను కొనుగోలు చేయాలి. బాండు జారీచేసినప్పటి నుండి నిర్దిష్ట కాల పరిమితి లోపల విరాళం ఇవ్వ దలచుకున్న రిజిస్టర్ అయినటువంటి రాజ కీయపార్టీ లావాదేవీలు జరుపుతున్న ఎక్కౌంట్‌లోనే జమచేయాలి.

రాజకీయ పార్టీలు నిధుల సమీకరణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నల్లడబ్బు, అక్రమ సొమ్ముపై, మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీల వద్దకు ప్రవహించే అక్రమ నిధులపై ఈ మూడు చర్యలూ ఎటువంటి ప్రభావం చూపజాలవు. వాస్తవం చెప్పాలంటే ఈ చర్యలు మరింత తిరోగామి దిశలో ఉన్నాయి. ఎన్నికలలో ప్రవహించే నల్లడబ్బును ఈ చర్యలు ఏ విధంగానూ నిరోధించలేవు.

ప్రస్తుతమున్న చట్టప్రకారం ఏ రాజకీయ పార్టీ అయినా ఇరవై వేల రూపాయలు లేదా అంతకన్నా ఎక్కువ విరాళం ఏ వ్యక్తి నుంచి పొం దినా, అతని లేదా ఆమె పేరు, చిరునామా, పాన్ నెంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలి. ప్రస్తుతం తలపెట్టిన మార్పు ఆ విరాళాన్ని 2,000 రూపాయలకు పరిమితం చేసింది. నల్లడబ్బు ప్రవాహాన్ని అరికట్టటానికి ఇది ఏ మాత్రం ఉపయోగపడదు. రెండు వేల రూపాయలలోపు నగదు విరాళాలను ఇబ్బడి ముబ్బడి చేయటానికి ఇది ఉపయోగపడుతుంది. ఇందుకు బదులుగా రెండువేల రూపాయలు, అంతకు మించిన మొత్తాలను నగదు, చెక్కు లేదా డిజిటల్ రూపంలో విరాళాలుగా ఇచ్చే వారు ప్రస్తుతం 20,000 రూపాయలకు పైబడి విరాళాలు ఇస్తున్న వారివలె వివరాలను ప్రకటించమనటం ఉపయోగంగా ఉండేది.

బడ్జెట్‌లో ప్రకటించిన ఎలక్టోరల్ బాండ్ల ప్రణాళిక, ఎన్నికల నిధులలో పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశానికి పూర్తి భిన్నంగా ఉంది. ఆర్థికమంత్రి చెప్పిన దాని ప్రకారం విరాళాలు అందించేవారు ఇలా చెక్కుల ద్వారా, డిజిటల్ పద్ధతుల ద్వారా విరాళం అందించటానికి విముఖంగా ఉన్నారని, అలాచేస్తే వారి ఉనికి వెల్లడవుతుందని, తద్వారా వచ్చే పర్యవసానాలు ఇబ్బందికరంగా ఉంటాయని సెలవిచ్చారు.

అనధికారికంగా వచ్చిన డబ్బుని లేదా నల్లడబ్బుని విరాళాల రూపంలో ప్రవహింపజేయడానికి కార్పొరేట్లు చెప్పిన హేతుబద్ధమైన కారణాలు ఇవే. అందుకనే ప్రతిపాదిత ఎలక్టోరల్ బాండ్ల ప్రక్రియలో విరాళాలు ఇచ్చినవారి ఉనికి తెలియపరచాల్సిన అవసరం లేదు. అందుకోసం ఇన్‌కమ్‌టాక్స్ చట్టంలో మార్పులు తీసుకురావాలని నిర్ణయించారు. దీనివలన రాజకీయపార్టీలు తమకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన నగదు వివరాలు ఎవరికీ తెలియజేయాల్సిన అవసరం లేదు.

అంటే దీనిని బట్టి అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, ఎలక్టోరల్ బాండ్లద్వారా ఇరవై వేలకన్నా ఎక్కువ విరాళం పొందిన ఏ రాజకీయ పార్టీ అయినా ఇన్‌కమ్‌టాక్స్ విభాగానికి ఆదాయ వివరాలు అందించేటప్పుడు విరాళం ఇచ్చిన వారి వివరాలు తెలియజేయాల్సిన అవసరం లేదు. ఈ విధానం వలన మోడీ ప్రభుత్వం ఎన్నికల నిధుల సమీకరణలో పారదర్శకతకు పాతర వేసి, గుప్తనిధులు అక్రమంగా ప్రవహించేలా చేస్తోంది. వివరాలు కావాలనుకుంటే ఆ సమయంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లు కొన్నవారి పేర్లను బ్యాంకుల నుండి తెలుసుకోవచ్చుననే ఒక్క వెసులుబాటు మాత్రం కల్పించింది.

ఎలక్టోరల్ బాండ్లు ఏ రూపంలో ఉంటాయన్న పూర్తి సమాచారం బయటకు రాలేదు కానీ ఇవి బేరర్ బాండ్ల రూపంలో ఉంటే మాత్రం వీటినిదుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నాయి. అటువంటి బాండ్లను ఉపయోగించి పన్నులు ఎగ్గొట్టే అవకాశాలను, మార్గాలను అన్వేషిస్తారు. రాజకీయ పార్టీల అవసరాలకు, కార్పొరేటు సంస్థలు వ్యాపారానికి ఈ బాండ్ల ద్వారా వివిధ మార్గాలను అన్వేషించే అవకాశముంది.

మోడీ ప్రభుత్వం ఆర్థికబిల్లు ద్వారా ప్రతిపాదిత చట్టాలకు సవరణలను ప్రవేశపెడుతోంది. అంటే ప్రభుత్వం ద్రవ్యబిల్లు రూపంలో ఈ సవరణలకు తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నది. అందువలన రాజకీయ పార్టీలకు విరాళాలు, ఎన్నికల ఖర్చుల విషయంలో రాజ్యసభ ఏ మాత్రం జోక్యం చేసుకొనే అవకాశం లేకుండాపోతుంది.

ఇన్‌కమ్‌టాక్స్ చట్టాలు, పీపుల్స్ రిప్రజెంటేషన్ చట్టాలలో తెచ్చే సవరణలు ఏవీ కన్సాలిడేటెడ్ ఫండు, పన్నులు వేసే అంశాలకు సంబంధించినవి కావు. అందువలన ఈ సవరణలు ద్రవ్యబిల్లు కిందకి రావు. రాజ్యసభకు

సంబంధం లేకుండా చేయటానికి ద్రవ్యబిల్లు అనే భావనను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నది. రాజకీయ పార్టీల నిధుల సమీకరణ విధానాన్ని ప్రక్షాళన చేయటానికి ప్రయత్నం చేస్తున్నాననే ప్రభుత్వ ప్రవచనాలు, వంచన, సందేహంతో కూడుకొని ఉన్నాయి.

ఎందుకంటే గత సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ద్రవ్యబిల్లు ద్వారా విదేశీ నిధుల రెగ్యులేటరీ చట్టంలో ప్రభుత్వం ఒక సవరణను తీసుకొచ్చింది. ఈ సవరణ ఉద్దేశమేమిటంటే విదేశీసంస్థల అనుబంధ విభాగాలుగా ఉన్న ఏ భారతీయ సంస్థ నుండైనా వచ్చే నిధులను ఇకనుండి స్వదేశీ నిధులుగానే పరిగణిస్తారు. ఈ సవరణను అర్థాంతరంగా ప్రవేశపెట్టి అది గడచిన కాలానికి కూడా వర్తిస్తుందని మెలికపెట్టి మరీ బిల్లుని అంగీకరింపజేశారు. ఇది ఎందుకు చేశారంటే, ఒకకేసులో ఢిల్లీ హైకోర్టు బిజెపి కాంగ్రెస్ పార్టీలు చట్టానికి వ్యతిరేకంగా విదేశీ సంస్థల నుండి నిధులు తీసుకున్నారనీ, వారు దోషులని తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ సవరణ ను తీసుకువచ్చారు. ఆ కంపెనీ ఎవరిదో కాదు, లండన్ నుండి వ్యాపారం చేస్తున్న వేదాంత కార్పొరేట్ సంస్థ.

"ఇది ఎందుకు చేశారంటే, ఒకకేసులో ఢిల్లీ హైకోర్టు బిజెపి కాంగ్రెస్ పార్టీలు చట్టానికి వ్యతిరేకంగా విదేశీ సంస్థల నుండి నిధులు తీసుకున్నారనీ, వారు దోషులని తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ సవరణ ను తీసుకువచ్చారు. ఆ కంపెనీ ఎవరిదో కాదు, లండన్ నుండి వ్యాపారం చేస్తున్న వేదాంత కార్పొరేట్ సంస్థ."

ఈ ద్రవ్యబిల్లు ద్వారా అనుమతి పొందిన సవరణల నేపథ్యంలో ఇకనుండి ఏ రాజకీయ పార్టీ అయినా, ఏ బహుళజాతి సంస్థ అనుబంధ విభాగంనుండైనా ఎటువంటి అడ్డంకులు లేకుండా నిధులు స్వీకరించవచ్చు. అంతేకాదు, ఇప్పుడు ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విదేశీ కార్పొరేట్ సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా నిధులు సమకూర్చవచ్చు. ఎవరికీ ప్రశ్నించే హక్కు కూడా లేదు. ఈ విధంగా మోడీ ప్రభుత్వం ఓ నూతన అధ్యాయానికి తెర తీసింది. అదేమిటంటే, రాజకీయపార్టీలలోకి కూడా వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవహించటానికి (ఎఫ్.డి.ఐ) అనుమతించడం.

ఈ మొత్తం ప్రక్రియలో ఒక వర్గం ప్రయోజనాలు ప్రస్ఫుటంగా మనకు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కాని, ఎన్నికల కమీషన్‌కాని రాజకీయ పార్టీలకు వచ్చే నిధుల గురించి కానీ, ఎన్నికల ఖర్చుల గురించి ఎటువంటి ఆందోళన వ్యక్తపరచడం లేదు. వారి ఆలోచనంతా ఒకటే, ఈ నిధులన్నీ ఒక క్రమపద్ధతిలో రావాలి. అంతే, అవి ఎలా వచ్చినా, ఎంత వచ్చినా వారికన వసరం. వారి వర్గ దృక్పథం చాలా స్పష్టంగా ఉంది. కాంగ్రెస్, బిజెపీలు రెండూ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయి. ఎన్నికల ఖర్చులపై ఎటువంటి ఆంక్షలు వారికిష్టం లేదు.



హెలికాప్టర్ ద్వారా మోడి ఎన్నికల ప్రచారం

2014 లోక్‌సభ ఎన్నికలలో బిజెపి ఎన్నికల ప్రచారం కోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వందల కోట్లు ఖర్చుచేసింది. అదేవిధంగా, అద్దె విమానాలకు, హెలికాప్టర్లకు వందల కోట్ల రూపాయలు ఖర్చుచేశారు. దీనికి పూర్తి భిన్నంగా రాజకీయపార్టీలకు కార్పొరేట్ సంస్థలు నిధులు సమకూర్చటాన్ని సిపిఐ (యం) పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఒక వేళ అది తప్పనిసరి అయితే ఎలక్షన్ కమీషన్ నిర్వహణలో ఉండే సంస్థలో ఆ నిధులను జమచేసి, రాష్ట్రాల వారీగా జరిగే ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా పంపిణీ చేయగలిగితే మేలు జరుగుతుంది.

ప్రస్తుత నయా ఉదారవాద విలువల ప్రపంచంలో అన్ని బూర్జువా రాజకీయ పార్టీలు డబ్బుతో ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకు వస్తున్న సవరణలతో ఎన్నికల బాండ్ల ద్వారా బహుళ జాతి కంపెనీలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చవచ్చు. వాటిని గురించి ప్రశ్నించే అవకాశం లేదు. వాస్తవంగా మోడి ప్రభుత్వం రాజకీయ పార్టీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. రాజకీయ పార్టీలకు నిధులు, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన అంశాలలో వర్గకోణం కూడా ఉన్నది. ఎన్నికల కోసం రాజకీయ పార్టీలకు బడా సంస్థల నుండి నిధులు అందటంపై ప్రభుత్వం గాని, ఎన్నికల కమీషన్ కాని వ్యతిరేకంగా లేవు. దానిని చట్ట బద్ధం చేయాలని మాత్రమే వారు కోరుతున్నారు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల నుండి నిధులు రావాలని బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ కోరుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో పెట్టే ఖర్చులపై ఎటువంటి పరిమితిని విధించటానికి వారు సిద్ధంగా లేరు. 2014 ఎన్నికలలో బిజెపి వార్తా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాపై వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. చార్టర్డ్ ప్రైవేటు విమానాలు, హెలికాప్టర్లకు కూడా ఆ విధంగానే భారీ మొత్తాలు ఖర్చుచేశారు. మరోవైపు సిపియం రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు నిధులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తున్నది. అంతగా అవసరం అనుకుంటే ఎన్నికల సమయంలో ప్రభుత్వ నిధులను రాజకీయ పార్టీలకు అందించటం కోసం ఎన్నికల కమిషన్ వద్ద ఉండే నిధికి వారు



ఎన్నికల కమీషన్

కూడా విరాళాలు అందించాలని కోరుతున్నది.

ప్రస్తుతం ఉన్న నయా ఉదారవాద విలువల కాలంలో అన్ని బూర్జువా రాజకీయ పార్టీలు ధనబలంతో ఎన్నికలను ఎదుర్కోవాలని చూస్తు న్నాయి. దురదృష్టవశాత్తు ఎన్నికల కమీషన్ ఇటువంటి నిధుల ప్రవాహంపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా సామాన్య మానవుల నుండి కొద్ది మొత్తాలలో వచ్చే నిధులపై కొరడా ఝుళిపించాలని చూస్తోంది. ప్రచారంలో పోస్టర్లను, బ్యానర్లను వినియోగించడం నిషేదించడం ద్వారా ఎన్నికల కమీషన్, పరిమిత వనరులున్న పార్టీల ఎన్నికల ప్రచారానికి ఆటంకాలు కల్పిస్తు న్నది. అదే సందర్భంలో పెద్దఎత్తున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేసే వారిని, విపరీతమైన ఖర్చుతో పెద్ద హోర్డింగ్‌లు పెట్టేవారిని ప్రోత్సహిస్తున్నది.

ఇదే వర్గ దృక్పథాన్ని స్వచ్ఛంధ సంస్థలు కూడా చూయిస్తున్నాయి. ప్రజాస్వామ్య సంస్కరణల అసోసియేషన్ వంటి సంస్థలు ఈ కోవకి చెందినవే. హుండీలు , బాక్సుల ద్వారా ప్రజల నుండి వసూలు చేసే విరాళాలను గుర్తుతెలియని వ్యక్తుల నుండి వసూలు చేస్తున్న మొత్తాలుగా పేర్కొంటున్నాయి. రాజకీయ పార్టీలకు చాటు మాటుగా పెద్దమొత్తంలో అందే నిధులు, చట్టబద్ధ మైన అకౌంటింగ్ విధానానికి బయట అందే నిధులను గురించి పట్టించుకోవటం లేదు.

అందువలన నేడు అత్యవసరంగా ఎన్నికల సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ పార్టీల నిధుల సమీకరణలో సంస్కరణలు కూడా వీటిలో భాగంగా ఉండాలి. అందుకు ప్రారంభంగా ఈ కింది పద్ధతులు అమలు చేయాలి.

1. మొత్తం ఎన్నికల వ్యయంపైనా, వివిధ విభాగాల కింద చేస్తున్న ఖర్చుపై అన్ని రాజకీయ పార్టీలకు పరిమితి విధించాలి. ఉదాహరణకి, సాధారణ ఎన్నికల సమయంలో ఒక రాజకీయపార్టీ దేశవ్యాప్తంగా ప్రకటనల ప్రచార నిమిత్తం ఐదు వందల కోట్లు ఖర్చుపెడితే దానిని న్యాయసమ్మతమైనదిగా భావిస్తున్నారు. దాన్ని గురించి ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు. ఎన్నికలలో నల్లధనాన్ని అరికట్టాలంటే ఎన్నికల ప్రచార ఖర్చులపై ఖచ్చితమైన పరిమితులను విధించాలి.

2. రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్‌లో సవరణ తేవడం ద్వారా ఎన్నికలలో తన అభ్యర్థి కోసం అ పార్టీ పెట్టేఖర్చునీ ఆ పార్టీ అభ్యర్థి ఖర్చుగా పరిగణించే విధంగా మార్చాలి.

3. రెండు వేల రూపాయల కంటే ఎక్కువ విరాళం ఇచ్చిన దాతల పేర్లు, వారి పూర్తి వివరాలు ఖచ్చితంగా అన్ని రాజకీయ పార్టీలు తెలియజేయాలి.

4. ఎలక్టోరల్ బాండ్లు కనుక అమలులోకి వస్తే, ఏ రాజకీయ పార్టీ వాటి ద్వారా నిధులు అందుకుంటున్నదో ఆ పార్టీ వాటి పూర్తి వివరాలు తెలియజేయాలి.

5. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికలలో తమ ప్రణాళికలు, ప్రచారసామాగ్రి, రవాణా ఖర్చులు భరించేలా రాష్ట్రాలకి నిధులు కేటాయించేలా చట్టసవరణ పొందుపరచాలి.

6. రాజకీయ పార్టీలకు నల్లధనాన్ని ఇచ్చేవారిపై వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వాటిని అందుకొనే రాజకీయ పార్టీలపై జరిమానాలు విధించాలి.

**అనువాదం : ఎల్.ఎస్. భారవి**

## వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

### (రూలు 8వ ఫారం IV ప్రకారం)

### మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | హైదరాబాద్ |
| 2. | ఏ రకమైన పత్రిక | : | మాసపత్రిక |
| 3. | ముద్రాపకుని పేరు<br>చిరునామా | : | బి.వి. రాఘవులు, 1-1-60/2,<br>యం.బి. భవన్,<br>ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ - 20. |
| 4. | ప్రచురణ కర్త పేరు<br>చిరునామా | : | బి.వి. రాఘవులు<br>1-1-60/2, యం.బి. భవన్,<br>ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ - 20. |
| 5. | సంపాదకుని పేరు<br>చిరునామా | : | ఎస్. వెంకట్రావ్<br>డోర్ నెం. 27-30-4,<br>యం.బి. విజ్ఞానకేంద్రం,<br>గవర్నరుపేట, విజయవాడ. |
| 6. | పత్రిక యాజమాన్యం | : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)<br>ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ |

బి.వి. రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందుమూలముగా తెలియసజేస్తున్నాను.

సం/-
**బి.వి. రాఘవులు**
ప్రచురణ కర్త

# రాజకీయ విద్య



రచయిత
సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

**ఎస్ వీరయ్య**

కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రాజకీయ విద్య గరపటం నిరంతర ప్రక్రియ. పార్టీ సానుభూతిపరులకు గానీ, వివిధ స్థాయిల్లో ఉన్న పార్టీ శ్రేణులకు గానీ నిరంతరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ విద్యను అందించాలి. పార్టీ మౌలిక సిద్ధాంతం మీద అవగాహన కల్పించడం, మారుతున్న పరిస్థితులకు అన్వయించే పద్ధతిని నేర్పడం అవసరం. మార్క్సిజం-లెనినిజం గొప్పదైనప్పటికీ అది మార్క్స్ కాలంనాటిదనీ, సమకాలీన పరిస్థితులకు అది వర్తించదన్న వాదనలను ఎదుర్కోగల సామర్థ్యం పార్టీ శ్రేణులకు అందించాలి. ప్రస్తుత కాలానికి మార్క్సిస్టు - లెనినిస్టు మౌలిక సూత్రాల ప్రాసంగికత (రెలవెన్స్)ను పార్టీ శ్రేణులు శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. మార్క్సిస్టు-లెనినిస్టు మౌలిక సూత్రాలను నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

మార్క్సిస్టు - లెనినిస్టు మౌలిక సూత్రాల మీద ఏ మేరకు పట్టు సాధించగలిగితే ఆ మేరకు సమకాలీన ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక అంశాలను అర్థం చేసుకోగలుగుతారు. పరిణామాలను సక్రమంగా అంచనా వేయగలుగుతారు. అందుకు అనుగుణమైన నిర్దిష్ట చర్యలు చేపట్టగలుగుతారు. అందువల్ల రాజకీయ విద్య అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయం. పార్టీ సభ్యులను తయారు చేసుకోవడంలోనూ, పార్టీ శ్రేణులను చైతన్యపర్చడంలోనూ, కార్యకర్తలను- నాయకులను తయారు చేసుకోవడంలోనూ రాజకీయ విద్య పాత్ర కీలకమైంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక అవగాహనను పెంపొందించుకున్నప్పుడు మాత్రమే నిత్యజీవితంలో జరుగుతున్న వర్గ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పైచేయి సాధించగలదు.

ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే సరళీకృత ఆర్థిక విధానాల ప్రమాదం పట్ల ప్రజలను అప్రమత్తం చేయగలం. ఉదాహరణకు, ఇప్పటి వరకు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలన్నీ ప్రజా వ్యతిరేక విధానాలే అనుసరిస్తున్నాయన్న విషయం అర్థం కావాలన్నా, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం ఆ దిశలో మరింత వేగంగా అడుగులు వేస్తున్నదన్న విషయంలో స్పష్టత రావాలన్నా కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లనూ, ప్రభుత్వాలు తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలను, వాటి ఫలితాలనూ లోతుగా పరిశీలించడం అవసరం. ప్రస్తుతం కేంద్ర బడ్జెట్ను పరిశీలిస్తే అనేక విషయాలు అర్థమవుతాయి. దేశంలో సుమారు దశాబ్దకాలంగా వస్తు సేవల పన్ను (జిఎస్టీ) గురించి చర్చ జరుగుతున్నది. దీని పర్యవసానాలు అర్థం చేసుకోవడం అవసరం. ఫెడరల్ రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కుతున్న పాలక వర్గాల వైఖరిని అర్థం చేసుకోవాలంటే జిఎస్టీ గానీ, ప్రణాళికా సంఘం రద్దు గురించి గానీ, ప్రణాళికా - ప్రణాళికేతర బడ్జెట్ విభజనను తొలగించడం తదితర అంశాల పట్ల స్పష్టత ఏర్పరచుకోవాలి. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలను అర్థం చేసుకోవాలన్నా ఇలాంటి పరిణామాలను అధ్యయనం చేయాలి. పెద్దనోట్ల రద్దు కూడా ఈ క్రమంలో చాలా ముఖ్యమైన చర్య. ఉత్తరఖండ్, అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో జరిగిన రాజకీయ పరిణామాలు కేంద్ర ప్రభుత్వ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి బాగా ఉపయోగపడతాయి. అస్సాంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడానికి దారితీసిన పరిస్థితులను అర్థం చేసుకోగలిగితే తమిళనాడులో బీజేపీ ఎత్తుగడల లక్ష్యాలు గానీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ పథకాలను గానీ అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. కులం, మతం పేరుతో ఓట్లడగడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చింది. అయినా ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ కూడా ఊరికో ఖబరస్థాన్ మాత్రమే కాదనీ, స్మశానం కూడా ఉండాలని మాట్లాడారు. బీజేపీ నాయకత్వం రామమందిర నిర్మాణం గురించి ప్రచారం చేస్తున్నది. మరికొందరు బీజేపీ నేతలు జనాభా పెరుగుదలకు ఏ మతం కారణమన్న చర్చను ముందుకు తెస్తున్నారు. ఇవన్నీ మతాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకునేందుకు చేసే ప్రయత్నాల్లో భాగమే. ప్రపంచ పెటుబడిదారీ వ్యవస్థలో పరిణామాలను అధ్యయనం చేయగలిగితే మన దేశంలో మేక్ ఇన్ ఇండియా ఎందుకు విఫలమైందో, ఉపాధి అవకాశాలు ఎందుకు పడిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అమెరికాలో ట్రంప్ గెలుపుగానీ, బ్రిటన్ రెఫరెండంలో బ్రెగ్జిట్‌కు అనుకూలమైన తీర్పుగానీ, ఇటలీ రెఫరెండం ఫలితాలు గానీ జాగ్రత్తగా అధ్యయనం చేయగలిగినప్పుడు మాత్రమే మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాల్సిన ప్రాధాన్యతను అర్థం చేసుకోగలం. ప్రభుత్వాలే మతపరమైన క్రతువులు ఆచరించడం, మూఢవిశ్వాసాలను ఆశ్రయించడం చూస్తున్నాం. ఇది ఇప్పుడు కేవలం బీజేపీకి పరిమితం కాలేదు. కాంగ్రెస్ నుండి టీడీపీ, టీఆర్ఎస్‌ల వరకు ఇలాంటి రాజ్యాంగపరమైన, మౌలికమైన సైద్ధాంతిక విషయాల పట్ల అవకాశవాదం పాకుతున్నది. ఇందుకు గల కారణాలను కమ్యూనిస్టు శ్రేణులు విశ్లేషించగలగాలి. 70వ దశకంలో కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో నియంతృత్వ పోకడలు బలపడి ఎమర్జెన్సీ రూపంలో వ్యక్తమైనాయి. ఇప్పుడు బీజేపీ నాయకత్వంలో నియంతృత్వ పోకడలు బలపడుతున్నాయి. ఒకప్పుడు ప్రజాస్వామ్యం, లౌకికతత్వం గురించి నినదించిన పెట్టుబడిదారీ వర్గమే ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరించడానికి వెనకాడడం లేదు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఒక చరిత్ర ఉన్నది. ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి ప్రత్యేక నేపథ్యం ఉన్నది. వీటిమీద సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావాన్ని, ఫ్యూడల్ సంబంధాల మోతాదును అధ్యయనం చేయాలి. పర్యవసానాలను అర్థం చేసుకోవాలి. కులం, మతం

> **"సమాజంలో వస్తున్న మార్పులు పార్టీ శ్రేణుల మీద నిరంతరం అనుకూల, ప్రతికూల ప్రభావం చూపుతుంటాయి. అందుకు అనుగుణంగా కొత్త శ్రేణులకు మార్క్సిస్టు నిర్మాణ పద్ధతుల పట్ల అవగాహన కల్పించడం గానీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులను రాజకీయ సైద్ధాంతిక అవగాహనను తాజా పర్చడం గానీ నిరంతరం రాజకీయ విద్యను అందించడం ద్వారానే సాధ్యం."**



కమ్యూనిస్టు పార్టీ అనుసరించే సైద్ధాంతిక రాజకీయ విధానాలను బట్టే నిర్మాణమూ ఉంటుంది


సామాజిక జీవితం మీద వాటి పాత్రను బేరీజు వేసుకోవాలి. ఇందుకు పార్టీ కార్యక్రమాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిస్టు, లెనినిస్టు మౌలిక సూత్రాలను అన్వయించడం ద్వారా రూపొందిన విప్లవ మార్గమే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం. దేశంలో జరుగుతున్న పరిణామాలు సక్రమంగా అర్థం చేసుకోవాలంటే పార్టీ కార్యక్రమం పట్ల స్పష్టమైన అవగాహన అవసరం. సామాజిక న్యాయం, కులం, వర్గం వంటి అంశాలు ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశాలు అయ్యాయి. 93శాతం ప్రజల హక్కుల గురించి మాట్లాడుతున్నాము. రాజకీయ, సామాజిక రంగాల్లో సాధించదలచిన నిర్దిష్ట లక్ష్యాల కోసం అనేక ఎత్తుగడలు వేస్తున్నాం. నినాదాలు ఇస్తున్నాం. ఇది పార్టీ వెలుపల రాజకీయ రంగంలో గానీ, పార్టీ లోపల సైద్ధాంతిక నిర్మాణ అవగాహన మీద గానీ చూపే ప్రభావాల గురించి సరైన అంచనాలకు రావాలంటే నిర్దిష్ట పరిస్థితులను మార్క్సిస్టు – లెనినిస్ట్ అవగాహనతో విశ్లేషించగల సామర్థ్యం పార్టీ శ్రేణుల్లో పెంపొందించుకోవాలి. కుల వివక్షకు– కుల పోరాటానికి మధ్య ఉన్న తేడా అర్థం కావాలన్నా మార్క్సిస్టు అవగాహన పెంచుకోవడం అవసరం. అప్పుడు మాత్రమే ఏపీలో కాపుల సమీకరణకు జరుగుతున్న ప్రయత్నాలు గానీ, కాపులను బీసీలో కలపాలన్న నినాదాన్ని గానీ, తెలంగాణలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుగానీ, వెనుకబడిన తరగతుల్లోని జనాధిక్య కులాలను చేరదీసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గానీ శాస్త్రీయంగా అంచనా వేయగలం. గొర్రెల పెంపకాన్ని భారీ పరిశ్రమగా అభివృద్ధి చేయాలన్న ముద్దుముద్దు మాటల వెనుక వ్యాపార రహస్యం అర్థం చేసుకోగలం.

కమ్యూనిస్టు పార్టీ అనుసరించే సైద్ధాంతిక రాజకీయ విధానాలను బట్టే నిర్మాణమూ ఉంటుందన్న మౌలిక విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అందుకనుగుణంగా నిర్మాణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అంచనా వేసి నిర్మాణాన్ని చక్కదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. నిరంతరం పార్టీలోకి కొత్త శ్రేణులు చేరుతుంటాయి. సమాజంలో వస్తున్న మార్పులు పార్టీ శ్రేణుల మీద నిరంతరం అనుకూల, ప్రతికూల ప్రభావం చూపుతుంటాయి. అందుకు అనుగుణంగా కొత్త శ్రేణులకు మార్క్సిస్టు నిర్మాణ పద్ధతుల పట్ల అవగాహన కల్పించడం గానీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులను రాజకీయ సైద్ధాంతిక అవగాహనను తాజా పర్చడం గానీ నిరంతరం రాజకీయ విద్యను అందించడం ద్వారానే సాధ్యం. పార్టీకి, ప్రజా సంఘాలకు మధ్య ఉన్న సంబంధం గురించీ, ప్రజా సంఘాల్లో పార్టీ శ్రేణుల పని విధానం గురించీ సరైన అవగాహన కల్పించడం కూడా అవసరం.

ఎవరికి బోధిస్తున్నామన్నదాన్ని బట్టి పాఠ్యాంశాలుగానీ, వాటి లోతులు గానీ నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. పార్టీ సానుభూతిపరులకు లేదా సభ్యులకు లేదా శాఖా కార్యదర్శులకు లేదా కార్యకర్తలకు, నాయకులకు వేర్వేరు స్థాయిల్లో అవసరమైన అంశాలు బోధించవలసి ఉంటుంది. కార్యకర్తలుగా, నాయకులుగా తయారు చేసుకోవడానికి లేదా నిర్దిష్ట విభాగాల నిర్వహణ కోసం (సేవా రంగం, పౌర హక్కుల రంగం, సైన్స్ రంగం మొదలైనవి) కొంత మందిని ఎంపిక చేసి వారికి అవసరమైన రాజకీయ విద్యను అందించాల్సి ఉంటుంది. ఎంపిక చేసినవారిలో అనుకూల, ప్రతికూల అంశాలను బేరీజు వేసుకుని అందుకు అవసరమైన పాఠ్యాంశాలు, వాటి మోతాదు నిర్ణయించాల్సి ఉంటుంది. స్టడీ సర్కిల్‌ల్లో బోధించవలసిన విషయాలకు, ఆగ్జిలరీ శాఖల్లో బోధించాల్సిన అంశాలకు మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవాలి. ఆందోళనా, ప్రచారం, నిర్మాణం వంటి అంశాల మధ్య ఉన్న సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. వాటి మధ్య లింకు తెగకుండా నిరంతరం కార్యాచరణ కొనసాగించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలి. ప్రజల సమస్యల మీద ఆందోళనలతో ప్రారంభమైన కృషి పార్టీ సభ్యులను తయారు చేసుకోవడం దాకా కొనసాగాలంటే సరైన అవగాహన కల్పించడం అవసరం. పోరాట సమయంలో ముందుకొచ్చే రాజకీయ, సైద్ధాంతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలి. వాదోపవాదాలను సరిగ్గా విశ్లేషించగలగాలి. అప్పుడు మాత్రమే ప్రభుత్వ వాదనలనూ, పెట్టుబడిదారుల, భూస్వాముల ఎత్తుగడలనూ, బూర్జువా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నడిచే యూనియన్లు, ప్రజాసంఘాల ఎత్తుగడలను తిప్పికొడుతూ పోరాటాన్ని ముందుకు నడపగలం. ఏమైనా, రాజకీయ విద్య ఒకరు నేర్పేది గానూ, మరొకరు నేర్చుకునేదిగానూ ఉండ కూడదు. పార్టీ శ్రేణులు స్వయం కృషి ద్వారా ఎదిగేందుకు ప్రయత్నించడానికి రాజకీయ విద్య ఒక ఉత్ప్రేరకంగా ఉపయోగపడాలి. అప్పుడు మాత్రమే సమర్థులైన కార్యకర్తలు, నాయకులు తయారవుతారు. పార్టీ శ్రేణులు నిరంతరం క్రియాశీలంగా ఉంటారు. కార్యకర్తలు స్వతంత్రంగా పనిచేయగలుగుతారు. పార్టీలో సృజనాత్మక కృషి పెరుగుతుంది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ అందించే రాజకీయ విద్య ప్రధానమైన లక్ష్యం స్వయం కృషిని ప్రోత్సహించేదిగా ఉండాలి. ❊

ఈ మాసం ప్రత్యేకం

# సంక్షోభ స్థాయికి చేరిన ఆర్థిక అసమానతలు



రచయిత
సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

**ఎస్. వెంకట్రావు**



ప్రపంచంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు పెద్ద సంక్షోభం స్థాయికి చేరుకున్నాయి. నేడు ప్రపంచంలోని అత్యంత ధనికులైన 62 మంది చేతుల్లో మిగిలిన 99 శాతం ప్రజల వద్దనున్న సంపదకన్నా ఎక్కువ పోగైంది. ఈ కొద్దిమంది సూపర్ ధనికులు ప్రభుత్వాల విధానాలను శాసిస్తూ రోజురోజుకూ మరింత సంపద పోగుచేసుకుంటుంటే పేదల సంఘటిత శక్తి మరింత బలహీనపడడంతో వారు రోజు రోజుకూ ఆదాయంలో, సంపదలో వాటా మరింతగా కోల్పోతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రపంచం సుస్థిరమైన అభివృద్ధి బాటను వీడి అస్థిరమై సంక్షోభంలోకి పోతుందని పెట్టుబడిదారులే భయపడే పరిస్థితి వచ్చింది.

సంపద పెంచాలా, పంచాలా... ఏది ముఖ్యం అనే చర్చ చాలా కాలంగా సాగుతోంది. సంపద పెంచితేనే పంచగలం అని బిజెపీ నాయకులు వెంకయ్యనాయుడు ఇటీవల పదేపదే పేర్కొంటున్నారు. కమ్యూనిస్టులపై విమర్శగా ఆయన ఈ విషయం చెబుతున్నారు. "కామ్రేడ్లు ప్రతి సందర్భంలోనూ (సంపద) పంచాలి, పంచాలి అంటారు. సంపద పెరిగితేనే పంచగలం అనే విషయాన్ని వారు గమనించాలి" అని ఇటీవల కృష్ణా జిల్లా ఆత్కూరులో తన కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తున్న 'స్వర్ణభారతి ట్రస్ట్'లో మాట్లాడుతూ ఆయన మరోమారు పేర్కొన్నారు. నిజానికి ఇది ఆయన వాదన మాత్రమే కాదు. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలను తలకెక్కించుకున్న అన్ని పార్టీల నాయకులూ ఇదే వాదన చేస్తున్నారు.

సంపద పెంచాల్సిందే. నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద నిత్యం పెరుగుతూనే ఉంది. ప్రపంచ స్థూల ఉత్పత్తి 3-4 శాతం మధ్య పెరుగుతూ వస్తోంది. 2007 వరకు ఇది 5-6 శాతం మధ్య ఉండేది. భారత్, చైనా స్థూల జాతీయోత్పత్తులు (జిడిపి) ఏటా సుమారు 7 శాతం చొప్పున పెరుగుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా భారత దేశ జిడిపి 7-10 శాతం మధ్య పెరుగుతోంది. కానీ పెరుగుతున్న ఈ సంపద అంతా ఏమవుతోంది?

గత 250 ఏళ్లుగా పెట్టుబడిదారీ వ్యవస్థలో పెరుగుతున్న సంపదంతా కొద్దిమంది ధనికుల వద్ద ఎలా పోగుపడుతూ వస్తోందో థామస్ పికెట్టీ అనే ఫ్రెంచ్ ఆర్థిక శాస్త్రవేత్త "21వ శతాబ్దంలో పెట్టుబడి" అనే తన గ్రంథంలో వివరించాడు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థికాభివృద్ధి రేటు కన్నా పెట్టుబడి రిటర్న్ రేటు చాలా ఎక్కువగా ఉందనీ, దీని వల్ల ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతాయని 2013లో ప్రచురించబడిన తన గ్రంథంలో పికెట్టీ పేర్కొన్నాడు. ప్రపంచ వ్యాపితంగా ఎక్కువ సంపదపై ఎక్కువ పన్నులు వేయడమొక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఆయన ప్రతిపాదించాడు.

పికెట్టీ కమ్యూనిస్టు కాదు. పక్కా పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త. మరి ఆయన ఎందుకీ ప్రతిపాదన చేశాడు. ఎందుకంటే పెరుగుతున్న ఈ అసమానతలు ప్రపంచ వ్యాపిత ఆర్థిక సంక్షోభానికి దారితీశాయి. అసమానతలు పెరుగుతున్న కొద్దీ సంక్షోభం మరింత పెరుగుతోంది. ఇది సామాజిక సంక్షోభానికీ మళ్లుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం మొత్తం వ్యవస్థకే ముప్పుతెస్తుందని వారి భయం. అందుకే ఆర్థిక అసమానతల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నయా-ఉదారవాద సిద్ధాంతాన్ని తలకెక్కించుకున్న వారికి ఇది అర్థం కాకపోవచ్చు.

**శరవేగంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు**

బ్రిటన్‌కు చెందిన 'ఆక్స్‌ఫామ్' సంస్థ జనవరి 18న విడుదల చేసిన సరికొత్త నివేదిక తొలివాక్యాల్లో ఇలా పేర్కొంది: "అసమానతల సంక్షోభం పరిష్కారమవకుండా పేదరికంపై విజయం సాధించడం అసంభవం". ఆక్స్‌ఫామ్ నివేదిక ఈ కింది వాస్తవాలు ప్రకటించింది:

1. 2015లో ప్రపంచంలోని 62 మంది వ్యక్తుల వద్ద ప్రపంచ జనాభాలోని 51 శాతం జనాభా (360 కోట్ల మంది) వద్ద ఉన్న సంపదతో సమానమైన సంపద పోగుపడింది. అయిదేళ్ల క్రితం 388 మంది వ్యక్తుల వద్ద ఇంత సంపద

> **"సంపద అసమానతల్లో భారతదేశం ప్రపంచం లోనే రష్యా తరువాత అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది నవంబర్‌లో విడుదలైన క్రెడిట్ సూయిసె నివేదిక ప్రకారం దేశంలోని 1 శాతం ధనికుల చేతిలో 58.4 శాతం సంపద కేంద్రీకరించబడింది. పై 10 శాతం ధనికుల వద్ద 80.7 శాతం సంపద పోగు పడింది."**

ఉండేది.

2. అంటే 2010 – 2015 మధ్య కాలంలో 62 మంది వ్యక్తుల వద్ద సంపద 45 శాతం పెరిగింది. డబ్బు రూపంలో చూస్తే ఈ అయిదేళ్లలో వారి వద్ద 54,200 కోట్ల డాలర్లు పోగుపడి వారి మొత్తం సంపద 1.76 లక్షల కోట్ల డాలర్లు (123 లక్షల కోట్ల రూపాయలు) కు పెరిగింది.

3. ఇదే కాలంలో జనాభాలో కింద 50 శాతం పేదల చేతుల్లోని సంపద 1లక్ష కోట్ల డాలర్లు (సుమారు 70 లక్షల కోట్ల రూపాయలు) తగ్గిపోయింది. అంటే వీరి సంపద 38 శాతం తగ్గింది.

4. 21వ శతాబ్దం ప్రారంభం నుండి గడిచిన 15 సంవత్సరాల్లో పెరిగిన సంపదలో 1 శాతం మాత్రమే కింది 50 శాతం పేదలకు చేరింది. పెరిగిన సంపదలో 50 శాతం 1 శాతం ధనికులకు చేరింది.

5. ప్రపంచ జనాభాలోని కింది 10 శాతం ప్రజల ఆదాయాలు గత పాతికేళ్లలో ఏడాదికి 3 డాలర్లు (200 రూపాయలు) వంతున పెరిగాయి. అంటే వారి దినసరి వేతనం ఏడాదికి ఒక సెంటు (సుమారు 70 పైసలు) వంతున పెరిగింది.

ఈ వాస్తవాలన్నీ చెబుతూ..''ఆర్థిక అసమానతలు ఇలా పెరిగిపోవడం మనందరికీ మంచిది కాదు. ఇది అభివృద్ధినీ, సామాజిక ఐక్యతనూ దెబ్బతీస్తుంది. అయినా ప్రపంచంలోని నిరుపేదల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది'' అని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.

**అమెరికా, యూరప్‌లో**

2014 లెక్కల ప్రకారం అమెరికాలో 1శాతం ధనికుల వద్ద దేశ సంపదలో 40 శాతం పోగుపడింది. కింది 80 శాతం ప్రజల వద్ద కేవలం 7 శాతం సంపద మాత్రమే ఉంది. అనంతరం రెండేళ్లలో జరిగిన "అభివృద్ధి" తరువాత ఇప్పుడు ఆ దేశంలోని 1 శాతం ధనికుల వద్ద కింద 90 శాతం ప్రజల




వద్ద ఉన్న సంపద కన్నా ఎక్కువ ఉంది. 1970 లో 1శాతం ధనిక అమెరికన్ల వద్ద ఉన్న సంపద 28 శాతం. అప్పటి నుండి వారి సంపద పెరుగుతూ వస్తోంది.

అమెరికాలో ఆదాయ వ్యత్యాసాలు కూడా ఇదే విధంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో ఆదాయ అసమానతలు అత్యధిక స్థాయిలో ఉన్నాయి. 1982లో దేశంలోని 1శాతం ధనికులు మొత్తం ఆదాయంలో 10.8 శాతం పొందేవారు. కింది స్థాయి 90 శాతం మంది ప్రజలు 64.7 శాతం ఆదాయం పొందేవారు. 2012 నాటికి 1 శాతం ధనికుల ఆదాయం రెట్టింపై 22.5 శాతానికి చేరింది. కింది 90 శాతం ప్రజల ఆదాయం 49.6 శాతానికి దిగజారిపోయింది.

34 యూరప్, ఇతర ధనిక దేశాలు సభ్యులుగా ఉన్న ఓఇసిడిలో 10 శాతం ధనికుల సగటు ఆదాయం కింది 10 శాతం పేదల సగటు ఆదాయంతో పోలిస్తే 9.6 రెట్లు అధికం. అదే అమెరికాలో అయితే 19రెట్లు అధికం.

**భారత్‌లో**

సంపద అసమానతల్లో భారత దేశం ప్రపంచంలోనే రష్యా తరువాత అగ్రస్థానంలో ఉంది. గత ఏడాది నవంబర్‌లో విడుదలైన క్రెడిట్ సూయిసె నివేదిక ప్రకారం దేశంలోని 1 శాతం ధనికుల చేతిలో 58.4 శాతం సంపద కేంద్రీకరించబడింది. పై 10 శాతం ధనికుల వద్ద 80.7 శాతం సంపద పోగు పడింది.

ఇక కింద స్థాయిలో 50 శాతం ప్రజల వద్ద ఉన్నది కేవలం 2.1 శాతం సంపద మాత్రమే. భారత దేశంలోని సంపదలో ధనికుల వాటా అమెరికాతో పోల్చుకుంటే చాలా ఎక్కువ. అమెరికాలో 1 శాతం ధనికులు మొత్తం సంపదలో 40 శాతం కలిగి ఉంటే మన దేశంలో సుమారు 60 శాతం పోగేసు కున్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నిటితో పోలిస్తే అమెరికాలోనే అసమానతలు అత్యధికంగా ఉనాయనుకుంటే భారత దేశం ఈ విషయంలో అమెరికాను కూడా మించి పోయింది. అసమానతల్లో మనకన్నా అధ్వానంగా ఉన్నది రష్యా మాత్రమే. మన దేశంలో ఒకవైపు 80 శాతం పైగా ప్రజలు రోజుకు 20 రూపాయల ఆదాయంతో బతుకుతున్నారని ప్రభుత్వ నివేదికలే తెలుపుతుండగా మరోవైపు దేశంలో డాలరు శతకోటీశ్వరుల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. 1990 నాటికి మన దేశంలో డాలరు శతకోట్వీరులు ఒక్కరే. 2004 నాటికి ఈ సంఖ్య 9కి పెరిగింది. ఇప్పుడు అది 100కు పెరిగింది. ప్రపంచ మానవాభివృద్ధి జాబితాలో మొత్తం 188 దేశాలకు గాను భారత్ 130వ స్థానంలో ఉండగా శతకోటీశ్వరుల జాబితాలో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది.

**ప్రపంచీకరణ తరువాత మరింతగా పెరుగుతున్న అసమానతలు**

ప్రపంచీకరణ పేరుతో నయా–ఉదారవాద విధానాలు అమలుకావడం ప్రారంభించాక ఈ అసమానతలు మరింత వేగంగా పెరుగుతూ నేడు సంక్షోభం స్థాయికి చేరుకున్నాయని గణాంకాలు చూస్తే తెలుస్తుంది. 2000 – 2016 సంవత్సరాల మధ్య భారత దేశంలో 1 శాతం ధనికుల సంపద 36.8 శాతం నుండి 58.4 శాతానికి పెరిగింది. పై స్థాయిలోని 10 శాతం ధనికుల వాటా ఈ కాలంలో 65.9 శాతం నుండి 80.7 శాతానికి పెరిగింది.

కింది స్థాయిలో చూస్తే 2014లో కింద 50 శాతం ప్రజల వాటా 4.1 శాతం కాగా 2016 నాటికి రెండేళ్లలోనే అది 2.1 శాతానికి తగ్గిపోయింది. క్రెడిట్ సూయిసె నివేదిక ప్రకారం 2000 – 2015 సంవత్సరాల మధ్య భారత దేశ సంపద 2.284 లక్షల కోట్ల డాలర్లు (సుమారు 160 లక్షల కోట్ల రూపాయలు) పెరిగింది. ఇందులో 61 శాతం మొత్తాన్ని పై ఒక్కశాతం ధనికులు స్వంతం చేసుకోగా పై 10 శాతం ధనికులు 81 శాతం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇక మిగిలిన సంపద

కింది 90 శాతం ప్రజలకు దక్కింది.

**దేశాలమధ్య అసమానతలు**

దేశాల లోపల మాత్రమే కాదు దేశాల మధ్య కూడా ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అమెరికా, ఐరోపా, జపాన్‌లు నేడు ఇథియోపియా, హైతీ, నేపాల్‌ల కన్నా 100 రెట్లు ధనిక దేశాలుగా ఉన్నాయి. అనేక శతాబ్దాలుగా సామ్రాజ్యవాద దోపిడీకి గురైనందువల్ల వర్ధమాన దేశాలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నాయి, ధనిక దేశాలు మరింత ధనికమవుతున్నాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో ధనిక పేద దేశాల మధ్య అంతరం 9:1 నిష్పత్తిలో ఉండేది. ఈ కాలంలో చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలు శీఘ్ర ఆర్థికాభివృద్ధి సాధిస్తుండడం వల్ల దేశాల మధ్య అంతరాలు కొంత తగ్గినట్లు కనిపించినా ఈ దేశాల ప్రజల మధ్య అంతరాలు మాత్రం విపరీతంగా పెరిగాయి. ఉదాహరణకు అమెరికాలోని అత్యంత ధనికులైన 10 శాతం మంది ప్రజలకూ, హైతీలోని అత్యంత పేదలైన 10 శాతం మంది ప్రజలకూ మధ్య అంతరం వంద రెట్లు కాదు 10,000 రెట్లు. 1980-2000 సంవత్సరాల మధ్య తలసరి జిడిపి ఎక్కువగా ఉన్న దేశాలు ఎక్కువ అభివృద్ధి చెందాయి. వెనుకబడినవి మరింత వెనుకబడిపోయాయి. తలసరి జిడిపి రీత్యా చూస్తే ఏ లాటిన్ అమెరికా దేశమూ 35వ ర్యాంకు పైన లేదు. ఆఫ్రికాలోని ఏ దేశమూ 55వ ర్యాంకు పైన లేదు. పై స్థాయిలోని 50 దేశాల్లో అత్యధిక శాతం ఐరోపా, ఉత్తర అమెరికాలకు చెందినవే.

అందువల్ల అసమానతలు ఒకవైపు దేశాల మధ్య, మరోవైపు దేశాల లోపల ప్రజల మధ్య కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**పెట్టుబడి - కార్మికులు**

దేశాల మధ్య, దేశాల లోపల పెరుగుతున్న ఆర్థిక అసమానతలు సూపర్ ధనవంతుల ఆర్థిక శక్తిని పెంచుతున్నాయి. కార్మికులు, ఇతర శ్రామిక వర్గపు బేరసారాల శక్తిని తగ్గించేస్తున్నాయి. ఫలితంగా అన్ని దేశాల్లోనూ పేదరికం, నిరుద్యోగం పెరుగుతున్నాయి. అందరికీ అక్షరాస్యత, ఆరోగ్యం, కనీస సదుపాయాలు అందించడానికి కావలసినన్ని వనరులు ప్రపంచంలో ఉన్నప్పటికీ అధిక శాతం ప్రజలకు ఇవి దూరమవుతూనే ఉన్నాయి. సూపర్ ధనికులు రాజకీయాధికారాన్ని ఉపయోగించుకుని శ్రామిక వర్గంపై నిరంకుశ దోపిడీని అధికం చేస్తున్నారు.

ఆర్థిక అసమానతల్లో ప్రధానమైన ధోరణి ఏమంటే ఉత్పత్తిలో కార్మికవర్గం యొక్క వాటా

**“ఆర్థిక అసమానతలు పెరిగే కొద్దీ అట్టడుగు ప్రజలకు ఉపాధి అవకాశాలు మరింతగా తగ్గిపోతాయి. దాని వల్ల ఆయా కుటుంబాల్లో పిల్లలు చదువులు, ఆరోగ్యానికి దూరమవుతారు. దాని వల్ల అసమానతలు మరింత దీర్ఘకాలం కొనసాగుతాయి. దీర్ఘకాల అసమానతలు దీర్ఘకాల అభివృద్ధికి బ్రేకులు వేస్తాయి' అని నివేదిక పేర్కొంది.”**




గణనీయంగా తగ్గిపోవడం. అంటే అభివృద్ధిలో కార్మికుల వాటా క్రమంగా తగ్గిపోతున్నది, పెట్టుబడిదారుల వాటా గణనీయంగా పెరిగిపోతున్నది. గత మూడు దశాబ్దాల ప్రపంచీకరణ విధానాల ద్వారా పెట్టుబడిదారులు తమ స్థానాన్ని ఉపయోగించుకుని సంపదను మరింత ఎక్కువగా పోగుచేసుకోగలిగారని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ఆర్థికవ్యవస్థను ధనికులు రిగ్గింగు చేశారని అది పేర్కొంది. దీనికి నిదర్శనం ఈ కాలంలో వారు పన్నులు చెల్లించకపోవడం, పన్నులు ఎగ్గొట్టే ప్రదేశాలకు తమ పెట్టుబడులు తరలించడమేనని ఇది పేర్కొంది. ధనికులకు పన్నులు తగ్గిస్తే అది ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడుతుందనీ, అదంతా మన మంచికేననీ ప్రజలను ఒప్పించడానికి నయా-ఉదారవాద ఆర్థిక వేత్తలు ప్రయత్నించారు. పన్నులు లేని దేశాలకు (టాక్స్ హెవెన్స్‌కు) పెట్టుబడులు తరలించడం అనేది సంపద పోగుచేసుకోడానికి ఒక మార్గంగా పెట్టుబడిదారులు ఎన్నుకున్నారు.

ఈ కాలంలో స్థిరమైన ఉద్యోగాలు లేకపోవడం కూడా పెద్ద సమస్యగా మారిందని ఓఇసిడి సంస్థ నివేదిక పేర్కొంది. 1995-2013 మధ్య ఈ దేశాల్లో 50 శాతం ఉద్యోగాలు పెర్మినెంట్ నుండి టెంపరరీకి మారిపోయాయి. దానివల్ల వారి వేతనాలుకూడా బాగా తగ్గిపోయాయి. అయితే ఈ కాలంలో మహిళలు మరింతగా ఉద్యోగాల్లోకి రావడం వల్ల శ్రామిక కుటుంబాల ఆదాయాలు కొంత వరకు కాపాడు కోగలుగుతున్నాయి. ఇక్కడ కూడా మహిళలకు పురుషులకన్నా 15 శాతం తక్కువ వేతనాలు లభిస్తున్నాయి.


‘ఆర్థిక అసమానతలు పెరిగే కొద్దీ అట్టడుగు ప్రజలకు ఉపాధి అవకాశాలు మరింతగా తగ్గిపోతాయి. దాని వల్ల ఆయా కుటుంబాల్లో పిల్లలు చదువులు, ఆరోగ్యానికి దూరమవుతారు. దాని వల్ల అసమానతలు మరింత దీర్ఘకాలం కొనసాగుతాయి. దీర్ఘకాల అసమానతలు దీర్ఘకాల అభివృద్ధికి బ్రేకులు వేస్తాయి' అని నివేదిక పేర్కొంది.

**పెట్టుబడిదారీ వర్గాల్లోనే ఆందోళన**

“అడుగు బలహీనమై జారిపోతే మొత్తం గల్లంతవుతుంది” అని అసమానతలపై వెలువడిన ఓఇసిడి నివేదిక పేర్కొంది. సంపద పునఃపంపిణీయే దీనికి పరిష్కారమని పేర్కొంది. ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదిక దీనిపై వ్యాఖ్యానిస్తూ “పెరుగుతున్న ఆర్థిక అసమానతలు మనందరికీ నష్టదాయకం. ఇది అభివృద్ధినీ, సామాజిక ఐక్యతను అడ్డుకుంటుంది. ప్రపంచంలోని పేద ప్రజలు మరింత తీవ్రమైన పర్యవసానాలు ఎదుర్కొంటారు” అని పేర్కొంది. నయా-ఉదారవాద విధానాల వల్ల కొందరు ముందు అభివృద్ధి చెందుతారు తరువాత వారినుండి అది కిందికి విస్తరిస్తుంది (ట్రికిల్‌డౌన్ ఎఫెక్ట్) అని వాదించే వారి గురించి ఆక్స్‌ఫామ్ పేర్కొంటూ ‘సంపద కిందికి దిగకపోగా ప్రమాదకరకమైన రీతిలో పైకి పీల్చేయబడింది” అని పేర్కొంది.

ఆర్థిక అసమానతలు స్త్రీ-పురుషుల మధ్య అసమానతలను కూడా తీవ్రంగా పెంచుతున్నాయి. ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్న దేశాల్లో విద్య, వైద్యం, శ్రామిక మార్కెట్‌లో ప్రాతినిధ్యం, పార్లమెంటు, ఇతర ప్రజాస్వామ్య సంస్థల్లో పాల్గొనడం...మొదలైన అన్నిటిలోనూ స్త్రీలు ఎక్కువగా వెనుకబడిపోయారని అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎంఎఫ్) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ప్రపంచంలోని

> **"అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ ఎటువంటి అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందడమంటే అర్థం అసమా నతలు నిరాఘాటంగా పెరిగిపోవడమే. ఇంకో మాటలో చెప్పాలంటే అసమానతలు అభివృద్ధి చెందడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ వర్గ స్వభావం."**




అత్యధిక ధనికులైన 62 మందిలో 53 మంది పురుషులే.

"సమస్య పరాకాష్టకు చేరుకున్నది" అని 34 ధనిక దేశాలకు చెందిన ఓఇసిడి సంస్థ ప్రధాన కార్యదర్శి యాంజెల్ గుర్రియా పేర్కొన్నారు. 2015లో సంస్థ ఆర్థిక అసమానతలు, పేదరికంపై ఒక నివేదిక విడుదల చేసింది. "అనేక దేశాల్లో ఇటీవలి దశాబ్దాల్లో జనాభాలోని కింది 40 శాతం మందికి అభివృద్ధి ఫలాలు అందలేదు. ఇంకా కొన్ని సందర్భాల్లో అయితే పేదల ఆదాయాలు మరింత తగ్గిపోయాయి. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉండిపోతే అక్కడ సామాజిక పరిస్థితులు కల్లోలంగా మారిపోతాయి. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది" అని గుర్రియా పేర్కొన్నారు.

ఆయన చెప్పింది నిజమే. ఈ రోజు ప్రపంచ వ్యాపితంగా అమెరికా నుండి యూరప్ వరకు ఆసియా నుండి లాటిన్ అమెరికా వరకు అనేక దేశాల్లో ప్రజలకు ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకం పోతున్నది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగం వారిలో అసంతృప్తిని రగిలిస్తోంది. ఈ అసంతృప్తి అనేక దేశాల్లో కార్మిక, రైతాంగ పోరాటాలవైపు మళ్లుతోంది. అలా మళ్ళించే శక్తులు– ముఖ్యంగా కమ్యూనిస్టులు, వామపక్షాలు, ట్రేడ్‌యూనియన్ ఉద్యమాలు బలంగా లేని చోట ఈ అసంతృప్తిని మితవాద, అభివృద్ధి నిరోధక శక్తులు విచ్ఛిన్నకర ఉద్యమాలు, మతతత్వం, ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నాయి. ఈ రోజు అమెరికాలో పెరిగిన తెల్లజాతి దురహంకారంగానీ, యూరప్‌లో జడలు విప్పుతున్న ఫాసిస్టు ధోరణులుగానీ, మన దేశంలో ప్రబలిన మతోన్మాదం గానీ, అనేక దేశాల్లో ప్రమాదకరంగా పెరిగిన ఉగ్రవాదం గానీ ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు దాని నుండి ఏర్పడిన సంక్షోభం పర్యవసానాలే.

పెట్టుబడిదారీ వ్యవస్థ అనేది మానవేతర ఉత్పత్తి సాధనాలపై (పెట్టుబడిపై) కొద్దిమంది వ్యక్తులు ఆధిపత్యం వహించే వ్యవస్థ. మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో మనుషుల మధ్య సంపదలో ఏర్పడ్డ అసమానతలు ఆదాయంలో కూడా తీవ్ర అసమానతలకు దారితీస్తాయి. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ ఎటువంటి అడ్డంకులు లేకుండా అభివృద్ధి చెందడమంటే అర్థం అసమా



నతలు నిరాఘాటంగా పెరిగిపోవడమే. ఇంకో మాటలో చెప్పాలంటే అసమానతలు అభివృద్ధి చెందడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ వర్గ స్వభావం. ఈ వ్యవస్థలో ఆస్తిపరులైన మైనారిటీ... ఆస్తిలేని మెజారిటీ ప్రజానీకంపై అటు పని ప్రదేశంలో ఆర్థికంగానూ, సమాజంలో రాజకీయంగానూ ఆధిపత్యం కలిగి ఉంటారు. ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు సమాజ ఆదాయంలో పెద్ద మొత్తాన్ని చేజిక్కించుకుంటూ ఉంటారు. దేశాల మధ్య, దేశాల లోపల ప్రజల మధ్య అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయంటే అర్థం ఆస్తిపర వర్గాల ఆధిపత్యం పెరుగుతున్నట్లు, శ్రామికుల శక్తి తగ్గుతున్నట్లు.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడం, సోషలిజం కూలిపోవడం తదుపరి ప్రపంచీకరణ పేరుతో వివిధ దేశాల్లో అమలు చేయబడుతున్న నయా–ఉదారవాద విధానాలు శ్రామిక వర్గ శక్తిని బలహీన పరిచింది. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఆధిపత్యాన్ని పెంచింది. ఫైనాన్స్ పెట్టుబడి తీసుకొచ్చిన స్వేచ్ఛా మార్కెట్ ప్రపంచ వ్యాపితంగా అసమానతలు తీవ్రంగా పెంచుతోంది. ఎంతగా అంటే ఓఇసిడి సంస్థ ప్రధాన కార్యదర్శి యాంజెల్ గుర్రియా పేర్కొన్నట్లు "సమస్య పరాకాష్టకు చేరుకున్నంత". పెట్టుబడిదారీ వ్యవస్థను కూకటి వేళ్లతో కూలదోసి సోషలిజాన్ని నిర్మించుకున్నప్పుడే పరాకాష్టకు చేరుకున్న ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ❈

---

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

# నయా ఉదారవాదం కార్మికవర్గం

ఎ కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

నయా ఉదారవాద విధానాలతో కార్మిక వర్గ పొందికలో వచ్చిన ఆర్థిక, సామాజిక మార్పులను అధ్యయనం చేయటం కోసం పార్టీ ఏర్పాటు చేసిన అధ్యయన బృందం ఆ రంగంలో వచ్చిన వివిధ పరిణామాలను తాను రూపొందించిన నివేదికలో పొందుపరచింది. కార్మికవర్గంలో పార్టీ బలపడలేకపోవటానికి, కార్మికవర్గ పోరాటాలలో ఆశించినంతగా పురోభివృద్ధి సాధించలేకపోవటానికి కారణాలను అధ్యయన పత్రం స్పష్టం చేసింది.

### ఉత్పత్తిరంగంలో మార్పులు

సరళీకరణ విధానాలు ప్రారంభం కావటంతో ఉత్పత్తిరంగంలో పెద్దమార్పులు చోటుచేసుకున్నాయి. ఉత్పత్తి, ఉత్పత్తి సంబంధాలు ప్రపంచ వ్యాపితంగా విస్తరించాయి. ఈ దశలో బహుళజాతి సంస్థల కార్యకలాపాలు విస్తరించినప్పటికీ అవి భారతీయ సంస్థలను స్వాధీనం చేసుకోవటం జరగలేదు. వీరికి భారతదేశ మార్కెట్‌పై మాత్రమే ఆసక్తి ఉండటంతో అవి ప్రధానంగా ద్రవ్యరంగానికే పరిమితం అయ్యాయి మినహా ఉత్పత్తిరంగంపై కేంద్రీకరించలేదు. మరోవైపు భారతీయ సంస్థలే వివిధ దేశాలలోని సంస్థలను స్వాధీనం చేసుకుంటున్నాయి. ప్రభుత్వ విధానాలను అవకాశంగా తీసుకొని భారతీయ కార్పొరేట్ సంస్థలు విస్తరించి, బహుళజాతి సంస్థల స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. భారతదేశ ఎగుమతులు పెరుగుతున్నప్పటికీ దిగుమతులు అంతకన్నా ఎక్కువగా పెరగటంతో దిగుమతులపై ఆధారపడటం గతం కన్నా పెరుగుతున్నది.

ఉత్పత్తి వికేంద్రీకరణ పెరుగుతున్నది. ఒకచోట ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి, అక్కడ ఉత్పత్తి చేయటంపై ఆధారపడటం కాకుండా ఒకే వస్తువును తయారు చేయటానికి వివిధ విభాగాలను వివిధ ప్రాంతాలు, దేశాలలో ఏర్పాటు చేసి, ఆ విడిభాగాలన్నింటిని ఒకచోట కూర్చి వస్తువును తయారుచేసి, మార్కెట్ చేస్తున్నారు. తమకు అవసరం అనుకుంటే ఒకచోట ఉన్న పరిశ్రమను తక్షణమే మరోచోటుకు తరలిస్తున్నారు. కార్మికవర్గ ఐక్యత బలహీనపడి, పోరాటాలు వెనుకపట్టు పట్టటం, పెట్టుబడిదారుల దోపిడీకి అవకాశాలు విస్తరించటంతో పెట్టుబడిదారుల మధ్య ఉన్న వైరుధ్యాలు తాత్కాలికంగా బలహీనపడ్డాయి. అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులనే విభేదాలను పక్కన పెట్టి పెట్టుబడిదారులంతా సమైక్యంగా కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారు. ఈ పరిణామాలు పెట్టుబడిదారుల ఆధిపత్యం మరింతగా బలపడేందుకు దారితీశాయి.

### కార్మికవర్గ పొందికలో వచ్చిన మార్పులు

సరళీకరణ విధానాల కాలంలో కార్మికవర్గ పొందికలోనూ మార్పులు వచ్చాయి. సంఘటిత రంగంలో సంఘటితంగా ఉన్నవారు తగ్గి, అసంఘటిత కార్మికుల సంఖ్య పెరుగుతున్నది. కాంట్రాక్టు, క్యాజువల్, స్కీం వర్కర్లు, ఇంటినుండి పనిచేసే కార్మికులు తదితర పేర్లతో కార్మిక వర్గాన్ని విభజించి, వారి హక్కులను హరిస్తున్నారు. ప్రైవేటురంగంలో సంఘటిత కార్మికుల నియామకం తగ్గి కాంట్రాక్టు, క్యాజువల్ తదితర తాత్కాలిక కార్మికుల నియామకం బాగా పెరిగింది. ఒకేరకమైన ఉద్యోగాలలో వివిధ రకాల పేర్లతో కార్మికులను నియమిస్తున్నారు. వీరికి నామమాత్రమైన వేతనాన్ని మాత్రమే ఇస్తున్నారు. ట్రైనీల పేరుతో విద్యార్థులకు వసతి, భోజనం ఏర్పాటు చేసి, ఏ మాత్రం వేతనం చెల్లించకుండా, లేదా నామమాత్రమైన వేతనాలను మాత్రమే చెల్లిస్తూ వీరిశ్రమను దోపిడీ చేస్తున్నారు. సంఘటిత కార్మికులు కార్మికసంఘాలలో సంఘటితం కావటాన్ని, వారి బేరసారాల శక్తిని దెబ్బతీయటానికి, కార్మికుల హక్కులను హరించటానికి ఏ రక్షణలు లేని ఈ కార్మికులను ఉపయోగించుకొంటున్నారు.. ఉదాహరణకు తమిళనాడులో జపాన్‌కు చెందిన 'కెన్‌స్టార్ కంపెని' లో 1080 మంది ట్రైనీ కార్మికులు ఉండగా 73 మంది మాత్రమే శాశ్వత కార్మికులు ఉన్నారు. మొత్తం కార్మికుల్లో 15వ వంతు మాత్రమే శాశ్వత కార్మికులు కాబట్టి వారు పోరాటంలోకి దిగినా యాజమాన్యంపై పరిమితమైన ప్రభావాన్ని మాత్రమే చూపగలుగుతారు. శాశ్వత కార్మికులం దరినీ తొలగించినా ట్రైనీ కార్మికులతో యాజమాన్యం పరిశ్రమను నడపగలదు. కాబట్టి శాశ్వత కార్మికులు అయినా యాజమాన్యాన్ని నిలవేసి తమ కోర్కెలను సాధించుకోగల పరిస్థితి ఉండదు. మరోవైపున పెద్దసంఖ్యలో ఉన్న ట్రైనీ కార్మికులతో శాశ్వత కార్మికులకు సంబంధాలు తక్కువగా ఉంటాయి కాబట్టి వారిని తమతో కలుపుకొని యాజమాన్యానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలలోకి నడిపించలేరు. నిష్పత్తిలో కొంతమేరకు వ్యత్యాసాలున్నా శాశ్వత, కాంట్రాక్టు, ట్రైనీ కార్మికులకు సంబంధించి దాదాపుగా అన్ని పరిశ్రమలలోనూ ఇదే పరిస్థితి ఉన్నది.

### కార్మికవర్గ హక్కుల హరణం

కార్మికవర్గ హక్కులను హరించటానికి, వేతనాలు, సదుపాయాలను కుదించటానికి ప్రభుత్వాలే నాయకత్వం వహిస్తున్నాయి. శాశ్వత కార్మికుల సంఖ్యను తగ్గించటం, కాంట్రాక్టు, క్యాజువల్ తదితర పేర్లతో ఉద్యోగభద్రత లేకుండా, అత్యల్ప వేతనాలతో కార్మికులు, ఉద్యోగులను నియమించుకోవటంలో ప్రభుత్వాలు ప్రైవేటురంగానికి మార్గదర్శకత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వరంగంలోని పరిశ్రమలలో సంఘటిత కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమానికంటూ అమలు జరుపుతున్న వివిధ పథకాలలో నియమిస్తున్న వారిని కార్మికులు, లేదా ఉద్యోగులుగా గుర్తించటానికి నిరాకరిస్తున్నాయి. సంఘసేవకులు, వలంటీర్లు, గౌరవ కార్యకర్తలు అని పేర్లు పెట్టి, గౌరవభృతి పేరుతో నామ మాత్రమైన వేతనాలను మాత్రమే వారికి చెల్లిస్తున్నాయి. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర

**"సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి కార్మికచట్టాలను నీరు గారుస్తున్నాయి. యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవటానికి పరిశ్రమలో పనిచేస్తున్న మొత్తం కార్మికులలో 10 శాతం మంది ఉండాలని చట్టంలో మార్పు చేయటం ద్వారా కార్మికులు యూనియన్‌లను ఏర్పాటు చేసుకోవటాన్ని దాదాపుగా అసంభవం చేశారు."**

ప్రభుత్వాలు వివిధ పథకాల అమలు కోసం నియమించినవారు కోటిమంది వరకు ఉంటారు. వీరిలో మహిళలు, దళితులు, బలహీనవర్గాలకు చెందినవారు ఎక్కువ మంది ఉన్నారు. విద్యావంతులై చేయటానికి ఏ పని దొరకక నిరుద్యోగులుగా ఉన్న వీరిశ్రమను దోపిడీ చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వాలు అమలు జరుపుతున్న పథకాలలో పనిచేస్తుంటే ప్రస్తుతం తక్కువ జీతం వస్తున్నా రానున్న కాలంలో పర్మినెంటు చేయవచ్చుననే ఆశతో వీరు నామమాత్రపు వేతనానికి పనిచేస్తున్నారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారు, నిరుద్యోగులు, మహిళలు, బలహీన వర్గాలు, సామాన్యప్రజల పట్ల ప్రభుత్వాలు ఏ మాత్రం బాధ్యతతో వ్యవహరించటం లేదని వీరికిస్తున్న వేతనాలు, పని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవంగా గౌరవ కార్యకర్తలుగా, ప్రజాసేవకులుగా పనిచేయవలసిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధాని తదితరులు వేతనాలు, ఇతర అలవెన్సుల రూపంలో నెలనెలా లక్షల రూపాయలు పొందుతుండగా, కూటికి గతిలేని నిరుద్యోగులను 'వలంటీర్లు', 'కార్యకర్తలు' అని ముద్రవేసి, 'గౌరవ వేతనం' పేరుతో నామ మాత్రమైన వేతనాలు మాత్రమే చెల్లించటం ఎంత దారుణం!

సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి కార్మికచట్టాలను నీరుగారుస్తున్నాయి. యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవటానికి పరిశ్రమలో పనిచేస్తున్న మొత్తం కార్మికులలో 10 శాతం మంది ఉండాలని చట్టంలో మార్పు చేయటం ద్వారా కార్మికులు యూనియన్‌లను ఏర్పాటు చేసుకోవటాన్ని దాదాపుగా అసంభవం చేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మికసంఘాల చట్టం, కాంట్రాక్టు కార్మికుల (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) చట్టం తదితర చట్టాలను సవరించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చట్టాల అమలును నీరుగారుస్తున్నారు. యాజమాన్యం కోరుకున్నపుడు కార్మికులను తొలగించటానికి వీలుగా 'హైర్ అండ్ ఫైర్' విధానానికి వీలు కల్పించారు. కుటుంబం కనీసావసరాల ప్రాతిపదికగా కార్మికునికి ఇచ్చే కనీసవేతనం ఉండాలనే విధానానికి తిలోదకాలిచ్చారు. సెజ్‌లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలు తదితరాలలో కార్మిక చట్టాల ఉల్లంఘనకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నది. కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరించటం, చట్టాలను నీరుగార్చటం, వారి వేతనాలను, సదుపాయాలను తగ్గించటం, కార్మికులను దోపిడీ చేయటం తదితరాలు ప్రభుత్వాలు బహిరంగంగా పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి.

### స్వయం ఉపాధి మిథ్య

పని పరిస్థితులలో వచ్చిన మార్పులను ఆధారం చేసుకొని కార్మికులలో గణనీయమైన భాగాన్ని 'స్వయం ఉపాధి పొందుతున్న వారు'గా ప్రభుత్వం, యాజమాన్యాలు ముద్ర వేస్తున్నాయి. కొన్ని వృత్తులు, వ్యాపారాలు చేసుకొనేవారు, రిక్షాలు, ఆటోలు నడుపుకొనేవారు, ఇటువంటి ఇతర పనులు చేస్తున్నవారిని స్వయం ఉపాధి పొందుతున్న వారిగా చెప్పవచ్చు. వీరిలో ఎక్కువ మందికి పెద్దగా ఆదాయం ఉండదు. మిగతా స్వయం ఉపాధి పొందుతున్నారని చెబుతున్నవారిలో అత్యధికులు యజమానుల కోసం తమ ఇంటివద్ద ఉండి పనులు చేస్తున్నవారే. బహుళజాతి సంస్థలు కూడా ఔట్ సోర్సింగ్ పేరుతో ఇంటివద్ద ఉండి చేసేవారికి పని అప్పగిస్తున్నాయి. కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు, ఏజంట్లు తదితరుల ద్వారా ఈ పనులను చేయిస్తున్నారు. ఈ విధానం వలన తాము ఎవరి కోసం పనిచేస్తున్నారో కార్మికులకు తెలియదు. ఇంటి నుండి పనిచేసే కార్మికులు యజమానుల రికార్డులల్లోకి ఎక్కరు. ప్రభుత్వ లెక్కలలోనూ వీరు కార్మికులుగా నమోదు కారు. యజమానికి కార్మికుడు, కార్మికునికి యజమాని తెలియరు. ఐటి, ఐటి ఆధారిత పనులను కూడా ఇంటివద్ద నుండే చేయిస్తున్నారు. వీరిలో కొందరు మంచి వేతనాలను పొందుతున్నా, వారికి కూడా ఉద్యోగభద్రత ఉండదు. వీరికి ఏ చట్టమూ వర్తించదు. ఇంటినుండి పనిచేసేవారు తమ కుటుంబసభ్యులతో కలిసి రోజుకు ఎనిమిది, పది గంటల వరకు పనిచేసినా ఎక్కువ మందికి నెలకు వెయ్యి రూపాయలు కూడా లభించటం లేదు. ఏ గత్యంతరం లేకనే స్త్రీలు ఈ ఉద్యోగాలు చేయటానికి సిద్ధం అవుతున్నారు.

### సంఘటిత పోరాటాలకు తగ్గుతున్న అవకాశాలు

కార్మికవర్గం ఇన్ని విధాలుగా చీలిపోయి ఉన్న స్థితిలో ఒక పరిశ్రమలో, ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులను సమీకరించి, ఐక్యంగా పోరాటం చేయటానికి అవకాశాలు తగ్గిపోతున్నాయి. కార్మికులలో వచ్చిన ఈ విభజన, ఉద్యోగ భద్రత లేమి, అస్తిత్వవాద ఉద్యమాల పెరుగుదల ఐక్య పోరాటాలకు పరిమితులను విధిస్తున్నాయి. కాంట్రాక్టు, క్యాజువల్, ట్రైనీ తదితర పేర్లతో పనిచేస్తున్న కార్మికులు ఎక్కువ మంది కార్మికులుగా నమోదై ఉండరు. 2011-12లో సంఘటిత రంగంలోని వస్తుతయారీ రంగంలో పనిచేస్తున్న వారిలో 77.5 శాతం మందికి, మహిళా కార్మికులలో 91 శాతం మందికి రాతపూర్వక ఒప్పందాలు లేవు. వీరిని ఉద్యోగభద్రత సమస్య నిరంతరం వెన్నాడుతుంటుంది. కొద్దిసంఖ్యలో ఉన్న శాశ్వత కార్మికుల వేతనాలు, హక్కుల కోసం పోరాటాలపై కూడా అసంఘటిత కార్మికుల ప్రభావం ఉంటున్నది. కార్మికులను చీల్చటానికి, పోరాటాలను నిర్వీర్యం చేయటానికి యజమానులు కుల, మత, ప్రాంతీయ భావాలు, ఉద్యమాలను ఉపయోగించుకుంటున్నారు.

### పెట్టుబడికి వరప్రసాదంగా వలసలు

కార్మికుల వలసలతో పాటు పెట్టుబడి వలసలు కూడా పెట్టుబడిదారులకు ప్రయోజనం కల్పిస్తున్నాయి. తాము ఒకప్రాంతంలో ప్రారంభించిన పరిశ్రమలో స్థానికులను తీసుకోకుండా దూరప్రాంతాల నుండి వలసలు వచ్చిన వారిని కార్మికులుగా తీసుకుంటున్నారు. కార్మికవర్గాన్ని బలహీనపరచటంలో ఇది యజమానులకు

అత్యంత ప్రయోజనకరంగా ఉన్నది. వలస వచ్చిన కార్మికులకు స్థానిక ప్రజలతో సంబంధాలు ఉండవు. స్థానికంగా ఉండే సామాజిక బృందాలకు సంబంధం లేనివారు కూడా వలస వచ్చినవారిలో పెద్దసంఖ్యలో ఉండవచ్చు. దూర ప్రాంతాల నుండి తమ గ్రామాలకు వలస వచ్చినవారు తమప్రాంతంలో ఉన్న పరిశ్రమలలో పనిచేయటం, తాము పనులు లేకుండా ఉండవలసి రావటం స్థానిక కార్మికులలో వలస కార్మికులపై ద్వేషాన్ని పెంచుతున్నది. కార్మికులకు యాజమాన్యంపై అసంతృప్తి పెరిగి పోరాటాలకు దిగినపుడు వలస కార్మికులకు స్థానిక కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతుల మద్దత్తు లభించటం లేదు. స్థానిక భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు, ధనికులతో పరిశ్రమల యాజమాన్యాలు సంబంధాలు పెట్టుకుని వారిద్వారా గ్రామాలలోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలను తమవైపు నిలుపుకోవటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలలో కొంతవరకు జయప్రదం అవుతున్నారు. ఫలితంగా ఒక పరిశ్రమలో దోపిడీకి గురవుతున్న కార్మికులు సమ్మె చేస్తుంటే ఇతర పనులు చేస్తూ దోపిడీకి గురవుతున్న కార్మికులు వారికి సంఘీభావం తెలియజేయకపోగా, అపుడపుడు వ్యతిరేకంగా కూడా వ్యవహరించటం జరుగుతున్నది. అస్థిత్వవాద ఉద్యమాలు సామాజిక బృందాలను సంఘటితం చేయటం ద్వారా కార్మికవర్గాన్ని బలహీనపరిచాయి.

దీనితోపాటు పెట్టుబడిని, పరిశ్రమను ఇతర చోట్లకు తరలించటానికి ( పెట్టుబడి వలస వెళ్ళటానికి) పెరిగిన అవకాశాలు కూడా కార్మికవర్గాన్ని అణచివేయటానికి పెట్టుబడిదారీ వర్గానికి అవకాశాలను కల్పిస్తున్నాయి. కార్మికులు తమ వేతనాల పెంపుదల, హక్కుల సాధన కోసం ఒక పరిశ్రమలో పోరాటాలు ప్రారంభించినపుడు పెట్టుబడిదారులు తమ పరిశ్రమలను వేరే ప్రాంతాలకు, వేరే దేశాలకు తరలిస్తున్నారు. తమ పరిశ్రమలకు ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీల గడువు ముగిసిపోయిన సందర్భాలలో కూడా కొన్ని పరిశ్రమలు ఇదేవిధంగా వ్యవహరిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ కార్మికవర్గాన్ని అణచివేయటానికి, పెట్టుబడిదారీ వర్గం తమపట్టును మరింత పెంచుకోవటానికి ఉపయోగపడుతున్నాయి.

> **“సోషలిస్టు ప్రభుత్వ చర్యలు ప్రపంచ కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచాయి. దేశదేశాల కార్మికవర్గంలోకి కమ్యూనిస్టు సిద్ధాంతం చొచ్చుకుపోయింది. జాతీయ విముక్తి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిశాయి. ఈ పరిణామాలతో కంగుతిన్న పెట్టుబడిదారీ వర్గం తన ఆధిపత్యాన్ని కాపాడుకోవటం, కార్మికవర్గాన్ని శాంతపరచటం కోసం తానుకూడా కార్మికులకు కొన్ని హక్కులను ఇవ్వకతప్పలేదు.”**



ఐక్యంగా పోరాడుతున్న కార్మికులు

**కమ్యూనిస్టు సిద్ధాంతం సోషలిజం ప్రభావం**

స్వాతంత్ర్యానంతరం సాధించుకున్న వేతనాలు, అనుభవిస్తున్న హక్కులు, సామాజిక భద్రత తదితరాలు మనదేశంలోని పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గానికి ఆయాచితంగా ఇచ్చినవి కాదని, పెట్టుబడిదారీ వర్గానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భీకర పోరాటాలు చేసి, తమ రక్తాన్ని చిందించి, ప్రాణాలను ఫణంగా పెట్టటం ద్వారా ప్రపంచ కార్మికవర్గం ఈ హక్కులను సాధించిందన్న వాస్తవం నూతనతరం కార్మికుల స్పృహలో లేదు. యూరప్, అమెరికాలలో ముందుగా ఉనికిలోకి వచ్చిన కార్మికవర్గం తమపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడి, కొన్ని హక్కులను సాధించింది. రష్యాలో 1917లో కమ్యూనిస్టు పార్టి నాయకత్వాన కార్మికవర్గం విప్లవాన్ని జయప్రదం చేసి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టుపార్టి నాయకత్వంలోని సోవియట్ ప్రభుత్వం అనేక దశాబ్దాల నుండి ప్రపంచ కార్మికవర్గం డిమాండ్ చేస్తున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, ప్రతివారికి ఉద్యోగహక్కు, ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్, ఇతర సామాజిక భద్రతా సదుపాయాలను కల్పించింది. సోషలిస్టు ప్రభుత్వ చర్యలు ప్రపంచ కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచాయి. దేశదేశాల కార్మికవర్గంలోకి కమ్యూనిస్టు సిద్ధాంతం చొచ్చుకుపోయింది. జాతీయ విముక్తి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిశాయి. ఈ పరిణామాలతో కంగుతిన్న పెట్టుబడిదారీ వర్గం తన ఆధిపత్యాన్ని కాపాడుకోవటం, కార్మికవర్గాన్ని శాంతపరచటం కోసం తానుకూడా కార్మికులకు కొన్ని హక్కులను ఇవ్వకతప్పలేదు. ఈ పూర్వరంగంలో జరిగిన జాతీయోద్యమం, కమ్యూనిస్టు, కార్మికవర్గ ఉద్యమాల ప్రభావంతో మనదేశంలోని కార్మికవర్గం కూడా కనీస వేతనం,ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాలు, ఉచిత విద్య, వైద్యం, పెన్షన్ తదితర హక్కులను సాధించుకున్నారు.

రెండవ ప్రపంచయుద్ధానంతర పరిణామాలు పెట్టుబడిదారీ వర్గానికి బలాన్ని చేకూర్చాయి. సామ్రాజ్యవాదం బలపడింది. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో జరిగిన పొరపాట్ల వలన సోవియట్, తూర్పు యూరప్ దేశాలలోని సోషలిస్టు వ్యవస్థలు కూలిపోయాయి. ఈ పరిణామాలతో నయా ఉదారవాద విధానాలను ప్రపంచవ్యాపితంగా అమలు చేయటానికి సామ్రాజ్యవాదం పూనుకున్నది. సోషలిజం, కమ్యూనిస్టు, కార్మికవర్గ ఉద్యమాలు బలహీనపడటంతో ప్రపంచ కార్మికవర్గం సాధించుకున్న హక్కులను హరించటం పెట్టుబడిదారీ వర్గానికి సులభమైంది. పురాతన సంపద సంచయం జరిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభకాలం నాటి పరిస్థితులను

> **"ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో కార్మికవర్గాన్ని ఐక్యం చేయటం ద్వారా మాత్రమే సామ్రాజ్య వాదం, పెట్టుబడిదారీ వర్గం చేస్తున్న దాడిని ప్రతిఘటించటం, కార్మికవర్గ ప్రయోజనా లను కాపాడటం సాధ్యం అవుతుంది. కమ్యూనిస్టు పార్టి, కార్మిక సంఘాలు కార్మికవర్గాన్ని సమీకరించ టానికి, ఐక్యం చేయటా నికి సర్వశక్తులూ ఒడ్డాలి."**

కార్మికవర్గంపైనా, అభివృద్ధి చెందుతున్న దేశాలపై పరోక్ష వలస విధానాన్ని రుద్దటానికీ సామ్రాజ్యవాదం ప్రయత్నాలు చేస్తున్నది. ఫలితంగా దేశంలోని కార్మికవర్గం దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. పాలకవర్గాలు దేశస్వాతంత్ర్యాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదానికి తాకట్టు పెడుతూ, కార్మికవర్గ హక్కులను హరిస్తున్నాయి. కార్మికవర్గం సాధించుకున్న హక్కులు పెట్టుబడిదారీ వర్గం దయాభిక్ష కాదని, కార్మికవర్గం సంఘటిత పోరాటాల ద్వారా సాధించుకున్నవనే వాస్తవాన్ని కార్మికులలో ప్రచారం చేయాలి. సాధించుకున్న హక్కులను అనుభవించటానికి, రావలసిన వాటిని సాధించుకోవటానికి నిరంతరం పోరాటాలు చేయకపోతే పాలకులు ఉన్న హక్కులనే హరించివేస్తారనే వాస్తవాన్ని ప్రస్తుత అనుభవాల నుండి వారికి నేర్పాలి. కార్మికవర్గ ఉద్యమాల అభివృద్ధికి ఆటంకాలు కల్పించటంతో పాటు కార్మికవర్గాన్ని సంఘటితం చేయటానికి, ఐక్య పోరాటాలకు అవసరమైన భౌతిక పరిస్థితులను కూడా నయా ఉదారవాదం కల్పిస్తున్నది.

**పెట్టుబడికి శ్రమశక్తికి మధ్య తీవ్రమౌతున్న వైరుధ్యం**

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గాన్ని దోపిడీ చేయటం తీవ్రమైంది. 1980 సంవత్సరంలో యజమానులకు 15 శాతంగా ఉన్న లాభాలు 2009 సంవత్సరం నాటికి 55 శాతానికి పెరిగాయి. ఇదేకాలంలో కార్మికుల వేతనాలు 30 శాతం నుండి 9.5 శాతానికి పడిపోయాయి. 30 సంవత్సరాలలో లాభాలు మూడున్నర రెట్లకు పైగా పెరగగా, కార్మికుల వేతనాలు మూడోవంతుకు తగ్గిపోయాయి. పెట్టుబడికి శ్రమశక్తికి మధ్య తీవ్రమౌతున్న వైరుధ్యాన్ని ఈ అంకెలు సష్టం చేస్తున్నాయి. అయితే అంకెలలో కనిపిస్తున్నప్పటికీ, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేస్తున్న పోరాటాలలో ఈ వైరుధ్యం యొక్క తీవ్రత ప్రతిబింబించటం లేదు. ఇందుకు కారణాలను ఇంతకు ముందే చర్చించాం. పోరాటాలలో ప్రతిబింబించనంత మాత్రాన కార్మికవర్గంలోని వ్యతిరేకత ఇంకేమార్గంలోనూ పెల్లుబకదని భావించటం సరికాదు. వివిధ సామాజిక అంశాలు, కుల, మత, ప్రాంతీయ ఉద్యమాలు తదితర రూపాలలో సమీకృతం కావటం ఈ వ్యతిరేకత వ్యక్తమౌతున్న మార్గాలలో కొన్ని. ఈ విధమైన సమీకరణలను ప్రోత్సహించటం ద్వారా కార్మికవర్గ ఉద్యమాలను బలహీనపరచటానికి, తమ ఆధిపత్యాన్ని కొనసాగించుకోవటానికి పాలకవర్గాలు ప్రయత్నం చేస్తున్నాయి. కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తున్నవారే తత్ఫలితంగా తలెత్తుతున్న అసంతృప్తిని వినియోగించుకుంటూ, కార్మికవర్గాన్ని మరింతగా చీలికలు పీలికలు చేసి అణచివేస్తున్నారు. ఇటువంటి స్థితిలో పెట్టుబడిదారీ వర్గంపై పోరాడటానికి కార్మికవర్గాన్ని ఏ విధంగా సమీకరించాలన్న సమస్య ముందుకు వస్తున్నది.

**కార్మికవర్గాన్ని ఎలా సమీకరించాలి**

కార్మికవర్గాన్ని సమీకరించటానికి గతం నుండి అమలుచేస్తున్న పని పద్ధతులతో ఉపయోగం లేదని అనుభవం స్పష్టం చేస్తున్నది. మారిన పరిస్థితులకు అనుగుణంగా మనపని పద్ధతులను మార్చుకోవాలి. సైద్ధాంతిక, రాజకీయ అవగాహనతో పాటు సరళీకరణ విధానాల ప్రభావంపై కార్యకర్తలకు స్పష్టమైన అవగాహన ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని సంఘటిత రంగంలోని కీలక, వ్యూహాత్మకమైన పరిశ్రమలు, రంగాలపై కేంద్రీకరించాలి. సంఘటిత కార్మికులతో పాటు అసంఘటితరంగం, గృహ ప్రాతిపదికగా పని చేస్తున్న అన్ని తరగతుల కార్మికులను చేరుకోవాలి. ఆధునిక సాంకేతిక, సమాచార సాధనాల ద్వారా, ప్రత్యక్షంగానూ వారితో సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలి. నివాసప్రాంతంలో వారెదుర్కొంటున్న సమస్య లను తీసుకోవాలి. కార్మికులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను మాత్రమే కార్మికసంఘాలు, కమ్యూనిస్టుపార్టి తీసుకొని పనిచేస్తూ, మరికొన్ని సమస్యలను పెట్టుబడిదారీ రాజకీయ పార్టీలు, నాయకులు, కుల, మత సంఘాలకు వదిలివేస్తే కార్మికవర్గాన్ని పెట్టుబడిదారీ వర్గ రాజకీయ పార్టీల పట్టునుండి బయట పడవేయటం సాధ్యం కాదు. కాబట్టి పని ప్రదేశంతో ప్రారంభించి ఇంటినుండి పనిచేస్తున్న కార్మికుల వరకు, నివాసప్రాంతాలలోనూ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను కార్మికసంఘాలు, కమ్యూనిస్టు పార్టి తీసుకోవాలి. ఆ సమస్యలన్నింటినీ మనం పరిష్కరించలేకపోవచ్చు. కాని ఆ సమస్యల పరిష్కారానికి చివరి వరకు ప్రయత్నం చేయటం ద్వారా బూర్జువా పార్టీలు, నాయకుల నిజస్వరూపాన్ని బట్టబయలు చేయటం, మనం కార్మికుల విశ్వాసం పొందటం సాధ్యం అవుతుంది. ఈ ప్రయత్నాలలో భాగంగానే ప్రస్తుతం కార్మికవర్గంలో మెజారిటీగా ఉన్న, సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన అనంతరం కార్మికులుగా మారిన యువ కార్మికులతో సంబంధాలు పెట్టుకోవాలి. వారిని ఆందోళనలలోకి సమీకరిస్తూ ప్రచారం నిర్వహించటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వారి నుండి సాధ్యమైనంత ఎక్కువ మందిని కార్యకర్తలుగా తయారు చేసుకొనే ప్రయత్నం చేయాలి. ఐటి, ఇతర రంగాలలో పనిచేస్తున్న మధ్యతరగతి ఉద్యోగుల మద్దత్తును పొందటానికి ప్రయత్నం చేయాలి. కార్మికులకు ఉద్యోగభద్రత లేని, ప్రతి పరిశ్రమలోనూ కార్మికులు వివిధ విభాగాలుగా విభజించబడిన పరిస్థితులలో తమ హక్కులు, వేతనాలు, ఇతర సమస్యలపైనా, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి వారిని ఏ విధంగా సన్నద్ధం చేయగలమనేది నిరంతరం అధ్యయనం చేస్తుండాలి. దళితులు, మహిళలు, బలహీన వర్గాల నుండి వచ్చిన వారిలో పని చేయటంపై ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. మనం పనిచేస్తున్న సంఘాలు, ప్రాంతాలలో వివక్ష, అణచివేత ధోరణులను మన కార్మికసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాలి. ఆ సమస్యలపై ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టాలి.

ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో కార్మికవర్గాన్ని ఐక్యం చేయటం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వర్గ దాడిని ప్రతిఘటించటం, కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడటం సాధ్యం అవుతుంది. కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాలు కార్మికవర్గాన్ని సమీకరించటానికి, ఐక్యం చేయటానికి సర్వశక్తులూ ఒడ్డాలి.

❋

**అక్టోబర్ సోషలిస్టు విప్లవ శతవార్షిక ప్రత్యేకం**

# రైతులందరికీ భూమి

**(1917 నవంబరు 7వ తేదీన అధికారంలోకి వచ్చిన తర్వాత సోవియట్ ప్రభుత్వం భూ పంపకానికి సంబంధించి జారీచేసిన డిక్రి.)**

1. ఏ రకమైన పరిహారం లేకుండా భూమి పై హక్కు రద్దు చేయబడింది.

2. రాజుల, మతసంస్థల, చర్చిల సంస్థా నా లు అందులో ఉన్న జీవులు, పనిముట్లు, భవనాలు, ఇతరములతో సహా వోలోస్ట్ భూ కమిటీ అధీనంలోనూ, శాసనసభ ప్రారంభం కానందువలన సోవియట్ రైతుల డిప్యూటీల ఆధీనంలోనూ ఉంచబడ్డాయి.

3. స్వాధీనం చేయబడిన ఆస్తులన్నీ ఇకపై ప్రజలకే చెందుతాయి. అందువలన వాటిని ధ్వంసం చేయడం పెద్ద నేరమౌతుంది. వారికి విప్లవ కోర్టులు శిక్షలు విధిస్తాయి. స్వాధీనం చేసుకున్న సంస్థానాల వివరాలను, అవి స్వాధీనం చేసుకుంటున్న సమయంలో వాటి పరిణామం అందులోని ఆస్తుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, అవి పశువులైనా, భవనాలైనా, పంటలైనా, వ్యవసాయ క్షేత్రాలను ఖచ్చితమైన విప్లవ నిబద్ధతతో ప్రజలకు స్వాధీనం చేయటం జరగాలి.

4. శాసనసభలో నిర్ణయం తీసుకొనే వరకు 242 స్థానిక రైతు శాసనాల నుండి గ్రహించిన ఈ క్రింది శాసనాలు ఇజ్‌వెస్టియా సిరోసిస్‌కాగో సొనెటా క్రెస్‌టూన్ కిక్ డిప్యూటటోవ్ 88వ సంచికలో ప్రచురించబడినవే ఇవి భూసంస్కర ణల చట్టాలుగా అమలవుతాయి.

**భూమిపై రైతుల శాసనాలు...**

"జన సమ్మతమైన శాసనసభ ఏర్పడిన తరువాతే భూ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించబడుతుంది"

"భూ సమస్య సమంజసంగా పరిష్కరించ బడాలంటే ఈ క్రింది విధంగా చేయాలి".

"మొత్తంగా భూమంతా, దేశానికి సంబంధించినది, రాజుకి, మత సంస్థలకు, చర్చిలకు, ఫ్యాక్టరీలకు, వ్యక్తిగతమైన భూస్వా ములు, ఎవరిదైనా ఏ పరిహారం లేకుండా స్వాధీనం చేసుకోబడుతుంది. అది ప్రజలందరి ఆస్తిగా పరిగణించబడుతుంది. దానిపై వ్యవ సాయం చేసేవారికే చెందుతోంది. విప్లవం వలన ఆస్తులు నష్టపోయినవారు కొత్త జీవన విధానానికి అలవాటు పడేంతవరకు, కొద్ది రోజులు పరిహారం ఇవ్వబడుతుంది. గనులు, చమురు, బొగ్గు, ఉప్పు మొదలైన అన్ని భూగర్భ సంపదలు, దేశ వన, జలసంపదలు దేశ ప్రయోజనాలకే ఉపయోగించబడతాయి. అన్ని చిన్న నదులు, సరస్సులు, అడవులు స్థానిక ప్రజా నీకానికే ఉపయోగపడతాయి. స్థానిక ప్రభుత్వాలే వాటిని నడుపుతాయి.

"పట్టణాలలోగాని పల్లెలలోగాని ఉన్న పెరటి తోటలు, పూలతోటలు, కాయగూరల తోటలు, వారి సొంతదారులకే దాఖలు చేయబ డతాయి. వాటి పరిమాణాన్ని బట్టి వాటిపై వేసే పన్ను గురించి చట్టం చేయబడుతుంది.


ИЗВѢСТІЯ
Центральнаго Исполнительнаго Комитета
и Петроградскаго Совѣта
Рабочихъ и Солдатскихъ Депутатовъ
ДЕКРЕТЪ О ЗЕМЛѢ

**రైతులకు భూమి పంచుతూ సోషలిస్టు సోవియట్ యూనియన్ జారీ చేసిన తొలి డిక్రీ**

4. గుర్రపుశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కుక్కలు, కోళ్ళఫారాలు స్వాధీనం చేసు కోబడతాయి. ఈ ఆస్తులన్నీ ప్రజల ఆస్తులుగా పరిగణించబడతాయి. వాటి పరిమాణాన్నిబట్టి రాష్ట్రం, కమ్యూన్ కొరకు ఉపయోగపబడతాయి. నష్టపరిహారం గురించి శాసనసభలో చర్చించ బడుతుంది.

5. సంస్థానాల నుండి స్వాధీనం చేసుకున్న పశుసంపద, పనిముట్లు, వాటి పరిమాణం, ప్రాముఖ్యతలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రం లేదా కమ్యూన్ కొరకు, ఉపయోగించబడతాయి. వీటికి ఏమాత్రం నష్టపరిహారం చెల్లించబడదు. "చిన్న కమతాలున్న రైతుల వ్యవసాయ పనిముట్లు స్వాధీనం చేసుకోబడవు.

6. వారి శ్రమతో సొంత వ్యవసాయం చేసుకునేందుకై భూమిని వినియోగించుకొనే హక్కు రష్యా దేశంలోని ప్రతి పౌరునికి ఉంటుంది (లింగభేదం లేకుండా). వారి కుటుంబ సభ్యుల సహాయం తీసుకోవచ్చు. వేరొకరితో కలిసి దున్నుకోవచ్చు. అయితే క్రమంగా

**(మిగతా 25వ పేజీలో)**

# వైబ్రాంట్ గుజరాత్ వట్టి బూటకం



రచయిత్రి ప్రముఖ జర్నలిస్టు

**దివ్యా త్రివేది**

జనవరి 7న మేహుల్ పొద్దున్నే రోజువారీ దినచర్యలో భాగంగా గాంధీనగర్‌లో బండిపైన అమ్మే టీ కోసం వెళ్ళి అది అక్కడ లేదని గమనించాడు. ఆరోజు సాయంత్రం కూడ బండి కనిపించలేదు. మరుసటి రోజు కూడ తన దినచర్య తప్పింది. ఇతరులను విచారించిన మీదట ఆ టీ బండి రోజువారీగా ఉండే ప్రాంతానికి కొన్ని మైళ్ళ దూరంలో వున్నట్లు గుర్తించాడు. "ఏమి జరిగింది?" అని అడిగాడు. ఆ బండి యజమాని "వెలిగిపోతున్న గుజరాత్" అని అహ్మదాబాద్ నుండి గాంధీనగర్ వరకు ఉన్న బండ్లపై వ్యాపారం చేసుకునే వారిని ఆయా ప్రాంతాలను వదిలి వెళ్ళమని చెప్పారని ఆవేదనతో చెప్పాడు. దీనికి కారణం వైబ్రాంట్ గుజరాత్ శిఖరాగ్ర సమావేశం. "ఇది వెలిగిపోతున్న గుజరాత్, కానీ ఇది మా వ్యాపారాన్ని దెబ్బతీసింది" అని ఆ వ్యాపారితో పాటు మేహుల్ చుట్టు గుమికూడినవారంతా అన్నారు.

అహ్మదాబాద్ నుండి గాంధీనగర్ వరకు 'హైవే' అంతా వాస్తవానికి గతంలో ఏనాడు లేనంత శుభ్రంగా, పచ్చగా కనిపించింది. ఆ ప్రాంతాన్నంతా పరిశుభ్రంగా ఉంచారు. ఈ సమావేశానికి హాజరవుతున్న విదేశీ ప్రతినిధులకు ప్రధాని నరేంద్రమోడీ చూపించాలనుకున్న 'వెలిగిపోతున్న గుజరాత్' ను ప్రతిబింబించని చెత్త అంతా తీసివేయబడింది.

విద్యుత్ దీపాలు, మంచులో దారి చూపించే దీపాలు ఆ పరిసర ప్రాంతాలలోని చెట్లకు వేలాడదీయబడినాయి. "ఇవన్నీ ఆరు రోజుల క్రితమే ఏర్పాటు చేశారు. ఇవి కేవలం తాత్కాలికమైనవి. సమావేశం ముగిసిన వెంటనే వీటన్నింటినీ తొలగిస్తారని "స్థానికంగా ఉండే వ్యక్తి పేర్కొన్నాడు. ఈ సమావేశానికి 7 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. కానీ వ్యాపార నిపుణులు ప్రభుత్వం వేసిన అంచనా తక్కువని అంటున్నారు.

వైబ్రాంట్ గుజరాత్ శిఖరాగ్ర సమావేశం వేదిక – 'మహాత్మా మందిరం' ఏ విధమైన అలంకరణలు లేకుండా దాని చుట్టుప్రక్కల ప్రాంతానికి భిన్నంగా ఏర్పాటు చేయబడింది. 2011లో 34 ఎకరాలలోఈ వేదిక ఆశ్చర్యపరిచే విధంగా 215 కోట్లతో నిర్మించ బడింది. ఈ దేశంలో అత్యంత పెద్ద సభా కేంద్రాలలో ఇది ఒకటి. పటిష్టమైన బ్రిడ్జిపై ఇనుప ఇరుసులతో ఏర్పాటు చేయబడిన ఎస్కలేటర్స్‌ను చూసినపుడు "విదేశంలో" ఉన్న భావన కల్గుతుందని ఒక టెలివిజన్ జర్నలిస్ట్ పేర్కొన్నాడు.

ప్రశ్నించేతత్వాన్ని అణచివేసే కళలో రాష్ట్రం మంచి నైపుణ్యాన్ని సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోని భావ్‌నగర్‌లో జరిగిన హింస రాష్ట్ర పోలీసులను గందరగోళపరచి, పెట్టుబడిదారుల సమావేశాన్ని (ఈ సంవత్సరం) భంగపరచినట్లు కాకుండా గుజరాత్‌లో నిరసనకారులపై ముందుగానే చర్యలు తీసుకున్నారు. రాష్ట్రీయ దళిత అధికార్ మంచ్ కన్వీనర్ జిగ్నేష్ మేవాని, గుజరాత్ ఖేదత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి సాగర్ రబరి, ఇంకా ఇతరులను నిర్బంధించారు. "వైబ్రాంట్ గుజరాత్ సమావేశం"ను దేశంలో పెద్ద అవినీతిగా భావిస్తూ దానిని మేం బహిష్కరిస్తాం అని ప్రకటన చేసినందుకు నన్ను అరెస్ట్ చేశారు. రైతు సంఘాల నాయకులు, దళిత, పటీదార్‌ల నాయకులందరు అరెస్ట్ చేయబడినారు. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. ఈ 'వైబ్రాంట్ గుజరాత్ సమావేశం' ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడతాయని మోడీగారిని అడిగితే సమాధానం లేదు. సారవంతమైన రైతుల భూములను పారిశ్రామిక వేత్తలకు ఎందుకు అప్పచెప్తున్నారని ప్రశ్నిస్తే వారు మమ్ములను అభివృద్ధి నిరోధకులని అంటున్నారు. భూమి పెద్ద పెద్ద వ్యాపార, కార్పొరేట్ సంస్థలకు అందుబాటులో ఉంటుంది, కానీ భూమిలేని దళిత, గిరిజన ప్రజలకు కాదు", అని మేవానీ పేర్కొన్నాడు.

అతనికి వ్యతిరేకంగా ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్.) సమర్పించిన తరువాత తన ఇంటి నుండి తీసుకొని వెళ్ళారు. నలుగురు కంటే ఎక్కువ మంది కలిసి తిరగడానికి వీలులేని 144వ సెక్షన్ క్రింద అతను అరెస్ట్ చేయబడినాడు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 56,873 ఎకరాల భూమి ఎస్సీ, ఎస్టీ ప్రజలకు కేటాయిస్తూ పత్రాలు జారీ చేయబడినాయి. కానీ ఆ భూమి అగ్రకుల భూస్వాముల స్వాధీనంలో ఉంది. అట్టి భూమిని ఎస్సీ, ఎస్టీ పేదలకు అప్పగించాలని మేవానీ, ఇతరులు డిమాండ్ చేస్తున్నారు. 2006లో 115 మంది భూమిలేని దళిత కుటుంబాలకు పరోడా గ్రామంలో 222 బిఘాల భూమి సీలింగ్ చట్టం ప్రకారం కేటాయించబడింది. కానీ 9 సం.ల అనంతరం కూడా పేద ప్రజలు ఆ భూమిని పొందలేక పోయారు. 2010లో న్యాయవాది, సామాజిక కార్యకర్త అయిన ముకుల్ సిన్హా అహ్మదాబాద్, సురేంద్రనగర్ జిల్లాలలో భూమిని కేటాయించనందుకు గుజరాత్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశాడు.

2015లో మేవానీ అనే న్యాయవాది 56,873 ఎకరాల భూమికి సంబంధించిన కేసులపై పిటిషన్‌తో కలిపి దాఖలు చేయడం జరిగింది. భూమిని పునర్విభజన చేయాలన్న ఉద్యమంతో చర్యలు వేగవంతం అయ్యాయి. పరోడా గ్రామంలో భూమిని గుర్తించే పని ప్రారంభమయ్యింది. 2016 సెప్టెంబర్‌లో ప్రభుత్వ వాగ్దానాలు తప్ప ఏ విధమైన ప్రగతి సాధించలేదు. గుజరాత్ ప్రభుత్వం వ్యాపార ప్రాజెక్టులకు, సదస్సులు జరిగే కేంద్రాలకు చాలా తేలికగా భూమి కేటాయిస్తుంది. కానీ చట్టబద్ధంగా దళితులకు చెందిన భూమిని వారికి స్వాధీనపరచడానికి మాత్రం తిరస్కరిస్తుంది. రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి 5 ఎకరాల

భూమిని ఇవ్వాలని మేవానీ, ఇతరులు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు.

రెండు సంవత్సరాల కొకసారి జరిగే ఈ శిఖరాగ్ర సమావేశం ప్రస్తుతం 8వది. ఇంతకు పూర్వం రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థల మధ్య జరిగే ఒప్పందాలు బహిరంగంగా కెమెరాలు, పత్రికా విలేకరుల ముందు జరిగేవి. వార్తా పత్రికలు పతాక శీర్షికలలో ఆ ఒప్పందాలను బహిర్గతపరచి "అభివృద్ధి" అంతా మోడీ, గుజరాత్ చుట్టూ ఉన్నట్లుగా ఒక భ్రమ సృష్టించే వారు. కానీ వాస్తవ పెట్టుబడులకు సంబంధించిన ప్రశ్నలు ఉత్పన్నం అవుతుండడం, వాగ్దానాలు చేసిన పెట్టుబడులలో కేవలం 10 శాతం పెట్టుబడులు మాత్రమే అమలులోకి వచ్చినట్లు అంచనాలు వేయబడడం వల్ల 2013 నుండి రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను ప్రకటించే ప్రక్రియ నుండి వెనుకకు తగ్గుతూ వచ్చింది. 2003 నుండి నేటి వరకు 81,153 ఒప్పందాలపై సంతకాలు చేయబడినాయి. పెట్టుబడులు సంవత్సర సంవత్సరానికి పెరుగుతూ వచ్చాయి. రు.66,068 కోట్లు (2003లో), 1,06,160 కోట్లు (2005), 4,65,309 కోట్లు (2007), 12,34,898 కోట్లు (2009), 20,83,182 కోట్లు (2011), 12 లక్షల కోట్లు (2013), 25 లక్షల కోట్లు (2015). 2017కు సంబంధించిన సంఖ్యలు ప్రకటించబడలేదు.

> **"ప్రతి సమావేశం అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడుల కొరకు విన్నపాలు వచ్చినప్పటికీ, అవి అన్నీ అబద్ధం అని రాష్ట్ర ప్రభుత్వ స్వంత లెక్కలు చెపుతున్నాయి. వాగ్దానం చేయబడిన పెట్టుబ డులలో కేవలం 1 శాతం పెట్టుబడులు మాత్రమే ఫలప్రదమయ్యాయని 2011లో గుజరాత్ ప్రభుత్వం చేసిన సామాజిక-ఆర్థిక సమీక్షలో చూపించడం జరిగింది."**

**ప్రచారం వాస్తవం:** ప్రతి సమావేశం అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడుల కొరకు విన్నపాలు వచ్చినప్పటికీ, అవి అన్నీ అబద్ధం అని రాష్ట్ర ప్రభుత్వ స్వంత లెక్కలు చెపుతున్నాయి. వాగ్దానం చేయబడిన పెట్టుబ డులలో కేవలం 1 శాతం పెట్టుబడులు మాత్రమే ఫలప్రదమయ్యాయని 2011లో గుజరాత్ ప్రభుత్వం చేసిన సామాజిక-ఆర్థిక సమీక్షలో చూపించడం జరిగింది. మిగిలిన ప్రాజెక్టులన్నీ అమలుకు సంబంధించిన వివిధ దశలలో ఉన్నాయి. కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ చూపిన లెక్కల ప్రకారం 2013-14లో భారతదేశ జి.డి.పి లో గుజరాత్ వాటా 7.3 శాతం మాత్రమే. అంటే మొత్తంగా రాష్ట్ర ఉత్పత్తి రు.15,10,132 కోట్లు. అదే భారతదేశ జి.డి.పి.లో మహారాష్ట్ర నుండి సింహభాగం 14.42 శాతం తరువాత ఉత్తరప్రదేశ్ 8.24 శాతం, తమిళనాడు 8.16 శాతం, గుజరాత్, పశ్చిమబెంగాల్ (6.75 శాతం) కన్నా కొంచెం ఎక్కువ. 2016 సెప్టెంబర్ వరకు రాష్ట్ర పరిశ్రమల కమీషనర్ నుండి వచ్చిన లెక్కల ప్రకారం పారిశ్రామిక ఒప్పందాలలో దాదాపు సగం వరకు అమలు దశలో ఉన్నట్లు తెలుస్తున్నది. వాస్తవంగా ఏ దశలో ఉన్నాయనే విషయం తెలియపర్చలేదు.

దానితోపాటు 14,165 ప్రాజెక్టులకు సంబంధించిన పనులు అసలు ఏమాత్రం ముందుకు సాగని స్థితి ఉన్నదని ప్రభుత్వం తెలిపింది. వాటిలో ఎన్.ఆర్.ఐ, వ్యాపారవేత్త అయినటువంటి ప్రసూన్ ముఖర్జీకి చెందిన 80,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు (షిప్పింగ్, మౌలిక సదుపాయాలు, విద్యుత్ రంగాలు), "హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ" కి చెందిన 40,000 కోట్ల విలువైన ప్రాజెక్ట్, "నానో వర్క్స్ డెవలపర్స్"కు చెందిన 30,000 కోట్ల విలువైన ప్రాజెక్టులున్నాయి.

ఈ శిఖరాగ్ర సమావేశం ప్రముఖ వ్యక్తులను సన్మానించడం లాంటి సన్నివేశాలను నిర్వహించడం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేసే ప్రయత్నం చేసింది. ఇది ముఖ్యంగా నరేంద్రమోడీ ఉపన్యాసంపై ప్రత్యేక దృష్టినాకర్షించే ప్రయత్నం చేసింది. అదేవిధంగా గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ (జి.ఐ.ఎఫ్.టి.) లో బొంబే స్టాక్ ఎక్స్చేంజ్ యొక్క ఇంటర్నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ యొక్క ప్రారంభోత్సవ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టినాకర్షించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో కేంద్ర మంత్రులను ఈ సమావేశానికి రప్పించటం జరిగింది. వాస్తవమేమంటే వేదికపైన ఆసీనుడై ఉన్న కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రసంగించడానికి అనుమతించబడలేదు. "ఎదుటివారిని ఎలా అణగదొక్కాలో మోడీకి బాగా తెలుసు. రతన్‌టాటా తరువాత ప్రసంగించిన ముఖేష్ అంబానీ రెండవ ఉపన్యాసకుడు. వేదికపై ఉన్నప్పటికీ అనిల్ అంబానీకి ఈసారి మాట్లాడే అవకాశం రాలేదు'', అని ఒక పర్యవేక్షకుడు అభిప్రాయపడినాడు.

'వైబ్రాంట్ గుజరాత్'ను ఇంతగా ప్రజా సంబంధాల ప్రచారం కొరకు ఉపయోగించు కున్నప్పటికీ, ప్రచారానికి తగ్గట్టుగా రాష్ట్ర ప్రతిష్టను నిలపడంలో విఫలం చెందింది. సమావేశం జరిగిన ప్రాంతానికి దగ్గరలోని గ్రామాల నుండి రైతులను తీసుకొనివచ్చి వారికి సూట్‌లు ధరింపజేసి ఖాళీ కుర్చీలలో కూర్చోపెట్టిన విధానాన్ని స్థానిక వార్తాపత్రికలు రాశాయి. నిష్ణాతులైన ప్రముఖులు వారి సీట్ల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొనవలసివచ్చింది. వెంకటరామన్ రామకృష్ణన్ భంగపడి బయటకు వెళ్ళడం జరిగింది. పత్రికా రిపోర్టర్‌ల కదలికలు అదుపుచెయ్యడం, వారు హాజరు కావాలనుకున్న సన్నివేశ ప్రాంతంలోకి ప్రవేశం నిరాకరించబడింది"- ఇది మోడీ తన స్కీంలో మన స్థానం మనకు చూపిస్తున్న తీరు. అతడు, అతని ఆప్తులు మనను అదుపుచేస్తున్నారు కాబట్టి అతను మనను కూర్చోబెట్టగలడు, కూర్చోకుండ చేయగలడని" మోడీ రాక కొరకు గంటల తరబడి ఎదురుచూస్తూ టీ కొరకు వెళ్ళడానికి ప్రయత్నించి, అనుమతి నిరాకరించబడిన కోపంతో ఉన్న ఒక రిపోర్టర్ పేర్కొన్నాడు. వేదిక వద్ద ఒక ఎ.టి.ఎం. కూడ ఉన్నది. హాజరైన వారు డబ్బు తీసుకుందామని వెళ్ళి డబ్బులు రాక వెనుదిరిగి వచ్చారు. కానీ వారి అక్కౌంట్‌లో నుండి డబ్బు డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. ఇదీ మోడీ డిజిటల్ ఇండియా తీరు.

ఎం.ఎస్. & ఎల్. అనే పబ్లిక్ రిలేషన్స్ కంపెనీ ఈ సంవత్సరం ఈవెంట్ కాంట్రాక్ట్‌ను గెలుచుకున్నది. ఈ సమావేశాలు ప్రారంభానికి 3 రోజుల ముందే 'ఆఖ్యామీడియా', మరొక 'పబ్లిక్ రిలేషన్స్ కంపెనీ' ని కార్యక్రమ నిర్వహణకు తీసుకురావడం జరిగింది.


ఈ క్రమంలో వ్యాపార నిపుణులు వాస్తవ పెట్టుబడుల అంకెల విషయంలో తలలు పట్టుకున్నారు. బండ్లపై వ్యాపారం చేసే పేదలు వెనుదిరిగారు. మంచులో దారిచూపించే దీపాలు కనిపించలేదు.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

ప్రభుత్వరంగ విధ్వంసం

# గుజరాత్ కోసం ఓయన్‌జిసిని బలిచేస్తున్న ప్రభుత్వం

భామి వి షెనాయ్



రచయిత
సామాజిక హక్కుల కార్యకర్త

ప్రపంచవ్యాప్తంగా (ఎక్కడ పరిశీలించినా) చమురు, ఇంధనం ఆయిల్, గ్యాస్ అన్వేషణ క్లిష్టమైన, సమస్యలతో కూడిన వ్యాపారం. లాభదాయకంగా కనిపించినప్పటికీ దీన్ని జూదంతోనే మనం పోల్చవచ్చు. ఆత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇంధన అన్వేషణ, ఉత్పత్తి కార్యక్రమాలలో నిల్వ చేయడం మొదలగు విషయాలలో సాంకేతిక అవరోధాలను అధిగమిస్తూ ఈ వ్యాపారం కొన సాగుతుంది. గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్ ప్రయోజనాలను పరిరక్షిస్తూకృష్ణా గోదావరి బేసిన్‌లోని80 శాతం చమురు నిల్వలను కొనుగోలు చేయలన్న ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓయన్‌జిసి) వారి నిర్ణయం నేపథ్యంలో చమురు, సహజ వాయువుల యొక్క ప్రత్యేకతలను, లోటుపాట్లను ఓసారి మనం పరిశీలించాలి. ఓయన్‌జిసి నిర్ణయాన్ని నిష్పాక్షికంగా విశ్లేషించవలసిన మీడియా వాదనలు రాజకీయ లబ్దిదిశగా కొనసాగడం దురదృష్టకరం. గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్ (జిఎస్‌పిసి)ను దివాళా నుండి రక్షించే చర్యగా అధికశాతం విమర్శించినప్పటికీ, ఆర్థికంగా లాభదాయక చర్యగా కేవలం కొద్దిమందే గమనించారు. ఈ వ్యాసంలో ఈ సమస్యను నేను రెండు కోణాలలో చూడదలచుకున్నాను. మొదటిది ఆర్థిక పరమైన ఆసక్తికాగా, రెండవది భారతీయ ఇంధన భద్రత. గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్ కృష్ణా, గోదావరి బేసిన్‌లోకి ప్రవేశించాలన్న నిర్ణయానికి రాకముందు సమర్ధవంతమైన నాయకత్వం గల బలమైన ఆర్థిక సంస్థ. కానీ సముద్రగర్భాలలో నిక్షిప్తమైన ఇంధన నిల్వలను వెలికి తీయడంలో ఏమాత్రం అనుభవం లేదు.బిలియన్ డాలర్ల పెట్టుబడితో కూడిన ఈ రంగంపై సంపూర్ణ అవగాహన లేదు. అయినప్పటికీ అంతవరకూ ఎవ్వరూ శోధించని ప్రాంతంలో ఇంధన నిల్వలకై వ్యాపారంలో పోటీపడి బిడ్ వేయాలన్న తెలివైన ఆలోచన చేశారు. అయితే ఎంత విస్తీర్ణంలో త్రవ్వకాలు జరపాలన్న ఆలోచనను, ఆర్థికంగా తమ పరిమితులను, సాంకేతిక పరిజ్ఞానమున్న భాగస్వాములను ఎంచుకోవడం వంటి అంశాలను బిడ్డింగ్ సమయంలో దృష్టిలో ఉంచుకుని ఉండాల్సింది. కనీసం బిడ్డింగ్ గెలిచిన తర్వాతైనా సమస్యలను తగ్గించుకునే దిశగా ప్రయత్నం చేసి ఉండాల్సింది. ప్రపంచంలోని పెద్ద పెద్ద ఆయిల్ కంపెనీలైన ఎక్సాన్, మొబిల్, బిపి, షెల్ మొదలగు కంపెనీలు ఇలాంటి విధానాలనే అనుసరిస్తాయి. బ్లాక్‌లను పోటీలో గెలుచుకున్న తర్వాతనైనా కనీసం ఆ కోణంలో పరిశీలించి కృషి చేయవలసింది. ఇవేమీ చేయక పోవడం వల్ల జియస్‌పిసి దివాలా తీసే పరిస్థితులకు చేరుకుంది.

సమర్ధవంతమైన నాయకత్వం ఎల్లప్పుడు తన బలాలు, బలహీనతల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉంటుంది. కృష్ణా గోదావరి బేసిన్‌లోని నిక్షిప్తాలను పొందడంపై వ్యూహాత్మకంగా వ్యవహరించి, స్వంతం చేసుకున్న తర్వాతైనా జియస్‌పిసి ఇంధనరంగంలో అనుభవమున్న, ఆర్థిక పరిపుష్టి ఉన్న కంపెనీలను తమ భాగస్వాము లుగా ఎంచుకుని ఉండవలసినది. దానికి భిన్నంగా వ్యవహరించి తదనంతర కాలంలో ఎన్నెన్నో మరపురాని తప్పులను చేసింది. అనేక సంఘుట నలు ఋజువులుగా మిగిలాయి. సాంకేతిక నైపుణ్యాన్ని అందుకునే క్రమంలో అంతగా ప్రాచుర్యం, అనుభవం లేని ఓ చిన్న కంపెనీని, కేవలం ఇద్దరు మాత్రమే నడిపే "జియోగ్లోబల్ రిసోర్ట్స్"ని తమ వాటాల్లో 10 శాతం, వడ్డీలు అందించే విధంగా ఎంచుకుంది. అంతచిన్న కంపెనీకి తమ వాటాలో 10వ శాతం ఎందుకు ఇచ్చిందో కూడా స్పష్టత లేదు. ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక నైపుణ్యమూ ఆయిల్ రంగంలో ఎలాంటి అనుభవమూ, వెన్నుదన్ను లేని కంపెనీని ఎలా నమ్మిందో తెలియదు. అంతేగాక నిర్మాణం కొనసాగుతున్న తరుణంలో కూడా ఇలాంటిదే మరో తప్పిదం చేసింది... "టఫ్" అనే కంపెనీ సైతం ఆయిల్ రంగంలో ఎలాంటి అనుభవం, గుర్తింపు లేని సంస్థ. జిఎస్‌పిసి వారికూడా మల్టీమిలియన్ అవార్డులను ఇచ్చింది. కారణాలేవైనా తర్వాత అతికష్టం మీద ఆ కంపెనీని వదిలించుకుంది. తద్వారా భారీ మూల్యాన్నే చెల్లించింది. జియస్‌పిసి పట్ల సానుభూతి ఉన్నవారు సైతం ఈ సంస్థ చేసిన మూడు తప్పులను విడచి చూడలేరు. ఇవి కేవలం తెలియక చేసిన తప్పిదాలా? లేక ఇంకేమైనా అంతర్గత కారణాలున్నాయా? అన్నది మనం పరిశీలించాలి.

కృష్ణా గోదావరి బేసిన్‌లో ఓయన్‌జిసి కేవలం 80 శాతం పైనే ఆధిపత్యం కలిగి ఉంది. ఇది కేవలం ఇంధనం తవ్వకాలను కొనసాగించే సంస్థ మాత్రమే అయినప్పటికీ, ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక నైపుణ్యం ఏ మాత్రం లేని రెండు భాగస్వామ్య సంస్థలలో పనిచేయ వలసి వచ్చింది. ఓయన్‌జిసి భవిష్యత్తులో సంపూర్ణంగా తవ్వకాలు చేపడితే ఈ రెండు సంస్థలు తమ వాటాను ఎలా, ఏ విధంగా చెల్లించగలవో కూడా స్పష్టత లేదు. ఓయన్‌జిసి చేసే ఈ కొనుగోలుకు సంబంధించిన ముఖ్యాం శాన్ని, తమ ప్రకటనలో ఏ మాత్రం స్పష్టత లేకుండా, ప్రజల ముందుకు తెచ్చారు.

దివాళాకి జియోగ్లోబల్, జూబిలియంట్ రెండూ కారణాలయ్యాయని స్పష్టమవుతున్నది. భవిష్యత్తులో పెట్టవలసిన పెట్టుబడిలో తమ తమ వంతు చెల్లించక పోతే ఏం జరుగుతుంది? దీన్‌దయాళ్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయడంలో కేవలం ఓయన్‌జిసి మాత్రమే బాధ్యత వహిస్తుందా? జియస్‌పిసికి 120 కోట్ల డాలర్లను ఓయన్‌జిసి చెల్లించే విధంగా ఒప్పందం జరిగింది గనుక ఇవన్నీ ఓయన్‌జిసి లాయర్ల బృందం పరిగణలోకి తీసుకుంటుందని ఆశిద్దాం.

120 కోట్ల డాలర్ల ఒప్పందం కూడా స్పష్టత లేకుండా, మర్మంగా కొనసాగుతుంది. మొదట్లో కేవలం 200 నుండి 250 కోట్ల డాలర్లను మాత్రమే చెల్లించ వలసి వస్తుందని

ఓయన్‌జిసి భావించింది. అందులో ఒక 100 కోట్ల డాలర్లు జియస్‌పిసి లోని 80 శాతం కోసం కాగా, 20కోట్ల డాలర్లు అభివృద్ధి చేయ వలసిన మరో ఆరు నిక్షేపాలను కనుగొనడం కోసం చెల్లిస్తుంది. ఆ ఆరు నిక్షేపాలను కనుగొన డంలో విజయవంతమైతే, కొంతభాగాన్ని జియస్‌పిసి కోసం, దాని భాగస్వాములిద్దరికీ లాభంగా ఇవ్వవలసి ఉంది. దీన్‌దయాళ్ ఫీల్డ్ లోనున్న ఈ అనిశ్చిత స్థితి గురించి స్పష్టమైన అవగాహన ఉన్న ఓయన్‌జిసి ఈ ఒప్పందానికి ఎలా అంగీకరించింది? అంతేగాక కెజి బేసిన్ లాభం దాదాపు శూన్యంగా స్పష్టంగా గోచరి స్తున్న సమయంలో 20 కోట్ల డాలర్లు ఇవ్వడానికి ఓయన్‌జిసి ఎలా ముందుకొచ్చింది? ఎందుకు ఒప్పుకుంది? దీనికన్నా స్పష్టంగా లాభ దాయకంగా ఉండే దిశగా ఓయన్‌జిసి బేరసారాలు సాగించి ఉండాల్సింది.

ఓయన్‌జిసి పై మరో విమర్శకూడా ఉంది. బోర్డ్‌లో 50 శాతం మంది కంపెనీయే తర సభ్యులుండాలన్న "సెక్యూరిటీస్ మరియు ఎక్చేంజ్ బోర్డ్ రెగ్యులేషన్ 17" నిబంధన ప్రకారం కొనసాగడం లేదని, అందువలన ప్రైవేటు వ్యక్తులతో వ్యాపారం చేసే క్రమంలో తీసుకునే నిర్ణయాలకు చట్ట బద్ధత లేదని, న్యాయ సమ్మతం కాదని చెబుతున్నారు. ప్రస్తుతం ఓయన్‌జిసి బోర్డ్‌లో 7గురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇద్దరు ప్రభుత్వ డైరెక్టర్లు ముగ్గురు స్వతంత్ర్య డైరెక్టర్లున్నారు. అంతేగాక 21 శాతం ప్రేవేటు పార్టీల పేర్లు కూడా ఉన్నాయన్న వాస్తవాన్ని మరుగు పరచకూడదు. జియస్‌పిసి ప్రయోజనాలను పరిరక్షిస్తూ, ఇంధన నిల్వలను కొనుగోలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఒత్తిడిని ఓయన్‌జిసి అంగీకరించిందన్న వాదాన్ని త్రోసి పుచ్చినప్పటికీ, ఆర్థికపరంగా ఎలాంటి లాభం లేని ఒప్పందంలోకి ఏ విధంగా ఓయన్‌జిసి ప్రవేశించింది? కెజి బేసిన్ గ్యాస్ విషయంలో లాభరహితంగా, వ్యాపార దృష్టి లేకుండా ఎలా వ్యవహరించింది?

దీన్‌దయాళ్ ఫీల్డ్‌ని అభివృద్ధి చేయడం కోసం జియస్‌పిసి సుమారు 275 కోట్ల డాలర్లను పెట్టుబడి పెట్టింది. అదనంగా 58 కోట్ల 40 లక్షల డాలర్లను చమురు నిల్వల అన్వేషణ కోసం కేటాయించింది. ఈ గణాంకాల ప్రకారం జియస్‌పిసి పెట్టుబడి మొత్తం 341 కోట్ల డాలర్లు. ఓయన్‌జిసి కేవలం ఒక్క బిలియన్ డాలర్లు మాత్రమే చెల్లిస్తుంది.

ఓయన్‌జిసి గనుక తన అనుభవాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన పెట్టుబడిగా

❝ తన నిర్ణయానికి మద్దతుగా ఓయన్‌జిసి జాతీయ భద్రత అనే వాదాన్ని ముందుకు తెచ్చింది. జియస్‌పిసి కన్నా మెరుగైన సాంకేతిక నైపుణ్యం, ఆర్థిక వనరులు ఉన్నాయని పేర్కొంది. భారతదేశపు ఇంధన దిగుమతుల విషయంలో జియస్‌పిసి విఫలం కాగా, ఓయన్‌జిసికి విజయా వకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ❞



కేజీ బేసిన్‌లో ఓఎన్‌జిసి రిగ్

పెట్టినట్లయితే ఫలితాలు భిన్నంగా ఉండేవి. ఓయన్‌జిసికి ఈ శక్తిసామర్థ్యాలు ఉన్నాయా? అన్న విషయంలో తీవ్ర ఆందోళనలున్నాయి.

తన నిర్ణయానికి మద్దతుగా ఓయన్‌జిసి జాతీయ భద్రత అనే వాదాన్ని ముందుకు తెచ్చింది. జియస్‌పిసి కన్నా మెరుగైన సాంకేతిక నైపుణ్యం, ఆర్థిక వనరులు ఉన్నాయని పేర్కొంది. భారతదేశపు ఇంధన దిగుమతుల విషయంలో జియస్‌పిసి విఫలం కాగా, ఓయన్‌జిసికి విజయా వకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇక్కడ కూడా ఓ అస్పష్టత కనిపిస్తుంది. అదేమిటంటే, తన స్వంత అన్వేషణల కోసం ఓయన్‌జిసి ఇంత సుదీర్ఘ కాలం ఎందుకు తీసుకుంది? అన్ని సరైన సమయంలో అభివృద్ధి చేస్తే ఆకర్షణీయమైన రాబడులు వస్తాయన్న ముందు జాగ్రత్తగా నిర్ణయం తీసుకుందా? లేక తమ బాధ్యతను పరిత్యాగం చేసిందా? రిలయన్స్‌కి దగ్గరగానున్న కెజి – డి6లో చేసిన అన్వేషణలో చమురు వలస పోవడం వలన ఓయన్‌జిసికి చాలా అధికశాతం ఆర్థిక నష్టం వాటిల్లిన సంగతి అందరికీ తెలిసిందే! అంతేగాక ప్రపంచంలోని వినియోగదారులందరితో వ్యవహరించినట్లు గాక, రిలయన్స్ వారితో భిన్నంగా వ్యవహరిం చిందన్న నిందలు కూడా ఓయన్‌జిసి పై నున్నాయి.

దీన్‌దయాళ్ ఫీల్డ్ కోసం ఓయన్‌జిసి ఖర్చు పెట్టిన ఒక బిలియన్ డాలర్ల ద్వారా ఓయన్‌జిసికి తిరిగి ఏం వస్తుందో విశ్లేషిద్దాం! 2005 లో తొలిసారిగా అన్వేషణ ప్రారంభించినపుడు 20 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల రిజర్వ్ ఇంధనం ఉందని భావించారు. కానీ 2014 లో ఫీల్డ్ సిద్ధమయ్యేసరికి కేవలం 2 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల ఇంధనమే లభించింది. అప్పటినుంచే క్రమంగా 1(ఒక) ట్రిలియన్ క్యూబిక్ అడుగులకు తగ్గుతూనే వస్తుంది. దీన్‌దయాళ్ ఫీల్డ్‌లోనే భిన్న సందర్భాలలో చూపినట్లుగా ఒక బిలియన్ డాలర్లు ఇచ్చేసిన తర్వాత ఓయన్‌జిసి క్రమేణా తనకు రావాల్సిన దానికన్నా అధికశాతం పోగొట్టుకున్నట్లు స్పష్టమవుతుంది. తీసుకున్న శ్రమతో పోల్చుకుంటే, పోగొట్టుకున్న లాభం అధికంగా కనిపిస్తుంది. జియస్‌పిసి పాత భాగస్వాములను కూడా కలిపినట్లయితే ఈ శాతం మరింత ఎక్కువవుతుంది. ఓయన్‌జిసి 2 లేదా 1 బిలియన్ డాలర్లు మాత్రమే పెట్టుబడి పెట్టి, 4 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల ఇంధనం వెలికితీసినట్లయితే, సహేతుకమైన లాభం సమకూడి ఉండేది.

**❝ 2016లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదిక జియస్‌పిసి ఇద్దరు భాగస్వాములైన జియోగ్లోబల్ 1,734 కోట్ల రూపాయలు, జూబిలియంట్ 314 కోట్ల రూపా యలు చెల్లించవలసి ఉందని వ్యాఖ్యానించింది. వారు జియస్‌పిసి వాదనను వ్యతిరేకిస్తు న్నారు. అంతేగాక జియస్‌పిసిపై దావా వేశారని పేర్కొంది. ఇది ఓయన్‌జిసి విస్మరించరాని సత్యం.**

కాని ఇక్కడ సుస్పష్టంగా అర్థమవుతుందేమిటంటే ఓయన్‌జిసి చాలా స్పష్టంగానే జూదమాడింది. అంతేగాక తనకున్న భౌతిక వనరులు మౌలిక సదుపాయాలైన, సముద్రంలోకి వేసిన పైపులైన్లు, దీన్‌దయాళ్ ఫీల్డ్ ఉత్పత్తి ప్లాట్‌ఫారమ్ , సముద్రం బయటకు తీసుకు రావడానికున్న సామాగ్రి మొదలగు వాటన్నిటినీ పరిశీలిస్తే స్వయంగా త్రవ్వకాలు జరపగలిగే స్థితిలో ఉండికూడా ఓయన్‌జిసి ఆ పని చేయలేదు. జియస్‌పిసికి ఒక బిలియన్ డాలర్లు చెల్లింపు చేయడాన్ని ఓయన్‌జిసి సమర్థించుకోవచ్చు.

ఏది ఏమైనప్పటికీ, ఓయన్‌జిసికి జియస్‌పిసి భాగస్వాములైన జూబిలియంట్, జియోగ్లోబల్‌తో సంప్రదింపులు తప్పలేదు. ఆ రెండు సంస్థలతో ఎలా ఒప్పందం చేసుకోవాలో స్పష్టత లేనపుడు ఓయన్‌జిసి తన ఒప్పందాన్ని ఖరారు చేసుకొని ఉండాల్సింది కాదు. 2016 లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదిక జియన్‌పిసి ఇద్దరు భాగస్వాములైన జియోగ్లోబల్ 1,734 కోట్ల రూపాయలు, జూబిలియంట్ 314 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉందని వ్యాఖ్యానించింది. వారు జియస్‌పిసి వాదనను వ్యతిరేకిస్తున్నారు. అంతేగాక జియస్‌పిసిపై దావా వేశారని పేర్కొంది. ఇది ఓయన్‌జిసి విస్మరించరాని సత్యం.

కెజి బేసిన్ అభివృద్ధిని చేయడంలో రిలయన్స్, ఓయన్‌జిసి, జియస్‌పిసి పోషించిన పాత్ర నుంచే మనం ప్రధానంగా గమనించాలి. లేకపోతే జాతీయ సంపద చమురు, సహజ వాయువులు ఎంతగా దుర్వినియోగ మవుతాయన్నది, శాపంగా ఎలా మారతా యన్నది అర్థం కాదు. భారతదేశ ఇంధన రక్షణను దృష్టిలో ఉంచుకొని చమురు, సహజవాయువుల దిగుమతులను తగ్గించుకోవడం పట్ల జాతీయ స్థాయిలోని అన్ని రాజకీయ పార్టీలు అభినందిస్తున్నాయి. కానీ కెజి బేసిన్‌లో ఇలాంటి సమస్యలుత్పన్నమైనపుడు శాశ్వతమైన పరిష్కారాన్ని ఏ పార్టీ కూడా అందించలేక పోతుంది.



జిఎస్‌పిసి రిగ్

❞ **కజకస్థాన్ అనుభవం :**

భారతదేశ ఇంధన రక్షణ గూర్చి ఆలోచించే వ్యక్తులు, వ్యవస్థ కజకస్థాన్ అనుభవాన్ని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. గత 4 సంవత్సరాలుగా ఆయిల్ ఉత్పాదన రంగంలో అగ్రగామి సంస్థలలో ఒకటైన "కషాగాన్" ఫీల్డ్‌ను అభివృద్ధి చేసిన విధానం పరిగణలో తీసుకోవాలి. సాంకేతికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎన్నెన్నో అవరోధాలు ఎదురవ్వుతున్నప్పటికీ, అక్కడ ఆయిల్ సంస్థలు విజయాలను సాధిస్తూనే ఉన్నాయి. మన దేశంలో లాగానే కజకిస్థాన్‌లో సైతం అవినీతి ఆరోపణలున్నాయి. అయినప్పటికీ ఇంధన రంగం అభివృద్ధి చెందుతూనే ఉంది. 2000వ సంవత్సరంలో ఇటాలియన్ కంపెనీ ఇయన్‌ఐ కి చెందిన 14 మల్టీనేషనల్ కంపెనీల సమూహం "కషాగాన్" ని కనుగొంది... కానీ వ్యాపార ఉత్పత్తుల కోసం 16 సంవత్సరాలు వేచివుంది.

2013లో తొలిసారిగా ఉత్పాదన ప్రారంభమయినప్పటికీ పైపులైనులు లీకయ్యి విషవాయువులు వెలువడటం వలన ఆయిల్ ప్లాట్‌ఫారమ్ మూసివేయబడింది. 10 బిలియన్ టన్నుల ఇంధన నిల్వలున్నాయని తొలుత లెక్కించి, 10 బిలియన్ డాలర్ల వ్యయంతో ఆరంభించినప్పటికీ, ఇప్పటికి 50 బిలియన్ డాలర్లు ఈ ఫీల్డ్‌లో ఖర్చు పెట్టడం జరిగింది.

ఊహించని అవరోధాలు ఎన్నెన్నో ఎదురయ్యినప్పటికీ ఇయన్‌ఐ సమస్యలను సాధికారికంగా ఎదుర్కొని, వ్యాపార రంగంలో నిలదొక్కుకుని ఉత్పత్తులు పెంచుకుంది. రాజకీయ సమస్యలు కూడా ఉత్పన్నమయ్యాయి. తొలినాళ్లల్లో ఒప్పందం ప్రకారం బ్యారెల్ ఇంధనం ధర 20 డాలర్లు కాగా, కాలక్రమంలో బ్యారెల్ వంద డాలర్లకు చేరుకుంది. సంస్థ సభ్యులు మారారు. కొనొకో ఫిలిప్స్ కి చెందిన షేర్లను కొని ఓయన్‌జిసి కూడా భాగస్వామి కావాలని భావించింది. కానీ కషాగాన్ ప్రభుత్వం మాత్రం చైనాకు చెందిన ఇంధన సంస్థనొకదాన్ని భాగస్వామిగా చేర్చుకుంది.

ప్రస్తుతం మనదేశంలో జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చ ఇంధన భద్రత కన్నా రాజకీయ భద్రత పైనే సాగుతుంది. మూడు ఇంధన సంస్థ లూ కలిసి తొలినాళ్లలో వేసిన లెక్క ప్రకారం కెజి బేసిన్ లో 44 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల ఇంధన ముండాలి. కానీ ప్రస్తుతం 5 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల కన్నా తక్కువుంది. ఇంధన దిగుమతులను తగ్గించుకుని, దేశీయంగా ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేసుకోవడంలో దారుణంగా విఫలమయ్యారు. అధిక ఉష్ణోగ్రత, అధిక పీడనం, తక్కువ విస్తృతంగా ఉన్న హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్ నిల్వలున్న కెజి బేసిన్ ని అభివృద్ధి చేయడం అంత సులభమైన వ్యవహారం కాదు. అయితే కషాగాన్ ఫీల్డ్‌లో వలె, మంచి వేతనాలు అనుభవజ్ఞులైన సిబ్బంది సాంకేతిక నైపుణ్యమున్న కంపెనీలయితే, కొన్ని సమస్యలను అధిగమించవచ్చు.

ప్రపంచంలోఉన్న మంచి సాంకేతిక నిపుణులను, సాంకేతికతను ఉపయోగించి మనదేశ సహజ వనరులను ఉపయోగించడంపై శ్రద్ధ పెట్టవలసిన అవసరం ఉంది. మనదేశంలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ చర్చ దిశను మార్చగలమా?

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

# వార్షిక 'కోతల' బడ్జెట్



రచయిత ఆర్థిక రంగ నిపుణుల,
ఛార్టెడ్ ఎకౌంటెంట్

**రాంపల్లి శశికుమార్**

ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భారతదేశపు బడ్జెట్ ప్రహసనం ముగిసింది. అయితే ఈ బడ్జెట్ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో, కొన్ని ప్రత్యేకతలతో ప్రవేశపెట్టబడిన మాట వాస్తవం. పెద్దనోట్ల రద్దు పేరుతో జరిగిన అతిపెద్ద ఆర్థిక, రాజకీయ , సామాజిక గరళ ప్రయోగం తరువాత, ప్రపంచీకరణే విశ్వమానవాళికి శ్రీరామరక్ష అని ప్రబోధించిన అమెరికా బ్రిటిన్‌లు, తీరా తమ దాకా వచ్చేసరికీ రక్షిత ఆర్థిక వ్యవస్థే ముద్దు అని చిందులేస్తున్న వేళ, మరొక విశ్వవ్యాప్త ఆర్థిక సంక్షోభం అతి త్వరలోనే బద్దలవుతుందని సూచనలు స్పష్టంగా కనిపిస్తున్న సంధి కాలంలో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టబడింది. అయితే ఈ బడ్జెట్ కి కూడా స్వతహాగా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.

1. రైల్వే బడ్జెట్‌ని సాధారణ బడ్జెట్‌తో కలిపి ఉమ్మడిగా ప్రవేశపెట్టడం
2. సాధారణంగా కంటే ఒక నెల ముందుగానే ప్రవేశపెట్టడం
3. "ప్రణాళిక- ప్రణాళికేతర" అనే వ్యయ వర్గీకరణని "మూలధన, రెవెన్యూ వ్యయాలుగా మార్చి కొత్త ప్రాతిపదికతో ప్రవేశపెట్టడం.

ఇన్ని ప్రత్యేకతలు పైకి కనబడుతున్నప్పటికీ సారంలో ఏ విధమైన గుణాత్మక మార్పు లేకపోవడం మరో ప్రత్యేకత.

"గణాంకాలు దుర్వినియోగమే ప్రజాస్వామ్యం" అని ప్రముఖ అర్జెంటీనా కవి జార్జీ లూయిస్ అన్నట్లుగా ఆర్థిక సర్వే పేరుతో ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యన్ పూర్తి వినోదాత్మక మసాలా భరిత చలన చిత్రాన్ని భారతీయ ప్రజలకు చూపించే ప్రయత్నం చేయగా, సరిగ్గా అందుకు ఒక్కరోజు ముందు "భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిజమైన పరిస్థితి" పేరుతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తద్విరుద్ధమైన వ్యధాభరిత అవార్డ్ చిత్రాన్ని ప్రజలముందు విడుదల చేయడం, కేవలం గణాంక మాయాజాలమే తప్ప ప్రజాశ్రేయస్సుకు కాదు. రెండూ ఒక తానులో గుడ్డలే. అయినప్పుడు ఆ గుడ్డతో గోచీ పెడితే ఏమిటి? గౌను కుడితే ఏమిటి? ఇద్దరూ ఒకప్పుడు అంతర్జాతీయ ద్రవ్యనిధిలో పనిచేసిన వారే అవడం యాదృచ్ఛికమేమి కాదు. అది కేవలం ఎవరెంత విశ్వాసపాత్ర సేవకులో చాటి చెప్పుకునే సాధనం మాత్రమే. వారి వారి గణాంక మాయజాలాన్ని కాసేపు ప్రక్కనపెడితే ఆయా సర్వేల తరువాత ప్రవేశపెట్టబడిన బడ్జెట్ మాయాజాలం గురించి పరిశీలిద్దాం.

**1. పన్నుల విధానం:**

ప్రత్యక్ష పన్నులు వసూలు కావడంలో భారతదేశపు వెనకబాటు అధిక పరోక్షపన్నులకు దారి తీసిందని, తిరోగామి పన్నుల విధానమైన పరోక్ష పన్నుల కంటే ప్రత్యక్ష పన్నుల సేకరణను పెంచాల్సి ఉందనీ మొసలి కన్నీరు కార్చిన మన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గారు రాబోయే వస్తు సేవల పన్ను (జీఎస్‌టి) ప్రతివొక్క పరోక్ష పన్నునీ పెంచుతుందన్న వాస్తవాన్ని కప్పిపుచ్చారు. అంతేకాక ఆదాయపన్ను చెల్లింపుదారుల సంఖ్య మనదేశంలో చాలా తక్కువగా ఉన్నదనే విషయాన్ని గర్హిస్తూనే ఈ దేశంలోని అందరూ పౌరులూ పరోక్ష పన్నులు భరిస్తారనీ అంటే ఒకరకంగా అందరూ పన్ను చెల్లింపుదారులే అన్న వాస్తవం తమకు తెలీనట్లే నటించారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లు అధికంగా ఉన్న దేశాలలో విద్య, వైద్యం, వంటి కనీస అవసరాలను ప్రభుత్వాలే తీరుస్తాయని చెప్పకుండా దాచిపెడుతూనే, తాము మాత్రం ఆయా బాధ్యతలనుంచి క్రమంగా తప్పుకుంటూ ప్రజలు మరింతగా పన్నులు కట్టే బరువైన బాధ్యతని తమ తలకెత్తుకోవాలని తలపోశారు.

2015-16 వాస్తవ ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 62 శాతం కార్పొరేట్ పన్ను వసూళు కాగా 38 శాతం మాత్రమే వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు. అయితే రాబోయే సంవత్సరపు (2017-18) అంచనాలలో కార్పొరేట్ ప్రత్యక్ష పన్ను వసూళ్లు 55 శాతం మాత్రమే ఉండగా వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 45 శాతంగా అంచనా వేయడం కంపెనీల లాభాలు తగ్గుతాయని అనడానికి నిదర్శనమా! లేక వ్యక్తులపై ఆదాయపు పన్ను శాఖ కొరడా ఝుళిపిస్తోందనడాకి నిదర్శనమా!

అలాగే కేంద్ర ఎక్సైజ్ సుంకం వసూళ్లలో 2016/17 బడ్జెట్ అంచనాల కంటే సవరించిన అంచనాలు 22 శాతం ఎక్కువగా ఉండటం పెట్రోల్ / డీజిల్‌పై సుంకాలను అడ్డదిడ్డంగా పెంచుకుంటూ పోయినందు వల్లనే అనే వాస్తవం కప్పిపుచ్చుతూ, పెద్దనోట్ల రద్దు ప్రభావం దేశీయ వ్యాపారంపై ఏమంత ప్రతికూల ప్రభావం చూపించదనే శుష్క వాదనకు దాన్ని నిదర్శనంగా వాడుకోవడం పచ్చి అబద్ధం కాదా!! ద్రవ్యోల్బణం అదుపులో ఉందని గప్పాలు కొట్టుకుంటున్నప్పటికి అది ద్రవ్యలభ్యత తగ్గడం వల్ల జరిగిందా లేక ఉత్పత్తి పెరగడం వల్ల జరిగిందా అని పరిశీలిస్తే మొదటిదే ముఖ్య కారణంగా కనబడుతుంది. ఎందుకంటే ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం 16 శాతం వృద్ధి చెందుతుండగా పరోక్ష పన్నుల లక్ష్యం 19 శాతం వృద్ధి చెందడమే అందుకు సాక్ష్యం, పూర్తి తిరోగామి పన్నుల విధానపు కొనసాగింపే ఈ అంచనాలు అనేది సుస్పష్టం.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పన్నుశాతం తగ్గించడం, అలాగే 50 లక్షల రూపాయల ఆదాయం పై బడిన వ్యక్తులపై కొత్తగా సర్‌ఛార్జీ విధించడం, 5 లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్న వ్యక్తుల పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగ్గ పరిణామమే అయినప్పటికీ అవి అనివార్యం అని ఆర్థిక అసమానతల పెరుగుదల , ద్రవ్యలభ్యత తరుగుదల చెప్పకనే చెబుతున్నాయి.

**2. గ్రామీణ రంగపు కేటాయింపులు:**

వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టే మన ప్రభుత్వాలు మరొక మాయాజాలం ఏమింటే ఏయే రంగాలకు ఎంత మొత్తాలను కేటాయిస్తారో

> **"1969లో బ్యాంకుల జాతీయకరణ నుండి 1991 ఉదారవాద విధానాల దగ్గర్నుండి నిన్నమొన్నటీ నోట్ల రద్దుదాక ప్రభుత్వ విధానాల అంతిమ ఫలితాలు కొందరికే సంపద పెంచి, అత్యధికుల సంపద దోచేవిగా ఉన్నవని ఆర్థిక అసమానతల్లో మనదేశం సాధించిన గొప్ప ర్యాంకే చెబుతుంది."**



ఉపాధిపనులు చేస్తున్న కూలీలు

చెబుతారే తప్ప నిజంగా అందులో ఎంత మొత్తం ఖర్చుచేశారో, చేస్తున్నారో ఎంత మొత్తం లబ్దిదారునికి చేరిందో ఎవరూ పట్టించుకోరని వారి ధీమా. ఉదాహరణకి గ్రామీణ ఉపాధి హామి పథకం క్రింద కేటాయింపులు 2016-17లో 38,500 కోట్ల నుంచి 1066 కోట్లు మాత్రమే అనే విషయం చెప్పరు. అంతేకాక ఈ కేటాయింపులు, ఖర్చు జరిగే రెవెన్యూ పద్దులో కాకుండా, దానికి సంబంధించిన ఒక ప్రత్యేక నిధిద్వారా జరుగుతున్నాయి అనే విషయం కూడా మనకి పూర్తిగా అన్ని పద్దులూ క్షుణ్ణంగా పరిశీలిస్తే కాని అర్థం కాదు. అలాగే వ్యవసాయ రుణాలు వార్షిక లక్ష్యం 9 లక్షల కోట్ల నుంచి 10 లక్షల కోట్లకి పెంచామనే మన ఆర్థిక మంత్రిగారు వార్షికరుణ వితరణలో వ్యవసాయ రంగం వాటా కనీసం 13 శాతం కూడా లేదనీ అదే సమయంలో రోజు రోజుకీ మొండీ బకాయిలుగా మారుతూ ఉన్న కార్పొరేటు రుణాల వాటా 68 శాతంగా ఉందనే విషయం పూర్తిగా మరుగు పడేస్తారు. (మిగిలినవి వ్యక్తిగత రుణాలు)

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద శరవేగంగా గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని గొప్పగా చెప్పగలుగుతారే కానీ పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వారుచేసిన పరిశోధన ప్రకారం మనదేశంలోని 40 శాతం రోడ్డు కాంట్రాక్టులు రాజకీయ నాయకుల ప్రత్యక్ష వ్యాపారంలో భాగమన్న విషయం బయటికి ఎలా చెప్పగలుగుతారు? ? అయినా పారిస్ పరిశోధకులు బినామీ వ్యవస్థపై అవగాహన లేక పాపం 40 శాతం దగ్గరే ఆగిపోయారు.

అలాగే మొత్తం వ్యవసాయ రంగానికి కేటాయించినట్లుగా చెప్పుకుంటున్న వాటాలో 73 శాతం కేవలం వ్యవసాయోత్పత్తుల నిల్వల నిర్వహణ ఖర్చుకే సరిపోతోందుంటే నిజంగా వ్యవసాయదారుల లబ్ధికి ఎంత మొత్తం చేరుతోందనేది స్పష్టంగానే అర్థమవుతుంది.

మొత్తానికి గ్రామీణ రంగానికి కేటాయించిన మొత్తంలో పెరుగుదల అనేది ప్రకటనలకే పరిమితం అవుతోంది తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనేది పచ్చినిజం. వ్యవసాయదారుల ఆదాయాన్ని రానున్న అయిదేళ్లలో రెట్టింపు చేస్తామనే ఆర్భాటపు ప్రకటనలు నిజానికి ఆ లక్ష్యం సాకారం కావాలంటే సాలీనా 14 శాతం కనీసపు వృద్ధిసాధించాలనీ, కానీ ప్రస్తుతపు వృద్ధిరేటు 5 శాతం కూడా లేదనే వాస్తవాన్ని పూర్వపక్షం చేస్తాయి. ఈ దేశంలో ప్రతి అరగంటకూ ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడంటే ఈ రకపు ప్రగల్భాలకూ, వాస్తవాలకూ మధ్య ఉన్న అగాధం మనకు గోచరమవుతుంది.

**3. అప్పులకుప్ప:**

అవాస్తవిక అంచనాలతో అప్పులు తీసుకుని వాటిని తీర్చలేని రుణభారంతో పెద్దపెద్ద కంపెనీలు ఒకవైపు, అవే అప్పులు తమ నిరర్థక ఆస్తులుగా మారుతుంటే చేష్టలుడిగి చూస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థ ఒకవైపు, అంతులేని అవినీతి దాహంతో ఎడాపెడా అప్పులు చేస్తున్న ప్రభుత్వాలు మరొకవైపు ఇలా అందరూ కలిసి తమ వైఫల్యాలను ప్రజాబాహుళ్యం మీద రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ కాలంలో ఉద్యోగ కల్పన ఒక భ్రమకాగా కొనుగోలుశక్తి తగ్గిపోతూ ఉన్న సామాన్య ప్రజానీకం ఈ దాష్టీకాన్ని పళ్ళబిగువున నిశ్శబ్దంగా భరిస్తూ ఉంటే దాన్ని దేశ ప్రజల విజ్ఞత అని పొగడడం మన ప్రభుత్వాల గడుసుతనమే సుమా! అమెరికా అధ్యక్షుడంతటి అత్యంత శక్తివంతమైన వ్యక్తికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న అమెరికా ప్రజలు విజ్ఞత లేనివారనా! లేక అది ఉత్తమ ప్రజాస్వామ్యానికి మచ్చుతునకా! 1969లో బ్యాంకుల జాతీయకరణ నుండి 1991 ఉదారవాద విధానాల దగ్గర్నుండి నిన్నమొన్నటీ నోట్ల రద్దుదాక ప్రభుత్వ విధానాల అంతిమ ఫలితాలు కొందరికే సంపద పెంచి, అత్యధికుల సంపద దోచేవిగా ఉన్నవని ఆర్థిక అసమానతల్లో మనదేశం సాధించిన గొప్ప ర్యాంకే చెబుతుంది.

దేశ సంపదలయిన సహజ వనరులను చౌకగా కొల్లగొడుతూ, ప్రజల సొమ్ము అయిన బ్యాంకుల వద్ద నుంచీ రుణాల పొందుతూ, ప్రభుత్వం నుంచీ ఎన్నో పన్ను రాయితీలు అనుభవిస్తూ, ఇంతా చేసి ఆ సొమ్మంతా నష్టపోయామని దొంగలెక్కలు చెబుతూ, కంపెనీలను దివాలా తీయించి వ్యక్తిగతంగా కుదేలయిన వారి చేతుల్లోనే కదా భారతీయ ఆర్థిక వ్యవస్థ ఇంత పదిలంగా ఉంది. మన ప్రభుత్వాలు వారి కుట్రలు, కుతంత్రాలలో భాగస్వాములుగా ఉంటూ ఇచ్చిన ప్రోత్సాహం ఫలితమే కదా! ప్రపంచంలోనే అతి తక్కువ శాతం మంది భారతీయులు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్నారు. నమ్మకం ఒమ్ము అయిన తర్వాత ఎందుకు దేశీయ పెట్టుబడి క్రియాశీలకంగా ఉంటుంది? కనీసం మన జనాభాలో

2 శాతం కూడా క్యాపిటల్ మార్కెట్‌లో పాల్గొనడం లేదంటే పెట్టుబడి కల్పన ఎలా కొనసాగుతుంది. విదేశీ పెట్టుబడులకై దేబిరించడమే తప్ప కనీసం అక్కడైనా పారదర్శక విధానం అమలు జరపామా? అంటే అది లేదు. ఇంకా దేశం అప్పుల కుప్పగా మారక ఏమవుతుంది? ఎంతసేపు ప్రజలను బలవంతంగా బ్యాంకింగ్‌లోకి, క్యాపిటల్ మార్కెట్‌లోకి లాగే ప్రయత్నాలే తప్ప ఆయా వ్యవస్థల విశ్వసనీయత పెంచే చర్యలు మచ్చుకైనా తీసుకోని మన ప్రభుత్వాలు సంక్షోభాన్ని సృష్టించాయే గానీ సంక్షేమాన్ని కాదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ మనకు ఉన్న విదేశీ అప్పు. 2007లో 15 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న మన విదేశీ అప్పు కేవలం 8సంవత్సరాలలో 2015 కల్లా రెట్టింపు కన్నా ఎక్కువై 31 లక్షల కోట్లకు చేరుకోవడం ప్రమాదకర సంకేతం. మన బడ్జెట్‌లోని మొత్తం ఖర్చులలో 26శాతం కేవలం వడ్డీ చెల్లింపులకే సరిపోతుందంటే ఎప్పటికి మన ఆర్థిక వ్యవస్థ స్వయం పోషక మౌతుందో అర్థం కాదు.

ఇకనైనా ప్రభుత్వాలు మేలుకొని ఎవరో పెట్టే పెట్టుబడుల కోసం దేబిరించకుండా దేశీయ పెట్టుబడిని, అంతర్గత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. రోజుకు రెండు కోట్లు ఖర్చుచేసి ప్రకటనలు ఇచ్చినంత మాత్రాన అద్భుతాలేవి జరిగిపోవు. నైపుణ్యాలు కొనుక్కుంటే వచ్చేవి కావు. మన యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి విద్యా విధానాన్ని, హేతుబద్ధకంగా, సమూలంగా సంస్కరించి, బెదిరింపులతో కాకుండా నమ్మకంతో ప్రజల పొదుపును, మదుపును సమీ కరించి దేశీయ అవసరాలు, పరిమితులకు లోబడి ఆర్థిక విధానాలను రూపొందించకుండా ఇలా అంకెల గారడీతో లేక కలల సౌధాలను నిర్మించడంలోనూ మన ప్రభుత్వాలు కాలం వెళ్ళ దీస్తే వాస్తవాలు తెలుసుకోవడానికి ప్రజలకు కూడా ఎక్కువ కాలం పట్టదని విజ్ఞులైన ప్రభువుల వారు కూడా అర్థం చేసుకోవాలి. అమెరికా అమెరికన్లదే అని గర్జిస్తున్న ట్రంప్‌ని చూసైనా బుద్ధితెచ్చుకొని ఇండియా ఇండియన్లదే అని మరొక్కసారి ప్రపంచానికి చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ముసుగులు తొలుగు తున్న నూతన ప్రపంచంలో కొత్త ముసుగులు, ఉత్త కోతలు ఎంతో కాలం నిలబడలేవు. ❋

> **❝2007లో 15 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న మన విదేశీ అప్పు కేవలం 8సంవత్సరాలలో 2015 కల్లా రెట్టింపు కన్నా ఎక్కువై 31 లక్షల కోట్లకు చేరుకోవడం ప్రమాదకర సంకేతం. మన బడ్జెట్‌లోని మొత్తం ఖర్చులలో 26శాతం కేవలం వడ్డీ చెల్లింపులకే సరిపోతుందంటే ఎప్పటికి మన ఆర్థిక వ్యవస్థ స్వయం పోషక మౌతుందో అర్థం కాదు.❞**

# రైతు లందరికీ భూమి

(17వ పేజీ తరువాయి)

వ్యవసాయం చేసుకోగలగాలి. దున్నేందుకు శ్రామికులకు జీతాలిచ్చి వినియో గించుకోరాదు.

"ఎవరైనా ఒక శ్రామికుడు కొన్నాళ్ళు అస్వస్థులైతే, కమ్యూన్‌లోని ఇతరులు అతనికి స్వస్థత చేకూరేవరకు అత్యధికంగా రెండేళ్ళవరకు అతనికి సహకరించాలి.

"వృద్ధాప్యం, అనారోగ్యం, అంగవైకల్యం వలన వ్యక్తిగతంగా వ్యవసాయం చేయలేని వారు భూమిపై హక్కును కోల్పోతారు. కానీ వారికి రాజ్యం నుండి పెన్షన్ మంజూరు అవుతుంది.

7. భూమి కౌలు అందరికీ సరిసమానంగా ఉంటుంది. భూమిని ఆ ప్రాంతంలో శ్రమ చేయగల వారందరికీ అక్కడి జీనవ ప్రమాణాల ఆధారంగా, జీవనభృతికి అవసరమైన స్థాయికి సమానంగా పంచడం జరుగుతుంది.

కౌలు విధానాలపై ఎటువంటి పరిమితులు లేవు. సొంత కమతాలు, సహకార కమతాలు, ప్రాంతీయ కమతాలు వగైరాలు ప్రతి గ్రామం సెటిల్‌మెంట్ ఆధారంగా నిర్ణయించ బడతాయి.

8. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమంతా జాతీయ భూనిధిలో భాగమౌతుంది. దాని పంపకం స్థానిక, స్వయం పరిపాలిత ప్రభుత్వాల, సంస్థలలో చేతిలో ఉండాలి. ఇవి నాటకీయంగా నిర్మించబడిన గ్రామాలలోనూ, పట్టణ కమ్యూన్‌లలోనూ ప్రజాతంత్రయుతంగా ఎన్నికై ఏర్పడతాయి. వీటిలో కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వ సంస్థల మధ్య సామాజిక తేడాలకు తావుండదు.

"జనాభా పెరుగుదల, పంట దిగుబడి పెరుగుదల, శాస్త్రీయంగా వ్యవసాయం చేసే స్థాయిని బట్టి భూ పంపకం మళ్ళీ మళ్ళీ జరుగుతుంటుంది.

"పంపకం హద్దులు మారినా అసలు క్షేత్రం స్థిరంగానే ఉంటుంది.

"కమ్యూన్‌ని వదిలి వెళ్ళినవారి భూమి తిరిగి భూనిధికి మరల్చబడుతుంది. అయితే దాన్ని వదిలి వెళ్ళిన వ్యక్తి దగ్గరి చుట్టాలకు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. లేదా వారు సూచించిన వారికి ఇవ్వడం జరుగుతుంది.

"భూమి అభివృద్ధికి, రసాయనాలకు అయిన ఖర్చు, పంపకం జరిగిన నాటికి ఉప యోగించనివి అన్నీ తిరిగి భూనిధికి చేరుకుంటాయి.

ఒక ప్రాంతంలో ఉన్న భూమి అక్కడున్న స్థానిక ప్రజలకు పంచేందుకు సరిపడా లేకపోతే భూమి అందని ప్రజలను వేరే ప్రాంతాలకు తరలించి అక్కడ సెటిల్‌మెంట్లను ఏర్పాటు చేస్తారు.

ఈ కొత్త సెటిల్‌మెంట్లకు కావాల్సిన పనిముట్లు, ఖర్చులను భరించే ఏర్పాటు రాజ్యమే చేస్తుంది. ఈ సెటిల్‌మెంట్ ఏర్పాటు ఈ విధంగా జరుగుతుంది. భూమిలేనివారు, చెడు అలవాట్లున్న, వదిలివేయబడిన కమ్యూన్ సభ్యులు, ఆ తరువాత తిరిగి సెటిల్‌మెంట్ కోరుకుంటే మెజారిటీ నిర్ణయం లేదా ఏకాభిప్రాయంతో గాని పంచబడుతుంది"

రష్యాలోని అత్యధిక వర్గ చైతన్యం కలిగిన రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ శాసనాలు చేయబడ్డాయి. ఈ చట్టం తాత్కాలికమే అని ప్రకటిం చబడింది. శాసనసభ ఏర్పడిన తరువాత వీలైనంత త్వరలో సమగ్ర చట్టరూపం దాలుస్తుంది. రైతుల సోవియట్ డిప్యూటీస్ నిర్ధారించిన విధంగా ఇందులోని అంశాలు క్రమంగా అమలు జరుగుతాయి.

5. సాధారణ రైతులనుండి గాని, సాధారణ కొసక్కుల నుండిగాని భూమి స్వాధీనం చేసుకోబడదు. **(అనువాదం: కె ఉషారాణి)**

# హిందూత్వ వాదులు సైన్సుకు వ్యతిరేకులు



రచయిత్రి
ప్రముఖ చరిత్రకారిణి

మీరా నందా

"వైదిక ప్రపంచ దృష్టికి, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానానికి సజీవ సంబంధం ఉందని ఆపాదించటం మొదటి నుండి హిందూ జాతీయ వాదుల లక్ష్యంగా ఉంది. ఆధునిక శాస్త్ర విజ్ఞానం మన ఋషులకు తెలిసిన వైదిక ఆధ్యాత్మిక జ్ఞానం అనే మహాసముద్రంలో ప్రవహించే ఒక చిన్న ఉప నది లాంటిదయితే, పాశ్చాత్య విజ్ఞానం, శాస్త్రవేత్తలు వేదాలను తమ శత్రువుగా తప్పక భావిస్తారు.".

ప్రపంచంలోని అన్ని మూలల నుండి ఆధునిక యుగాన్ని ఆచరణాత్మకంగా నిర్వచించ గలిగిన విజ్ఞాన సాంప్రదాయం ఏదైనా ఉంది అంటే అది ఆధునిక శాస్త్ర విజ్ఞానం. శాస్త్ర విజ్ఞాన వికాసంలో అరబ్, భారత, చైనా నాగరికతల పాత్ర నిస్సందేహమైనప్పటికి, దీనితోపాటు ప్రపంచాన్ని పరిశీలించటంలో, విశ్లేషించే పద్ధతులలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పద్ధతులు 16, 17 శతాబ్దాలలో పశ్చిమ దేశాలలో ఆధునిక శాస్త్ర విజ్ఞానం పుట్టుకతో శిఖర స్థాయికి చేరాయనటాన్ని ఎవరూ నిరాకరించలేరు. విశ్వమంతటికీ వర్తించే ఆధునిక శాస్త్రానికి చెందిన పద్ధతులు, సిద్ధాంతాలు యూరపు నుండి ప్రపంచమంతటికి వ్యాపించాయి. అవి తరచుగా వలసవాద అధికారాల ద్వారా చేరాయి.

ఆధునిక శాస్త్ర విజ్ఞానం పశ్చిమ దేశాలలోనే పుట్టి, పశ్చిమ దేశాల దోపిడీ ద్వారా మిగతా ప్రపంచానికి విస్తరించిందనే వాస్తవాలు, ప్రాచ్యదేశాలలోని ప్రాచీన నాగరికతలను గర్వంగా భావించే వారికి ఆక్రోశాన్ని కలిగించేవిగా ఉన్నాయి. సుదీర్ఘకాలం బ్రిటీష్ వలస వాదాన్ని భరించిన భారతదేశంలో వ్యక్తమైనంత ఆక్రోశం వలసానంతర ప్రపంచంలో మరెక్కడా వ్యక్తం కాలేదు.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం సాధించిన సాంకేతిక ప్రగతి లేకుండా మనం జీవించలేము. అన్ని విజ్ఞాన సాంప్రదాయాలలో అత్యంత సారవంతమైన, ప్రభావవంతమైన సాంప్రదా యం మ్లేచ్ఛ సాంప్రదాయం కావటంతో జీర్ణించుకోలేని విషయంగా ఉన్నది. అపరిశుద్ధ జంతు మాంసం తినే భౌతికవాదులు, ఆధ్యాత్మిక మేలిమి లేనివారు, మన నాగరికతను తమదిగా భావించేవారు ప్రకృతి విజ్ఞానానికొచ్చే సరికి మనల్ని అధిగమించి, మనతో విభేదిస్తున్నారు. ఒకవైపు శాస్త్ర విజ్ఞాన సూపర్ పవర్ కావాలని అపరిమితమైన వనరులను వెచ్చిస్తూ విజ్ఞానశాస్త్రం పట్ల తీవ్ర ఆసక్తి కలిగి, మరోవైపు దాని చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను తక్కువ చేసి చూపుతూ దాని 'భౌతికవాద' దృక్పధాన్ని, సామాన్యీకరణ గుణాన్ని, దాని విజ్ఞానశాస్త్ర యూరప్ కేంద్రితాన్ని, విజ్ఞానశాస్త్ర ఆధిక్యతను తిరస్కరిస్తున్నాము. మనకు పశ్చిమ దేశాలలో మొదలైన భౌతికవాద శాస్త్రవిజ్ఞానం కావాలి, అదే సందర్భంలో ఆధ్యాత్మిక ఆధిక్యతా వాదంతో ఆపాదించుకున్న జగద్గురు హోదాని వదులుకోవడానికి సిద్ధంగా లేము.

ఆధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతికతపై సహజసిద్ధమైన ఆర్యఆధిక్యతా భావం, తీవ్రమైన ఆపేక్ష, అసూయ కలగలిసిన విషపూరిత మైన భారతదేశ ఎదురుదాడి మొదటి నుండి జరుగుతూనే ఉంది. బంకించంద్ర ఛటోపాధ్యాయ, వివేకానంద, దయానంద సరస్వతి, అనిబిసెంట్, సర్వేపల్లి రాధాకృష్ణన్, యం. యస్.గోల్వాల్కర్ వంటి చాలా మంది గురువులు, తత్వవేత్తలు, ప్రచారకుల యొక్క హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి సంబంధించిన గొప్ప రచనలను చదివినట్లయితే విజ్ఞానశాస్త్రం పట్ల అసూయ, గాయపడిన ఆత్మగౌరవం మనకు దర్శనమిస్తాయి. ప్రస్తుతం ఈ మేధావుల యొక్క వారసులుగా ఉన్న ప్రస్తుత హిందూ జాతీయవాదులు, వారి గురువులు కూడా ఇవే లక్షణాలను ప్రదర్శిస్తున్నారు.

**వేదాలు, విజ్ఞానశాస్త్రాల పుట్టినిల్లు**

అసూయ, ద్వేషాలతో కూడిన ఈ సూత్రీకరణ హిందువులను ఉత్తేజపరచడానికి ఉద్దేశించినది. దీనిని సాధించటం ఎలా? ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని వేద ప్రమాణంలోకి అమర్చి హిందూ ఆధిపత్యాన్ని చాటాలని రాజీవ్ మల్హోత్రా ఇటీవల హిందూవులకు పిలుపునిచ్చాడు.

వేదశృతికి చెందిన ప్రాచీన ఋషులు ధ్యాన స్థితిలో పొందిన ఇంద్రియ జ్ఞానం, సహేతుకతతో కూడిన మానవ నిర్మిత స్మృతిగా ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని పరిగణించాలని మల్హోత్రా ప్రతిపాదించాడు. ఆధునిక విజ్ఞానశాస్త్ర భావనలను వివిధ వేదాల యొక్క ఉప భాగాలుగా చూపించబడటమే దీని లక్ష్యం. ఉదాహరణకు భౌతిక శాస్త్రవేత్త శక్తిని ఈ విధంగా నిర్వచిస్తాడు – ఒక పనిని చేయడానికి కావలసిన ఖచ్చితమైన పరిమాణాత్మకమైన సామర్ధ్యము. దీనిని మన యోగ నిపుణులకు తెలిసిన 'మేధాశక్తి' గాను లేదా మొత్తం శక్తికి ఉప శాఖగాను వర్తింపచేశారు. డార్విన్ సిద్ధాంతం యోగ సూత్రాలలో బోధించిన ఆధ్యాత్మిక పరిణామం యొక్క తక్కువ స్థాయి భౌతికవాద ఉత్పాదన అని రకరకాలుగా చెప్పారు. ఈ విధంగా ఆధునిక విజ్ఞానశాస్త్రము మన 'రిషి' స్థితిలో కూడా ఉంది. అంతేకాదు ఒక సారి మన శాస్త్ర విజ్ఞాన నదులను మహా సముద్రం లాంటి వేదాలలోకి ప్రవహింప చేసినట్లైతే, హిందూ జాతీయవాదుల చిరకాల వాంఛ నెరవేరుతుంది, భారతదేశం 'ప్రపంచ గురు' స్థానాన్ని సాధిస్తుంది.

వైదిక ప్రపంచం, ఆధునిక విజ్ఞానశాస్త్రాల మధ్య సహజ ఏకీకరణను నిర్ధారించడమే, మొదటి నుండీ హిందూ జాతీయవాదుల లక్ష్యం.

"ఆధునిక విజ్ఞానశాస్త్రం మరేదోకాదు, పాశ్చాత్య ప్రపంచ అసూయ చెందేలా మన ఋషులకు ఎప్పుడో తెలిసిన వైదిక ఆధ్యాత్మికశాస్త్రం అనే మహాసముద్రంలోకి ప్రవహించే ఒక ఉపనది మాత్రమే". ఇది బహుశా విజ్ఞానశాస్త్రం పట్ల వారికి ఉన్న అసూయకు ఒక తెలివైన పరిష్కారం. ఇది గాయపడిన(అర్థం లేని) ఆత్మగౌరవానికి (తగిలిన గాయానికి) రాసే మందు మాత్రమే కాదు, విజ్ఞానశాస్త్రాన్ని వేదాలలో ఇమిడి వేదాలకు విజ్ఞానశాస్త్ర వెలుగునివ్వాలనే ప్రయత్నం. అంతేకాకుండా ఋషులు కాని వారు వాడే పద్ధతుల కొత్త ప్రశ్నలను అడగటానికి కానీ, కొత్త సమాధానాలను కానీ అందించే సామర్థ్యం లేని వేదాలు శాస్త్ర విజ్ఞానానికి తల్లివంటివని చెప్పటం ఒక "అద్భుతమైన ఆటంకం". (ఈ పదబంధం ఫ్లోరిస్ కోహెన్ నుండి గ్రహించబడిందిట)

**"నరేంద్ర మోడీ ప్రభుత్వ మొదటి సంవత్సర పాలనలో రాష్ట్ర స్థాయి విద్యా విభాగాల లోను, మేధోమథనాలలోను, ప్రజా సమూహాల వద్ద ఈ వక్రీకరణలన్నింటినీ అందంగా పేర్చి ముందుకు వెళ్ళేట్లు ప్రచారంలో పెట్టారు. నరేంద్రమోడీ 2014 అక్టోబర్‌లో ఇచ్చిన కర్ణ-గణేశ ఉపన్యాసం, ముంబైలో 2015 జనవరిలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ చర్చలు మనకు బాగా తెలిసిన విషయాలే."**



చరిత్ర వక్రీకరణలో మోడీ తరువాతే ఎవరైనా

## సైన్స్ చరిత్ర వక్రీకరణ

ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని స్మృతిగా మార్చే ఈ పథకం, పెద్ద ఎత్తున పదే పదే విజ్ఞానశాస్త్ర చరిత్రను వక్రీకరించేందుకు తోడ్పడింది. ఈ వక్రీకరణ విషయ స్థాయిలోను, అనువర్తన స్థాయిలోను జరిగింది. ప్రాచీన భారత్ విషయంలో సహ నాగరికతల సాక్ష్యాలను పరిగణలోకి తీసుకోకుండా వాస్తవాలను వక్రీకరించటమో లేదా పురాణ గాథలను వ్యాఖ్యానించటమో చేశారు. ఆధునిక విజ్ఞానశాస్త్రానికి చెందిన క్వాంటం ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, జన్యుశాస్త్రం, నరాల శాస్త్రం, తదితర అంశాలు పురాతన గతంలోని ఋషుల, తత్వవేత్తల ఊహాత్మకమైన ప్రబోధాలుగా తీవ్రంగా వక్రీకరించబడ్డాయి. దుర్భేధ్యమైన వేదశాస్త్రం యొక్క నిర్మాణం ఇలాంటి వక్రీకరణల ద్వారా జరిగింది.

నరేంద్ర మోడీ ప్రభుత్వ మొదటి సంవత్సర పాలనలో రాష్ట్ర స్థాయి విద్యా విభాగాల లోను, మేధోమథనాలలోను, ప్రజా సమూహాల వద్ద ఈ వక్రీకరణలన్నింటినీ అందంగా పేర్చి ముందుకు వెళ్ళేట్లు ప్రచారంలో పెట్టారు. నరేంద్రమోడీ 2014 అక్టోబర్‌లో ఇచ్చిన కర్ణ-గణేశ ఉపన్యాసం, ముంబైలో 2015 జనవరిలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ చర్చలు మనకు బాగా తెలిసిన విషయాలే. ఇలాంటి తీవ్రస్థాయి సంఘటనలు ఎప్పటికీ ఆగకుండా పెరుగుతూ పుంజుకుంటూ ఉండే నీటిలోని మంచుశిఖరం(ఐస్‌బర్గ్) యొక్క కనబడే కొనలాంటిది మాత్రమే.

ఈ సంఘటనలు మీడియాలో కొన్ని క్షణాలపాటు నిరసించబడినప్పటికీ, విజ్ఞానశాస్త్ర చరిత్రకారుల నుండి వాస్తవ నిర్ధారణ జరగలేదు. ఈ విధమైన అర్ధ సత్యాలను తీవ్రంగా పరిగణించి అసలైన వాస్తవాలను, వాదనలను, ఇతర పురాతన నాగరికతలలోని సాక్ష్యాలను వెలుగులోకి తేనంతకాలం అవి అలాగే చలామణి అవుతూ ఉంటాయి.

జాతీయవాద కల్పితాల నుండి వాస్తవాలను వేరు చేయటానికి, భారత విజ్ఞానశాస్త్ర చరిత్ర గురించిన మూడు విధానాలను పరిశీలించాలి. వీటిల్లో రెండు గణితశాస్త్రానికి సంబంధించినవి. మొదటిది పైథాగరస్ సిద్ధాంతాన్ని నిజంగా కనుగొన్నది భౌద్ధాయణుడని, రెండవది 'సున్న' ను భారతదేశంలో కనుగొన్నామని ప్రకటించటం. మూడవది జన్యుశాస్త్రానికి సంబంధించినది మరియు అనువంశికతకు సంబంధించిన ప్రాచీన భారతీయ అవగాహన.

## పైథాగరస్ సిద్ధాంతం

ఆధ్యాత్మిక సత్యాలు మానవ మేధస్సుకు అతీతమైనవి అనే నమ్మకంగల పైథాగరస్ టర్కీకి దగ్గరలో ఉన్న దీవిలో క్రీ.పూ. 570లో పుట్టారు. ఆయన భారతదేశంలో చాలా అవమానానికి గురయ్యారు. ఆయన పేరు మీద ఉన్న ఆ సిద్ధాంతం ఆయన కనుగొన్నది కాదని, ఆ గౌరవం అతనికి పొరపాటుగా దక్కింది. కాని అసలు సిద్ధాంత కర్త మన పూజారి, వృత్తి కళాకారుడు, సుల్వ సూత్రాలను క్రీ.పూ. 800–200 లమధ్యలో రచించిన రచనలు బౌద్ధాయనుడే అని భావన ఉంది. బౌద్ధాయనుడి రచనలు పైథాగరస్ ముందు కాలానివి కావడంతో, పైథాగరస్ భారతదేశానికి ప్రయాణించి హిందూ గురువుల వద్ద ఈ సిద్ధాంతాన్ని అభ్యసించి ఉంటాడని ఊహిస్తున్నారు. చాలా కాలం హిందూ కేంద్రిత చరిత్రకారులు ఈ సిద్ధాంతం యొక్క పేరును 'బౌద్ధాయన సిద్ధాంతం'గా మార్పు చేయాలని కోరుతున్నారు. పైథాగరస్ సిద్ధాంతాన్ని కొనుగొనడమే కాదు ఆయన ఆ సిద్ధాంతానికి నిరూపణలు ఇచ్చాడని, పైథాగరియన్ త్రయాలను కనుగొన్నాడని, అకరణీయ సంఖ్యల యొక్క వర్గమూలాన్ని మొదట కనుగొన్న వ్యక్తనే విషయాలను కూడా బౌద్ధాయనుడికి ఆపాదిస్తున్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన మంత్రి డా॥ హర్షవర్ధన్ గత సంవత్సరం జరిగిన సైన్స్ కాంగ్రెస్ ప్రారంభోత్సవంలో ఈ విషయాన్ని చెప్పారు.

బౌద్ధాయనుడిని గురించిన పై నిర్ధారణలన్ని తప్పు. ఆ కాలంలో సుల్వ సూత్రాలు

❝ ఆ ప్లిమ్‌ప్టన్ నేడు మనం చెప్పుకునే పైథాగరియన్ ట్రిపుల్స్ అని, యేల్ యూనివర్సిటీలో ఉన్న వై.బి.సి. 7289 ఖచ్చితమైన 2 యొక్క వర్గమూలమును సూచిస్తున్నదని ఆయన, ఆయన సహచరులు నిరూపించారు. ఈ రెండు పలకలు బౌద్ధాయనుడికి ఆపాదించిన దానిలోని లోపాలను చూపుతున్నాయి.❞


స్వామి వివేకానంద

రచించే సమయంలో భారతదేశానికి అవతల ఇతర నాగరికతలలో ఏం జరిగిందో పరిశీలిస్తే అవన్నీ ఆవిరైపోతాయి.

బౌద్ధాయనుడు పుట్టడానికి వెయ్యి సం॥ ముందు మెసపొటేమియన్స్ పైథాగరస్ సిద్ధాంతం వర్ణించిన లంబకోణ త్రిభుజము యొక్క భుజాల మధ్య సంబంధాన్ని కనుగొన్నారు. యుఫ్రటీస్–టైగ్రిస్, నైల్ నదులకు వచ్చిన వరదల మూలంగా మెసపొటేమియా, ఈజిప్షియన్ నాగరికతల మధ్య సరిహద్దులు చెరిగిపోయినపుడు తిరిగి సరిహద్దు కొలతలకు వారు దీనిని ఉపయోగించేవారు. ఈజిప్షియన్‌లకు చెందిన ఆధారాలు తర్వాత కాలంలో వెలుగులోకి వచ్చినప్పుడు మెసపొటేమియన్లకు పైథాగరస్ సిద్ధాంతం తెలుసని, పైథాగరస్ ట్రిపుల్స్ మీద పని చేశారని, 2 యొక్క వర్గమూలాన్ని కనుగొనటం తెలుసని, దానిని క్రీ.పూ.1800 కి చెందిన గట్టి పలకల మీద ముద్రించిన ఆధారాలు బౌద్ధాయనుడి కంటే వెయ్యి సంవత్సరాలకు ముందే వెలుగు చూశాయి. ఇది బౌద్ధాయనుడికి 1000 సం॥ల ముందు కొలంబియా, యేల్ యూనివర్సిటీలలో వున్న రెండు మట్టి పలకలు ప్రత్యేకంగా – ప్లిమ్‌ప్టన్ 322 మరియు వై.బి.సి. 7289 – లను ప్రపంచలోనే క్యూనిఫారం వ్రాత మీద పట్టున్న ఒట్టు న్యూగ్‌బార్ 1940లో చదివారు. ఆ ప్లిమ్‌ప్టన్ నేడు మనం చెప్పుకునే పైథాగరియన్ ట్రిపుల్స్ అని, యేల్ యూనివర్సిటీలో ఉన్న వై.బి.సి. 7289 ఖచ్చితమైన 2 యొక్క వర్గమూలమును సూచిస్తున్నదని ఆయన, ఆయన సహచరులు నిరూపించారు. ఈ రెండు పలకలు బౌద్ధాయనుడికి ఆపాదించిన దానిలోని లోపాలను చూపుతున్నాయి.

మెసపొటేమియా నుండి తూర్పుకు, భారతదేశం నుండి కూడా తూర్పున ఉన్న చైనీయులు ఈ సిద్ధాంతాన్ని ప్రకటించటమే కాకుండా కన్‌ఫ్యూషియస్ (క్రీ.పూ. 600) కాలంలో ఆధారాన్ని కూడా చూపించారు. చైనా ఆధారం క్రీ.పూ. 1100–600 చౌ పి సువాన్ చింగ్ మధ్య వ్రాసిన గ్రంథం నుండి గ్రహించ బడింది. తర్వాత హన్ సామ్రాజ్య (క్రీ.పూ. 3వ శతాబ్దం) గణిత గ్రంథాలలో ఈ సిద్ధాంతము సాధారణీకరించబడి, దానికి కౌ.కు (లేక గౌ–గు) అని పేరు పెట్టారు.

చైనీయులు సాధించిన ప్రగతి మనల్ని ఆధారాల వద్దకు తీసుకు వచ్చింది. సుల్వ సూత్రాలు పూజా మందిరాలను నిర్మించటానికి, అన్ని రకాల క్లిష్టమైన జ్యామితీయ రూపాలు, వాటి మార్పులకు మెరుగైన, తెలివైన గణిత సహాయకాలను అందించటానికి సంబంధిం చినవి. ఇవి జ్యామితీయ నియమాల నిరూపణకు ఉద్దేశించినవి కావు. మెసపొటేమియన్లు, ఈజిప్టియన్లు కూడా ఎలాంటి ఆధారాలను ఇవ్వలేదు.

పైథాగరస్ సిద్ధాంతం నిరూపణ ఎక్కడ నుండి వచ్చింది? అన్ని లంబకోణ త్రిభుజాలకు సాధారణ నిరూపణ తనంతట తాను పైథాగరస్ ఇచ్చాడో, లేదో స్పష్టంగా లేదు. గ్రీకు సాంప్రదాయంలో మొదటి స్పష్టమైన సిద్ధాంత నిరూపణ పైథాగరస్ అనంతరం 3 శతాబ్దాల తర్వాత నివసించిన యూక్లిడ్ నుండి వచ్చింది. మొత్తం ఆధారం యూక్లిడ్‌కి ముందు 3 శతాబ్దాల ముందు వ్రాసిన, పైన పేర్కొన్న చైనా గ్రంథంలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇదే పైథాగరస్ సిద్ధాంతానికి మొదటి నిరూపణ. యూక్లిడ్ తార్కిక పద్ధతిలా కాక చైనా నిరూపణ దృశ్య ప్రదర్శన ఆధారంగా సాధారణ విషయాన్ని హేతుబద్ధంగా కనుగొనవచ్చు. ఈ సిద్ధాంతానికి భారతదేశంలో మొదటి నిరూపణ 12వ శతాబ్దంలో భాస్కరుని కాలంలో వచ్చింది. చైనా విజ్ఞానశాస్త్ర చరిత్రకారుడు జోసెఫ్ నీథమ్ లాంటి మరికొంత మంది భాస్కరుని నిరూపణ చైనా చౌపీలోని హుయన్ తు పటాన్ని పోలి ఉంది అని చెప్పారు.

పైథాగరస్ యుక్తవయసులో కొంత కాలం మెసపొటేమియన్లు, ఈజిప్షియన్లతో గడిపి ఈ సిద్ధాంతాన్ని కనుగొన్నట్లు గ్రీకు సాంప్రదాయం గుర్తిస్తోంది. విశ్వం యొక్క అంతిమ వాస్తవాన్ని సంఖ్యలు, వాటి నిష్పత్తులలో తెలుసుకోవచ్చనే ఆయన ప్రపంచ దృక్పధాన్ని ఆయన కనుగొన్న అకరణీయ సంఖ్యలు సవాలు చేయటంతో, ఆయన చెప్పిన గణితశాస్త్రం ప్రాధాన్యత సంతరించుకున్నది. తన పేరుతో సిద్ధాంతం ఉండటం వల్ల కాక ప్రకృతిని గణితశాస్త్రం ద్వారా అర్థం చేసుకోవచ్చనే గొప్ప భావన ద్వారా పైథాగరస్ శాస్త్ర విజ్ఞాన చరిత్రలో గొప్ప ప్రాధాన్యతను పొందాడు. ఈ దూరదృష్టే జోహన్స్ కెప్లర్, గెలీలియో గెలిలీ లాంటి ఆధునిక విజ్ఞానశాస్త్ర మహామహులకు స్ఫూర్తినిచ్చింది. ప్రయోగాలు, ఖచ్చితమైన, పరిమాణాత్మకమైన కొలతలు తోడైనపుడు ప్రకృతి గణితీకరణ ఎదురులేని శక్తిగా ఆధునిక శాస్త్ర

విజ్ఞానంగా మారుతుంది.

**సున్నా మరియు భారత కేంద్రితం**

భారతదేశం ప్రపంచానికి హిందూ విజ్ఞాన శాస్త్రం పవిత్రమైన ఆవుగా 'సున్న'ను ఇచ్చింది. భారతదేశం 'సున్న'ను ఇవ్వకపోయివుంటే ప్రపంచానికి లెక్కపెట్టడం తెలిసి ఉండేది కాదు, ఉన్నత గణితశాస్త్రం సాధ్యమై ఉండేది కాదు, సమాచార, సాంకేతిక విప్లవం వచ్చి ఉండేది కాదు అని తరతరాల భారతీయులు నమ్ముతూవచ్చారు.

'సున్న'ను పూర్తిగా భారతీయులే కనిపెట్టారనేది వాస్తవమేనా? 'సున్న' ఎక్కడనుండీ, ఏ ప్రభావం లేకుండా స్వచ్ఛంగా హిందూ మెదడు నుండే పుట్టిందా?

భారత విజ్ఞానశాస్త్ర చరిత్ర రచనకు అధికారముద్ర అయిన ఇండో సెంట్రిజంకు మనం కట్టుబడి ఉన్నట్లయితే, ఈ కల్పనను మనం కొనసాగిస్తూనే ఉంటాము. యూరో సెంట్రిజం అన్ని విజ్ఞానశాస్త్రాలకు పుట్టినిల్లు గ్రీస్ అని చెప్తున్నట్లుగానే దాని ప్రతిబింబంలాగా ఇండోసెంట్రిజం ప్రాచీన, సాంప్రదాయ, (ఇస్లాంకు ముందు) భారతదేశం నుండి సమకాలీన నాగరికతలు చాలా గ్రహించాయని చెప్తుంది. ఏదైనా ఆలోచన భారతదేశంలోను, అదే సమయంలో ఇతర చోట్ల కూడా ఉన్నట్లయితే మన ఇండోసెంట్రిజం చరిత్రకారులు భారతదేశం నుండే ఇతర చోట్లకు వెళ్ళిందని చెబుతున్నారు. అంతేకాని ఇతరచోట్ల నుండి భారతదేశానికి వచ్చిందని చెప్పడం లేదు.

పూర్తి దశాంశ స్థాన విలువతో కూడిన, శూన్య విలువ స్థానంలో ఖాళీతో ఉన్న చైనీస్ రాడ్ న్యూమరల్స్, ఆగ్నేయాసియా దేశాల నుండి వచ్చి ఉండవచ్చనే దానిని ఇండో సెంట్రిజం అనే అంధత్వం అలముకోవటంతో భారత చరిత్రకారులు అంగీకరించలేకపోతున్నారు. చైనా నుండి 'సున్న' ఆగ్నేయాసియా దేశాలకు వచ్చిందని "సైన్స్ అండ్ సివిలైజేషన్ ఇన్ చైనా" అనే తన పుస్తకంలో నీధమ్ వాదించారు. గుర్తింపు పొందిన గణిత శాస్త్రవేత్త, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన లాం లే యాంగ్ కూడా ఇటీవల ఇలాంటి సిద్ధాంతాన్నే ప్రతిపాదించారు. జాగ్రత్తగా పరిశీలించబడిన వివరాలతో, ఆధారాలతో కూడిన ఈ సిద్ధాంతం ప్రపంచవ్యాపితంగా వృత్తిపరమైన శిక్షణ పొందిన చరిత్రకారుల ఆమోదం పొందుతూ, గణితశాస్త్ర చరిత్రలో ప్రభావవంతమైన పాఠ్యగ్రంథాల సరసన స్థానం సంపాదించింది. భారతదేశంలో ఈ విషయంపై మూగనోము పాటిస్తున్నారు.

**"పూర్తి దశాంశ స్థాన విలువతో కూడిన, శూన్య విలువ స్థానంలో ఖాళీతో ఉన్న చైనీస్ రాడ్ న్యూమరల్స్, ఆగ్నేయాసియా దేశాల నుండి వచ్చి ఉండవచ్చనే దానిని ఇండో సెంట్రిజం అనే అంధత్వం అలముకోవటంతో భారత చరిత్రకారులు అంగీకరించలేకపోతున్నారు. చైనా నుండి 'సున్న' ఆగ్నేయాసియా దేశాలకు వచ్చిందని "సైన్స్ అండ్ సివిలైజేషన్ ఇన్ చైనా" అనే తన పుస్తకంలో నీధమ్ వాదించారు."**



డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

**స్థాన విలువ లేకపోవటం**

భారతదేశంలో 'సున్న' పుట్టుక గురించిన సాంప్రదాయ కథనాలు రెండు అసౌకర్యవంతమైన, నిర్ధారించబడిన వాస్తవాలను కప్పిపుచ్చాలని చూస్తున్నాయి.

1. 6 శ॥ వరకు భారతీయ సంఖ్యామానంలో మనకు స్థాన విలువ కనిపించదు.

2. 'సున్న' మొదటి భౌతిక ఆధారం మనకు భారతదేశంలో కాక ఇండియా, చైనా మధ్యనున్న కాంబోడియా, ఇతర ఆగ్నేయాసియా దేశాల నుండి లభ్యమవుతుంది. ఈ రెండు విషయాలను జాగ్రత్తగా విశాల దృష్టితో పరిశీలించవలసి ఉంది.

"స్థాన విలువ" ఒక అంకె యొక్క విలువ, అది ఒక సంఖ్యలో దాని స్థానాన్ని బట్టి మారుతుంది. ఈ పద్ధతిలో ఎంత పెద్ద సంఖ్యనైనా '9' అంకెలు మరియు ఖాళీ స్థానం ఒక చిహ్నంతో మాత్రమే సూచించవచ్చు.

'స్థాన విలువ'కు సంబంధించిన సూచనలు నిర్దిష్ట సంకేతాలను వుపయోగించే 'భూత సంఖ్యామానం'లో ఉన్నాయి. (ఉదా: 2 కు సమానార్ధం కళ్ళు, 3 కు అగ్ని (3 అగ్ని క్రతువులు), 6 కు అంగ (వేదాంగాలు – 6))

భూత సంఖ్యలో ఉపయోగించే సంఖ్యా సంకేతాల క్రమం ఆ సంఖ్య యొక్క విలువలను నిర్ణయిస్తుంది. దీనిని 'స్థాన విలువ'కు ఆధారంగా అంగీకరించబడింది. ఈ పద్ధతి క్రీ.శ. 3వ శతాబ్దం నుండి ఖగోళ శాస్త్రజ్ఞులు, గణిత శాస్త్రజ్ఞులచే 14 శతాబ్దం వరకు ఉపయోగించబడింది. కాగా భూత సంఖ్య ఛందోబద్ధమైన రచనలకు, జ్ఞాపక శక్తికి ఉపయోగపడేది. కాని, గణనకు అంత ఉపయుక్తం కాదు. ఎందుకంటే గణనకు కావలసినది అంకెలు కాని చిహ్నాలు కాదు.

ఉపఖండం మీద బ్రాహ్మి అంకెలు ఉనికిలోకి వచ్చిన 900 సం॥ల వరకు భారతీయ సంఖ్యామానంలో స్థాన విలువ కనిపించదు. అశోకుని కాలంలో (క్రీ.పూ 3వ శతాబ్దం) బ్రాహ్మి అంకెలు ఉనికిలోకి వచ్చి గుప్తుల కాలం (5వ శతాబ్దం) చివరి నాటికి దేవనాగరి అంకెలుగా రూపొందాయి. నానాఘాట్ గుహ శాసనంతో సహా ఇప్పటి వరకు కనుగొన్న ఏ బ్రాహ్మి శాసనం కూడా 'స్థాన విలువ' ఉన్నట్లు సూచించలేదు. గుప్తుల కాలం తర్వాత ఆకస్మికంగా 'స్థాన విలువ' సంకేతాలు మొదలయ్యాయి. (ఎక్కువగా రాగి భూదాన పటాలు, తర్వాత కాలంలో వాటిలో ఎక్కువ భాగం నకిలీ అని తేలింది). అనంతరం ఖాళీ స్థానాన్ని సూచించటానికి బిందువు (•)ను ఉపయోగించేవారు. మనకు తెలిసినంతవరకు 'సున్న' గురించిన మొదటి నమోదు కాబడిన ఆధారము 876 సం॥లో గ్వాలియర్ ఆలయంలో దొరికింది.

'స్థాన విలువ' 900 సం॥లు ఉనికిలోలేని అంశం చాలా ముఖ్యమైనది. ఎందుకంటే స్థాన విలువను వుపయోగించి సంఖ్యలను వ్రాసే

**"ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. భారతదేశం 'సున్న'కు జన్మస్థలమైనపుడు దానికి సంబంధించిన మొదటి ఆధారం భారతదేశంలో కాకుండా ఆగ్నేయాసియా దేశాలలో ఎందుకు లభించింది? ఒక వేళ ఆగ్నేయాసియా 'సున్న' కూడా భారతదేశం వల్ల ప్రభావితమైతే భారతదేశంలో కంటే ముందే ఎందుకు ఆ దేశాల్లో ఉన్నది."**



పైథాగరస్

పద్ధతి లేనప్పుడు 'సున్న' అనే అంకె ఆవిష్కరింపబడాల్సిన అవసరమే లేదు.

కేవలం స్థాన విలువ పద్ధతిలోనే లోపించిన అంకె స్థానంలో సూచించటానికి సున్న అవసరం. (ఉదా: ఖాళీ స్థానాలకు ప్రత్యేక పదాలను వాడకుండా 2004 అనే సంఖ్యను పదాలతో సూచించవచ్చు. 2 - 4 ల మధ్య లోపించిన అంకెలను సున్నా '0' లతో సూచించకపోతే 24కు 2004కు మధ్య తేడా స్పష్టంగా తెలియదు.

నేటి 'హిందూ - అరబిక్' సంఖ్యామానంతో పోల్చదగిన సరిపోలిన మొదటి (స్థాన విలువతో కూడిన) దశాంశ పద్ధతి క్రీ.పూ. 4వ శతాబ్దంలో చైనాలో ఆవిర్భవించింది. ఈ వ్యవస్థ రోజువారీ ఉపయోగించే గణన పద్ధతి నుండి ఆవిర్భవించి సమాజంలోని అన్ని విభాగాలకు ప్రభుత్వ అధికారులు, ఖగోళవేత్తల నుండి సన్యాసుల వరకు విస్తరించింది. దాదాపు 14 మి.మీ. పొడవు కలిగిన పుల్లలను (కౌంటింగ్‌రాడ్స్) లెక్కించడం - ఒక నున్నటి ఉపరితలం మీద గీయబడిన నిలువు గీతలపై కదులుతాయి. కుడి నుండి ఎడమకు 10 వర్గము పెరుగుదలను సూచిస్తూ, ప్రత్యేకంగా అమర్చబడిన రాడ్‌కు 1 నుండి 9 అంకెలను కేటాయిస్తారు. 10 కంటే పెద్ద సంఖ్యలను సూచించడానికి రాడ్‌లను ఎడమ నుండి తర్వాత నిలువు వరుసలోకి జరుపుతారు. రాడ్‌లను అడ్డు, నిలువు వరుసల మధ్య కదుపుతూ ఉండే ఏర్పాటు సంఖ్యలను సులభంగా చదవడానికి తోడ్పడుతుంది. మన చేత శూన్య లేదా సున్నాగా పిలవబడేదాన్ని 'కాంగ్' అని పిలుస్తూ, దానికి సూచనగా ఖాళీ కాలమ్‌ను వదిలేవారు. 12వ శతాబ్దంలో అబాకస్ తన స్థానాన్ని ఆక్రమించుకునే వరకు చైనా గణిత శాస్త్రజ్ఞులు నేడు మనం ఆల్జీబ్రా సమీకరణలుగా పిలుస్తున్న వాటిని సాధించేందుకు కూడా ఈ పద్ధతి ఉపయోగించారు.

భారతదేశంలో 'సున్న' పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి చైనా రాడ్ అంకెలు ఎంత ముఖ్యమైనవో త్వరలోనే తెలుస్తుంది. క్రీ.పూ. 1 శతాబ్దానికి ముందే విస్తృత సంబంధాలున్న మన పొరుగు దేశంలో స్థాన విలువ, శూన్య ప్రదేశము కలిగిన పూర్తి దశాంశ పద్ధతి అమలులో ఉన్న విషయం గుర్తించాల్సి ఉంది. దాదాపు 900 సం॥లు కనబడని దశాంశ స్థాన విలువ, తర్వాత ఆకస్మికంగా 'దేవనాగరి' సంఖ్యలలో కనిపించడం వెనుక మన పొరుగు దేశ ప్రభావం కొట్టిపారేయదగినదా?

ఇక రెండవ అసౌకర్య వాస్తవం - సున్న యొక్క మొదటి భౌతిక ఆధారాన్ని భారతదేశంలో కాక కాంబోడియాలో కనుగొన్నారు. "చక శకం 605వ సం॥కి కృష్ణ పక్ష చంద్రుని యొక్క 5వ రోజు చేరుకుంది" అని వ్రాసిన కాంబోడియా స్తంభ శాసనము ద్వారా మనకు మొదటి ఆధారము దొరికింది. 605లోని '0' బిందువు (•) చే సూచించబడింది. ఈ శాసనము 683 సం॥లో వేయబడింది. (ఖ్మేర్ రోజ్ పాలనలో కనిపించకుండా పోయిన ఈ శాసనాన్ని తిరిగి అమీర్ అక్జెల్ అనే అమెరికన్-ఇజ్రాయిల్ గణిత శాస్త్రవేత్త 2013లో తిరిగి కనుగొన్నారు)

'సున్న'ను బిందువు (•)తో సూచించిన కాంబోడియా స్తంభశాసన కాలానికి చెందిన శాసనాలు సుమత్ర, బంకాద్వీపాలు, మలేషియా, ఇండోనేషియాలలో కూడా లభించాయి.

'సున్న'కు సంబంధించి భారతదేశంలో మొదటి భౌతిక ఆధారం గ్వాలియర్ పట్టణానికి సమీపంలో రాతితో నిర్మించిన చతర్భుజ వైష్ణయవాలయంలో దొరికింది. ఆ ఆలయం యొక్క గోడ మీద చెక్కిన శాసనం ఆలయానికి 270 × 187 హస్తాల భూమి దానంగా ఇచ్చినట్లు, ప్రతి రోజు దైవానికి 50 పూలదండలను ఇవ్వాలని వాగ్దానం చేసినట్లుగా ఉంది. ఈ సంఖ్యలు దేవనాగరి లిపిలో వ్రాయబడి శూన్య ప్రదేశాలను ఖాళీ వలయాలతో సూచించారు. ఈ శాసనము 876 సం॥నకు చెందినది అంటే కాంబోడియా శాసనము వేసిన 2 శతాబ్దాల తర్వాత కాలానికి చెందినది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. భారతదేశం 'సున్న'కు జన్మస్థలమైనపుడు దానికి సంబంధించిన మొదటి ఆధారం భారతదేశంలో కాకుండా ఆగ్నేయాసియా దేశాలలో ఎందుకు లభించింది? ఒక వేళ ఆగ్నేయాసియా 'సున్న' కూడా భారతదేశం వల్ల ప్రభావితమైతే భారతదేశంలో కంటే ముందే ఎందుకు ఆ దేశాల్లో ఉన్నది.

ఈ ప్రశ్నలకు 'నీధమ్' ఇచ్చిన సహేతుకమైన వివరణకు 'లాం లే యంగ్' బలాన్ని చేకూర్చారు. నీధమ్ చెప్పినట్లుగా ఆగ్నేయాసియా వద్ద హిందూ సంస్కృతి తూర్పు భాగము, చైనా

సంస్కృతి దక్షిణ భాగం కలుస్తాయి. ఎంతో మంది వ్యాపారులు, రాజ్యాధికారులు, సైనికులు, బౌద్ధ యాత్రికులు, సన్యాసులు లాంటి అనేక మంది భారత్, చైనాల మధ్య ఈ సాంస్కృతిక ప్రాంతంలో ప్రయాణించి ఉంటారు. ఈ యాత్రికులు చిన్నవైన చైనా గణన రాడ్లను, గణన బోర్డులను తమ వెంట తీసుకువెళ్ళటం అసహజమైన విషయమేమీ కాదు.

భారత్-చైనా సరిహద్దు ప్రాంతంలో నివసించే స్థానికులు గణన రాడ్ల వెనక ఉన్న తర్కాన్ని బయటకు రానీయకుండా తమకు తెలిసిన విధంగా అంకెలను ఉపయోగించి ఉండవచ్చు. చైనా గణన బోర్డులలోని శూన్య ప్రదేశాన్ని బిందువుకు బదులుగా భారత దేశంలో శూన్య వలయంతో సూచించడంతో క్రమంగా మనకు తెలిసిన 'సున్నా'గా మారింది. "హాన్ గణన బోర్డులోని శూన్య విలువకు సంకేతాన్ని భారతీయులు ఆవిష్కరించారు" అని నీధమ్ పేర్కొన్నారు. మరో విధంగా చెప్పాలంటే దశాంశ స్థాన విలువ శూన్య ప్రదేశం చైనాలో ఆవిష్కరించబడితే, ఈ రోజు మనకు తెలిసిన విధంగా 'సున్నా' అనే భౌతిక చిహ్నాన్ని భారతీయులు సమకూర్చారు.

ఈ వివరణ 'సున్న' గురించి మనం గొప్పగా చెప్పుకునే మన కీర్తి కిరీటాన్ని కదిలించింది. ఇది భారత ఆధారాలలోని ఖాళీలను పూరించటానికి హేతుబద్ధమైన, సమంజమైన సిద్ధాంతం. ఈ విష యాన్ని తీవ్రమైనదిగా తీసుకోకుండా, మరింత పరిశోధించకుండా కేవలం మన ఇండోసెంట్రిజం మనల్ని ఆపుతున్నది.

**చరిత్ర అభూతకల్పనల మేళవింపు**

విజ్ఞానశాస్త్ర చరిత్రను వక్రీకరించిన విషయాలలో మూడవది, చివరిది ప్రధాని నుండే వచ్చింది. వందల సంవత్సరాల విజ్ఞాన శాస్త్ర పరిశోధనల ఫలితంగా మనకు తెలిసిన విషయాన్ని, ప్రాచీనయుగంలోని గ్రంథాలలో నిక్షిప్తమై ఉందని చెప్పటం వక్రీకరణ ఏవిధంగా ఉందో తెలుసుకోవటానికి ఒక ఉదాహరణ.

నరేంద్రమోడీ ఇచ్చిన కర్ణ-గణేశ ఉపన్యాసంలోని విషయం మనకు తెలిసినదే. మహాభారతంలోని కర్ణుడు కృత్రిమ బాలుడని చెప్పి, జన్యుశాస్త్రం ఆ రోజులలోనే ఉందని ఆయన చెప్పారు. గణేశుని ఏనుగుతల ప్లాస్టిక్ సర్జన్ ఆనాడే ఉన్నడనేందుకు నిదర్శనమని, ఆయన వేర్వేరు జంతువుల తలలు మార్పిడి చేసి ఉంటాడని మోడీ చెప్పారు.

ఈ ఉపన్యాసాన్ని రాజకీయ నాయకులు

**"ఈ ఉపన్యాసాన్ని రాజకీయ నాయకులు పైపైన చెప్పే విషయంగా కొట్టిపారేయలేము. మోడీ చారిత్రక వాస్తవాలకు, అభూత కల్పనలకు మధ్య హద్దులు లేవని నమ్మే శాఖాసంస్కృతి బిడ్డ, జీవితకాల స్వయంసేవక్. ఎరిక్ హాబ్స్‌బామ్ సూచించినట్లు వర్తమానానికి చెందిన భావాలు, ప్రేరణలు, ఆశలు, కోర్కెలను గతానికి ఆపాదిస్తూ గజిబిజి చరిత్రను వ్యాఖ్యానించడమే ఈ శాఖల పని."**



స్వామి దయానంద సరస్వతి

పైపైన చెప్పే విషయంగా కొట్టిపారేయలేము. మోడీ చారిత్రక వాస్తవాలకు, అభూత కల్పనలకు మధ్య హద్దులు లేవని నమ్మే శాఖాసంస్కృతి బిడ్డ, జీవితకాల స్వయంసేవక్. ఎరిక్ హాబ్స్‌బామ్ సూచించినట్లు వర్తమానానికి చెందిన భావాలు, ప్రేరణలు, ఆశలు, కోర్కెలను గతానికి ఆపాదిస్తూ గజిబిజి చరిత్రను వ్యాఖ్యానించడమే ఈ శాఖల పని.

అలవోకగా అబద్దాలు చెప్పడం కంటే ఈ విధమైన చరిత్ర ప్రమాదకరమైనది. మనం విరుద్ధ భావాలను అంగీకరించేలా చేసి, 'మహా ఘనమైన గతం' ఉందనే అభిప్రాయాన్ని కలిస్తుంది. దీన్ని విజ్ఞానశాస్త్రానికి వర్తింప చేయటం వల్ల గత యుగంలో ఉన్న విజ్ఞానశాస్త్రం నేటి విజ్ఞానానికి పూరోగామి అని, లేదా భవిష్యత్తు గురించిన ఊహాలని భావించబడుతుంది. గతం ఆధునీకరించబడి, పూర్వీకులు విజ్ఞానశాస్త్ర మేధావులుగా చిత్రీకరించబడతారు.

'జన్యుశాస్త్రము అప్పటికే (మహాభారత కాలంలోనే) ఉంది' అనే మోడీ ప్రకటన ప్రేక్షకులను సమ్మోహన పరచటానికి ఒక రాజకీయ నాయకుడు మాట్లాడే మామూలు మాటల లాంటిది కాదు. భారతదేశంలో ఉన్న హేయమైన కుల ఆచారాలను చట్టబద్ధం చేయడానికి ఉద్దేశింపబడిన వాదనల పరంపరకు చెందినది. నాజీల దుశ్చర్యలు 'శుద్ధ' జాతి సిద్ధాంతాన్ని తప్పు అని నిరూపించే ముందు 20వ శతాబ్దం మొదటి భాగంలో – మేధావి సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో సహా వర్ణక్రమాన్ని రక్షించే సైద్ధాంతిక భావనలు భారతీయులలో సర్వసాధారణంగా ఉండేవి. ఒకే గోత్ర వివాహాలపై ఖాప్ ఆదేశాలను సమర్థించటానికి మన కాలంలో కూడా జన్యు హేతుకతను ప్రభోధిస్తున్నారు. ఆర్థిక ప్రయోజనాలు, మత మూఢ నమ్మకాలు, కుల మరియు లింగ వివక్షతో జరిగే అణచివేతతో కూడిన ఆచారాలకు హేతుబద్ధత కల్పించటానికి జన్యుశాస్త్ర ముసుగు వేస్తున్నారు.

జన్యువుని కనిపెట్టక ముందు 'జన్యు శాస్త్రము' అనేదే లేదు. జన్యువు అనేది అనువంశికత యొక్క చిన్న యూనిట్. ఈ భావన 20వ శతాబ్దం మొదట్లో గ్రెగర్ మెండల్ (1822–1884) చేసిన పరిశోధనను తిరిగి కనుగొనేంత వరకు తెలియదు.

'జెమ్యూల్స్' – శరీరంలోని అన్ని కణాల నుండి చిన్న కణాలు, రేణువులు రక్తంలోకి విడుదలయ్యేవి – కలయిక వలన లక్షణాలు సంక్రమిస్తాయని చార్లెస్ డార్విన్ (1809 – 1882) ఆలోచించాడు. మెండల్ అవిశ్రాంత నిరంతర కృషి తర్వాత హ్యూగో డి వ్రీస్, ఇతరుల చేత నిర్ధారించబడి, ఒక చిన్న యూనిట్ అనువంశికతకు కారణమౌతుందనే ఆలోచన ఉదయించింది. అనువంశికతకు కారణమైన ఈ యూనిట్ క్రోమోజోమ్‌లపై ఉంటుందని, క్రోమోజోమ్‌లు డి.యన్.ఏ (డిఆక్సీరిబో న్యూక్లిక్ యాసిడ్)తో తయార

**"బ్రాహ్మణులు చెప్పే ఆధ్యాత్మిక అధిభౌతికశాస్త్రం లోతైన శాస్త్రీయపరీక్షకు నిలవలేదని వారికి తెలుసు. నిజమైన శాస్త్ర విజ్ఞానం యొక్క విమర్శనాత్మక హేతుబద్ధమైన పరిశీలన నుండి రక్షించుకునే నిస్పృహతో కూడిన ప్రయత్నంలో భాగంగా, మూఢ అధిభౌతిక శాస్త్రాన్ని విజ్ఞాన శాస్త్రంగా నమ్మించటానికి ప్రయత్నిస్తున్నారు."**



**అనీబిసెంట్**

వుతాయనేవన్నీ కూడా 20వ శతాబ్ద ఆవిష్కరణలు.

గట్టిగా చెప్పాలంటే జన్యువు అనే భావం లేకుండా 'జన్యు శాస్త్రము' అనే ప్రశ్నే లేదు. దీని అర్థం అనువంశికత గురించి ప్రజలు ఆలోచించలేదని, చర్చించలేదని కాదు. అన్ని నాగరికతలలోలాగా ప్రాచీన భారతీయులు కూడా అనువంశికత రహస్యాన్ని ఛేదించడానికి ప్రయత్నించారు. నాటి ప్రమాణాల ప్రకారం వారి యొక్క అత్యంత శాస్త్రీయ సిద్ధాంతం ఆయుర్వేద గ్రంథమైన చరక సంహితలో నమోదు చేయబడింది.

చరక సంహిత ప్రకారం ఒక జీవి యొక్క పుట్టుక ఇద్దరు కాకుండా ముగ్గురు భాగస్వాములపై ఆధారపడి వుంటుంది. తల్లి, తండ్రి, మరణానంతరం కొత్త శరీరం కోసం ఎదురు చేస్తున్న కనపడని దేహం కలిగిన ఆత్మ. దాని కర్మను బట్టి కనబడని దేహం ఒక గర్భంలో ప్రవేశించి గర్భంలో పిండం ఏర్పడటానికి చొరవ చూపుతుంది. బిడ్డ పుట్టుకకు జీవ సంబంధమైన తల్లిదండ్రులు అవసరమే కాని వారు మాత్రమే సరిపోరు; గత స్మృతులు, సంస్కారాలతో చెక్కు చెదరని చనిపోయిన వ్యక్తి నుండి వేరయి ఆత్మ అనువంశికతకు మూలము అని యస్.యన్. దాస్‌గుప్త లోతైన వివరణ ఇచ్చారు. ఇది 'మహాభారత' కాలంలో ఉన్న 'జన్యుశాస్త్రం'. ఇదీ, ఈ రోజు మనం అర్థం చేసుకున్న "జన్యుశాస్త్రము" సమానమని, కొనసాగింపని చెప్పడం హాస్యాస్పదం.

ప్రాచీన హిందూ జాతి ఔన్నత్యాన్ని ఎక్కువగా చెప్పడం, హిందూత్వ యుద్ధ వీరులు ఇలాంటి అసంబద్ధ కార్యకలాపాలకు పాల్పడటం వెనుక లోతైన, పైకి చెప్పని కారణం ఉంటుందని ఎవరైనా అనుమానించవచ్చు. జన్యుశాస్త్రంలో వచ్చిన పురోగతి ఆత్మ ప్రవేశం అసంగతమైన, పైపైన విషయంగా జీవానికి సంబంధించిన అవగాహనతో సంబంధం లేని విషయంగా నిరూపించాయని వారికి తెలుసు. రసాయనాల ద్వారా జీవ అవయవాలను రూపొందించ గలిగిన సింథటిక్ జీవశాస్త్ర యుగంలో మనం జీవిస్తున్నాము. బ్రాహ్మణులు చెప్పే ఆధ్యాత్మిక అధిభౌతికశాస్త్రం లోతైన శాస్త్రీయపరీక్షకు నిలవలేదని వారికి తెలుసు. నిజమైన శాస్త్ర విజ్ఞానం యొక్క విమర్శనాత్మక హేతుబద్ధమైన పరిశీలన నుండి రక్షించుకునే నిస్పృహతో కూడిన ప్రయత్నంలో భాగంగా, మూఢ అధిభౌతిక శాస్త్రాన్ని విజ్ఞానశాస్త్రంగా నమ్మించటానికి ప్రయత్నిస్తున్నారు.

హిందుత్వ యొక్క సైన్స్ వ్యతిరేకత జాతీయవాదాన్ని దాటి విస్తరించింది. ఇది హిందూ నమ్మకాల యొక్క, ఆచారాల యొక్క పునాదులను వెనుక నుండి రక్షించడానికి వేసే ఎత్తుగడ. "ఇది మతానికి, విజ్ఞానశాస్త్రానికి జరిగే ఘర్షణ లక్షణాలను తుడిచివేయడానికి ప్రయత్నిస్తూ మతాన్ని రక్షించడానికి చేసే వృథా ప్రయాస తప్ప మరొకటి కాదు. మతం ప్రతిసారీ సాంప్రదాయ స్థానాన్ని పొందాలని ప్రయత్నిస్తూనే ఉంది. ముందు తను పొందిన కేంద్ర స్థానం నుండి ఉపసంహరించుకోవలసి వస్తూనే ఉంటుంది" అని గొప్ప సిరియా తత్వవేత్త సాదిక్-అల్-అజమ్ పేర్కొన్నారు. ఇదే హిందుత్వ సైన్స్ వ్యతిరేకతకు నిజమైన వనరు.

**అనువాదం : పి. అనంతలక్ష్మి**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.


మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# అసమర్థతకు అబద్ధాలు తోడు

**ఆనంద్ తెల్‌తుమ్డే**



రచయిత
సామాజిక కార్యకర్త

ప్రభుత్వం భారీ వివరాల విశ్లేషణను ఉపయోగించి, రద్దైన పాతనోట్లను అక్రమంగా డిపాజిట్ చేసిన వారిని గుర్తించడం అనే ప్రక్రియ పేరుతో రాజకీయ లబ్ధి పొందడానికి మరొక సారి అబద్ధాలను ఉపయోగిస్తుందన్న ఆరోపణ ఉన్నది. ఇది డొల్లతనంతో కూడుకున్న ప్రదర్శన అయినప్పటికీ ప్రభుత్వం భారీ వివరాల (బిగ్ డేటా) గురించి, వాటి ప్రయోజనాల గురించి మాట్లాడుతున్న తీరు, ఆధార్, ఇతర ప్రజా సంబంధ వివరాలను ప్రభుత్వం దుర్వినియోగపరుస్తుందనడానికి ఒక ఋజువుగా నిలుస్తుంది.

గతంలో లేనటువంటి, చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని రద్దు చేయాలన్న మూర్ఖపు నిర్ణయం వెనుక ఉన్న చిక్కుముడి విప్పబడకపోవచ్చు. కానీ ఇప్పటికే దీని వెనుక ప్రధాని నరేంద్ర మోడీ తప్ప ఇంకెవరూ లేరన్న విషయం మాత్రం స్పష్టం. తన మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ యొక్క లక్షణాన్ని బట్టి నరేంద్ర మోడీ, ఈ మూర్ఖపు నిర్ణయం ప్రజలకు అర్థం కావడం ప్రారంభమైన ప్రతి దశలో నిర్ణయాలను మారుస్తూపోయాడు. ఈ విధానంలో ప్రజలకు అవసరమైన నగదు సమకూర్చడంలో విఫలం అయ్యేసరికి వెంటనే డిజిటల్ లావాదేవీలకు వెళ్ళాలని అన్నాడు. దాని ద్వారా భారతదేశాన్ని నగదురహిత ఆర్థిక వ్యవస్థగా చేయవచ్చును అని, ఆ తరువాత దానిపై తగ్గి తక్కువ నగదు ఆర్థిక వ్యవస్థ వైపు దారిమళ్ళించే ప్రయత్నం చేశాడు. 'ఆధార్' ఆధారిత ఈ-లావాదేవీల బయోమెట్రిక్ ాజూజూ ను (BHIM - Bharat Interface for Money) డిసెంబర్ 30, 2016న ప్రారంభిస్తూ రాజకీయ లబ్ధి పొందాలన్న విషయాన్ని మర్చిపోలేదు. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్‌కు గుర్తుగా ఏర్పాటు చేయబడిందన్న విషయాన్ని చెప్పాడు. అప్పటికే చెప్పలేనన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలను చల్లబర్చడంలో ఈ ప్రయత్నం విఫలం చెందింది.

పెద్ద మొత్తంలో నగదు రూపంలో ఉన్న పాత కరెన్సీ రిజర్వ్‌బ్యాంక్‌కు తిరిగి రాదన్న అంచనా నిజం కాలేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయం ఏమంటే రద్దు చేయబడిన పెద్ద కరెన్సీ నోట్లు అన్నీ బ్యాంకింగ్ విధానం ద్వారా రిజర్వ్ బ్యాంక్‌కు చేరిపోయినాయి. మోడీ వెంటనే పెద్దనోట్ల రద్దు విధానంతో వచ్చిన వివరాలను, విశ్లేషణా పరికరాలతో పరిశీలించి నల్లడబ్బు ఉన్న వారిని పట్టుకోవచ్చని ప్రకటించాడు. తన తెలివైన మాటలతో భారీ వివరాల విశ్లేషణ నల్లడబ్బును ఏ విధంగా నిర్మూలిస్తుందో చెప్పి తన విధానాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. కానీ వివరాలలో (డేటాలలో) ముఖ్యమైన విషయాలు లేవన్న విషయాన్ని నరేంద్ర మోడీ గుర్తించలేదు.

**విశ్లేషణల ఇంద్రజాలం:** భారీ వివరాలు మూడు 'ఎ' లచే సూచించబడతాయి. Volume (భారీ వివరాలు), Variety (వివిధ పద్ధతుల ద్వారా వివరాల సేకరణ-ఆడియో, వీడియో, సిగ్నల్స్) మరియు Velocity. గణాంకాలను తేలికగా తెలియజేసే విధానం, యంత్రాలను నిర్వహించే విధానం, ఈ రెండింటి కలయికే విశ్లేషణ. భారీ వివరాల విశ్లేషణ అంటే ఏమీలేని దానిలో నుండి ఏదో పుట్టించే మంత్రదండం కాదు.

వాస్తవంగా కరెన్సీ నోట్లు సీరియల్ నెంబర్లు, నకిలీ నోట్లను గుర్తించే వాటిపైనే కొన్ని గుర్తులు కలిగి ఉంటాయి. ఈ వివరాలన్నీ తేలికగా గుర్తించే విధంగా, కరెన్సీపై ఉన్న క్రమ సంఖ్యను డబ్బు లెక్కించే యంత్రాలు నిలువ చేసుకుంటాయి. ఈ యంత్రాలలోని వివరాలతో ఆ డబ్బును చివరిసారిగా ఉపయోగించుకున్న ఖాతాదారుడు ఎవరో గుర్తించవచ్చు. యంత్రాలలో ఒక్కసారి వివరాలు నిలువచేసుకున్న తర్వాత పెద్ద మొత్తంలో పోగు చేయబడిన డబ్బును గుర్తించడానికి అవసరమైన నియమ నిబంధనలను తయారు చేసుకొనవచ్చును.

కానీ పెద్దనోట్ల రద్దుకు సంబంధించిన వివరాల విధానాన్ని పరిశీలిస్తే, డిపాజిట్ చేయబడిన కరెన్సీ నోట్ల క్రమ సంఖ్యలు జమచేయలేదనేది వాస్తవం. డిపాజిట్ చేయబడిన కరెన్సీ నోట్ల క్రమ సంఖ్యలను డిపాజిట్‌దారులకు జతచేయబడలేదు. ఇంత ముఖ్యమైన వివరం లేకుండా డిపాజిట్ చేయబడిన నగదు అక్రమమైనదని తేల్చే మార్గంలేదు. లేదా ఫలానా వ్యక్తికి సంబంధించిందనేది కూడ తేల్చలేము. పాత కరెన్సీని కొత్త కరెన్సీతో మార్చే మార్గాలు:

(i) సాధారణ ప్రజలు వారి కష్టంతో సంపాదించుకున్న కరెన్సీని క్యూలలో నిలబడి మార్చుకున్నారు. (ii) 20 శాతం నుండి 40 శాతం కమీషన్ మధ్యవర్తులకు చెల్లించడం ద్వారా నగదు మార్పిడి జరిగింది. (iii) 50 శాతం ట్యాక్స్ జరిమానాగా చెల్లించి నగదు మార్పిడి చేయడం జరిగింది. ఈ మార్గాలలో 2వ మార్గం నల్లడబ్బును తెలుపుగా మార్చుకోవడం అక్రమమైనది. ఇది కూడా రెండు మార్గాలలో జరిగింది. ఒకటి, బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై అక్రమ మార్గాలలో చేయడం, రెండవది, పేద ప్రజలకు 10 శాతం కమీషన్ ఇవ్వడం ద్వారా పాత కరెన్సీని మార్చుకున్నారు. ఈ పద్ధతుల ద్వారా కోట్ల కొద్ది నగదు మార్పిడి చేయబడింది. ఈ వివరాలను విశ్లేషణలు ఏమీ చేయగలుగుతాయి? ఊహించినట్లుగానే బ్యాంక్ డిపాజిట్లు పెరుగుతాయి. కానీ వాటిని అక్రమ నగదుగా పరిగణించగలమా? పెద్దనోట్ల రద్దు

> **“మోడీ స్వంత పార్టీ నేరాల చరిత్ర, ఆస్తుల పెరుగుదల రెండింటిలో ప్రథమస్థానంలో ఉన్నది. 80 పార్లమెంట్ స్థానాలకు 71 స్థానాలలో బి.జె.పి. గెలిచిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వరుణ్‌గాంధీ ఆస్తులు 625 శాతం పెరిగాయి. 2009లో వరుణ్ అందజేసిన అఫిడవిట్ ప్రకారం 4.9 కోట్ల ఆస్తులున్నాయి.”**



కోటీశ్వరులు కొలువుదీరిన లోక్‌సభ

వలన జరిగినదేమంటే నేరస్తుల నల్ల డబ్బును తెల్లగా మార్చడం.

**ప్రజలను పిచ్చివాళ్ళను చేయడం:**

ఇంతకు ముందు నా వ్యాసంలో తెలిపినట్లుగా అక్రమంగా సంపాదించిన సంపదలో బంగారంతో సహా నగదు కేవలం 5 శాతం మాత్రమే. కాబట్టి నల్లడబ్బును బయటకు తీసే ఉద్దేశ్యమే అయితే చూడాల్సింది నగదును కాదు. నల్లధనానికి మూలం కార్పొరేట్ రంగం, దాన్ని పోషించే రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు. రాజకీయ పార్టీలకు 20,000 రూపాయల విరాళాలు ఇచ్చే వారికి పన్ను రాయితీ, అంతే మొత్తం విరాళం ప్రకటించిన వారి పేరు బయటపెట్టకుండా ఉండే విధానాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రాజకీయ పార్టీలు ఆ విధంగా పేర్లు తెలియపర్చని నేరస్తుల నల్లడబ్బును తెలుపుగా మార్చే మార్గాలుగా తయారయ్యాయి. ప్రధాన ఎన్నికల కమీషన్ నసీమ్ జైదీ నేడు 1900 గా ఉన్న రాజకీయ పార్టీలు నల్లధనాన్ని అక్రమంగా దారిమళ్ళించే మార్గాలుగా పేర్కొన్నాడు. వీటిలో ప్రధానంగా లబ్ది పొందింది భారతీయ జనతాపార్టీ అనుకోండి.

జల్లెడ ద్వారా అనుమానిత కేసులను, డిపాజిట్ చేయబడిన కరెన్సీ వివరాలతో పట్టుకుంటున్నట్లు నటించడం అంటే పెద్ద రంధ్రం గుండా బయటకుపోయిన చేపలను పట్టుకునే ప్రయత్నం చేసినట్లే. పెద్దనోట్ల రద్దు ప్రకటనకు ముందు పెద్ద మొత్తంలో వివరాలు లేని డిపాజిట్లపై మోడీ ప్రత్యేక దృష్టి పెట్టబోతున్నాడా? తుదకు, పెద్దనోట్ల రద్దు నిర్ణయం చాలా రహస్యంగా జరిగిందని మోడీ చెప్పిన విషయాన్ని బద్దలు కొడుతూ ప్రకటనకు ముందే పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినట్లు మీడియా నివేదికలు తెలియజేశాయి. ఈ డిపాజిట్‌దారులు ఎవరు? వారంతా బి.జె.పి. ఆంతరంగిక వ్యవస్థకు చెందినవారా?

పట్టపగలే దొంగలు దొరల్లాగా తిరుగుతుంటే, గుంపులో ఉన్న దొంగలను గుర్తించడానికి భారీ వివరాల విశ్లేషణా పరికరాలు మీకు అవసరమా? ప్రజాస్వామ్య సంస్కరణల అసోసియేషన్ తయారుచేసిన నివేదిక ప్రకారం 16వ లోక్‌సభకు ఎన్నికైన 165 మంది పార్లమెంట్ సభ్యుల ఆస్తులు సగటున 137 శాతం (2009–2014 మధ్య) పెరిగినట్లు భారత ఎన్నికల ప్రధాన అధికారి వద్ద ఉన్న అఫిడవిట్లు తెలియపరుస్తున్నాయి. మోడీ స్వంత పార్టీ నేరాల చరిత్ర, ఆస్తుల పెరుగుదల రెండింటిలో ప్రథమస్థానంలో ఉన్నది. 80 పార్లమెంట్ స్థానాలకు 71 స్థానాలలో బి.జె.పి. గెలిచిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వరుణ్‌గాంధీ ఆస్తులు 625 శాతం పెరిగాయి. 2009లో వరుణ్ అందజేసిన అఫిడవిట్ ప్రకారం 4.9 కోట్ల ఆస్తులున్నాయి. 2014లో అవి 35.73 కోట్లకు పెరిగాయి. అంటే అంతకు ముందుకన్నా 30.81 కోట్లు అదనంగా పెరిగాయి. తన తల్లి మేనకాగాంధీ ఆస్తులు 105 శాతం పెరిగాయి.

బి.జె.పి. నుండి తిరిగి ఎన్నికైన ఎం.పి.ల ఆస్తులు 5.11 కోట్ల నుండి 12.6 కోట్లకు (2014లో) పెరిగినాయి. అంటే 146 శాతం పెరుగుదల. కాంగ్రెస్ పార్టీ ఎం.పి.ల ఆస్తులు 104 శాతం పెరిగాయి. ప్రజాసేవ చేస్తామని చెప్పిన ఈ రాజకీయ నాయకులు ఆర్థిక మంత్రగాళ్ళుగా ఎలా మారారనే ప్రశ్నకు మోడీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇదే విధమైన ఆర్థిక నైపుణ్యం ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద కూడ మనం గమనించవచ్చు. వీరు లేకుండా రాజకీయ నాయకులు ఆర్థిక మంత్రగాళ్ళుగా మారడం అసాధ్యం. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ముఖ్యంగా పాలనను అదుపుచేసేవారు, పోలీసులు, ఇతర అధికారులు వారి ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనేది బహిరంగ రహస్యం. వారిలో ఎంతమందిని విచారించారు? ఎంతమంది నేరాలను నిర్ధారించారు? భారతదేశాన్ని ప్రపంచంలో అసమానమైన దేశంగా తయారు చేసిన హెచ్చుతగ్గులు, దేశంలో 57 మంది బిలియనీర్ల చేతుల్లో 58 శాతం సంపద ఉన్నది. ఈ సంపద నిజాయితీగా సంపాదించిన డబ్బుతో సృష్టించబడింది కాదు.

**విశ్లేషణల సమస్యలు:**

భారీ వివరాల విశ్లేషణ అనుకూల, వ్యతిరేక భావనలు కలిగి ఉంటుంది. భారీ వివరాలు దేనివలన ఏది సంభవించిందన్న దానికన్నా పరస్పర సంబంధాల కొరకే వెదుకుతాయి. ‘ఎందువల్ల’ అనేదాని కన్నా ‘ఏమిటి’ అనేదే వాటికి ముఖ్యం. ఈ మధ్య వైట్‌హౌస్ నివేదిక వెలువరించిన విషయాలను బట్టి “నియమ నిబంధనల విధానం, అవకాశాలు, పౌరహక్కులు” అన్నీ భారీ వివరాల వల్ల కలిగే ఇబ్బందులను గూర్చి హెచ్చరిస్తాయి. వివరాలను సమాచారంగా మార్చే నియమ నిబంధనలు దోషములతో కూడుకున్నవి కావు. అవి సంపూర్ణంగా లేని

# సింహాద్రి శివారెడ్డి

(2వ పేజీ తరువాయి)

డివిజన్‌లోని గ్రామాలలో పార్టీ నిర్మాణం బలహీనపడినపుడు పార్టీ నిర్మాణం లేని గ్రామాలలో విస్తరణకు ప్రత్యేక ప్రయత్నం చేసేవారు. కొత్త గ్రామాల్లో శాఖలను ఏర్పాటు చేయటానికి ప్రాధాన్యత ఉండేది. పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశాలలోనూ, కార్యకర్తల కుటుంబసభ్యులలోనూ, మూఢాచారాలు, మతభావాలకు వ్యతిరేకంగా, మన కార్యక్రమాలకు తోడ్పాటు నందించేదిగా మనపని ఉండాలని ప్రసంగాలలో కోరేవారు. కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసేవారు నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని చెప్పిన దానిని ఆయన ఆచరించి చూపారు. కార్యకర్తలు ప్రజలతో కలిసిపోయి పనిచేయాలన్న దాన్ని ఆచరించి చూపించారు. కుటుంబసభ్యులను కూడా పూర్తి కాలం కార్యకర్తలుగా ప్రోత్సహించారు. కుమార్తె, మనమరాలు పూర్తికాలం కార్యకర్తలుగా ఉన్నారు. పూర్తి కాలం కార్యకర్తలు పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించగలరని భావించి, అందుకనుగుణంగా కృషిచేశారు.

కామ్రేడ్ శివారెడ్డి గారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు, కోడళ్ళు, కుమార్తెలు, అల్లుళ్ళు అందరూ పార్టీతోనే ఉన్నారు. కుటుంబంతో పాటు బంధువర్గం అంతటిని పార్టీ కార్యకలాపాలలో భాగస్వాములను చేశారు. ప్రస్తుతం దాని ఫలితాన్ని కూడా చూడవచ్చు.


**ప్రజా సమస్యలకు ప్రాధాన్యత**

సమస్యలు వచ్చినపుడు ఆ గ్రామాలకు వెళ్ళి, శాఖలు, కార్యకర్తలు, ముఖ్యులతో చర్చించి కార్యక్రమాన్ని పురమాయించేవారు. అందుకోసం అవసరం అయితే మూడు నాలుగు రోజులు ఆ గ్రామంలోనే ఉండేవారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణాలలో స్వార్థపర శక్తులు పార్టీని దెబ్బతీయటానికి ప్రయత్నించాయి. కొందరు పార్టీలోకి కూడా ప్రవేశించి, పార్టీని దారితప్పించి, తమ స్వప్రయోజనాల కోసం వినియోగించుకోవడానికి ప్రయత్నం చేశారు. ఇలాంటి వాటినన్నింటిని ఎదుర్కొని మంగళగిరి డివిజన్ లో పార్టీని కాపాడారు.

**సైద్ధాంతిక కృషి**

ప్రజాశక్తి వారపత్రికగా ఉన్నపుడు, దినపత్రికగా మారిన తర్వాత పత్రిక సర్కులేషన్ పెంచటానికి నిరంతరం పర్యవేక్షణ చేసేవారు.. సైద్ధాంతిక కృషి ప్రాధాన్యతను గుర్తించి పత్రిక సర్కులేషన్‌లో జోక్యం చేసుకొనేవారు. ఇలాంటి వరవడి మూలంగానే మంగళగిరి సమితి, మంగళగిరి మండలం తర్వాత నియోజక వర్గంలో ప్రజలు పార్టీని గెలిపించారు. నిమ్మగడ్డ రామమోహన్‌రావు గారు ప్రజాప్రతినిధిగా ప్రజల ఆదరాభి మానాలు చూరగొనడంలో కూడా ఈ వరవడి పాత్ర ఉన్నది. ఈనాడు సర ళీకరణ విధానాల ప్రభావంతో ఆస్తులపై మమకారం పెరుగుతున్నది. కమ్యూనిస్టులపై కూడా దీని ప్రభావం ఉంది. అయినా వాటిని దరిచేరనీయకుండా ఆయన తాను నమ్మిన విలువల కోసం నిలబడ్డాడు. అందుకు కారణం సరళీకరణ విధానాలు దుష్ఫలితాలను తగిన విధంగా ఎదుర్కోవడంలో పార్టీ వెనక బడింది. ఆ లోపాన్ని పార్టీ ఆత్మవిమర్శనా పూర్వకంగా పరిశీలించింది. చేసిన విశ్లేషణ ఆయనకు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పార్టీ బలహీన పడినా రానున్న రోజుల్లో పార్టీని ముందుకు నడిపించవచ్చున్న విశ్వాసం కల్గించింది. ఆయన పయనించిన బాటలో చివరివరకు పయనించటమే మనం ఆయనకు అర్పించే నివాళి. ❄

---



కంప్యూటర్‌లోనికి పంపించబడిన విషయాలపై, తర్కంపై భవిష్యత్‌లో జరుగబోయే చర్యలపై, వాటిని డిజైన్ చేసిన వ్యక్తులపై ఆధారపడతాయి. రహస్య నిర్ణయాలు యంత్రాల ద్వారా వాటంతట అవే పనిచేసే ప్రక్రియపై వాటి సాంకేతిక విచక్షణ, సమర్థతపై గతంలోనే వైట్‌హౌజ్ నివేదిక హెచ్చరించింది. ఎందుకంటే విశ్లేషకులు వారసత్వంగా వస్తున్న క్లిష్టతరమైన నియమ నిబంధనలనే పాటిస్తూ ఉంటారు. ఈ భారీ వివరాల వలన కలిగే లాభాలు వివరాలను, రహస్యాలను కాపాడే విధంగా మలచబడతాయి. ఈ వివరాల పురోగమనపు సంబంధాలు ప్రభుత్వం, వ్యాపారం, వారి అధిపతుల మధ్య సంబంధాలను మార్చివేసి, అవి జాతి వివక్ష, ఇతర పరిమిత స్వేచ్ఛలపై తీవ్ర నేరపూరిత చర్యలకు దారితీయవచ్చు.

ప్రపంచమంతా ఒకవైపు ఈ సమస్యల గురించి ఆలోచిస్తూ ఉంటే, భారత ప్రభుత్వం అదుపు చేయలేని డిజిటల్ వ్యవస్థ వల్ల కలిగే అనర్థాలను గమనించకుండా ఆ విధానాన్నే ముందుకు నెడుతున్నది. బయోమెట్రిక్ విధానం ద్వారానే ప్రతి వ్యాపార లావాదేవీ జరగాలని, దాని ద్వారా అవకాశం ఉన్న వరకు లబ్ది పొందాలని ప్రభుత్వం కోరుకుంటుంది. దానికి ఆధార్ వివరాలు ఆశాజనకంగా కన్పిస్తున్నాయి. ఆర్థిక లావాదేవీలకు బయోమెట్రిక్ విధానం సరియైనది కాదు అన్న విషయాన్ని నిపుణులు నిరూపించినప్పటికీ, నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన భీమ్‌ను "నీ బొటనవ్రేలే, నీ బ్యాంక్" గా విర్రవీగుతూ చెపుతున్నాడు. 2009 ఆధార్‌ను ప్రవేశపెట్టిన అనంతరం, ఏకైక గుర్తింపు ఉన్న విధానం (ఆధార్) అని చెప్పిన ప్రభుత్వం, దానికి భిన్నంగా Aadhar Authentication Application Programming Interface (API) వ్యాపారానికి అందుబాటులో ఉండే విధంగా సృష్టించబడింది.

భారతీయుల రహస్యాలు, వారి యొక్క ముఖ్యమైన వివరాల భద్రత పట్ల కొంచెమైనా ఈ ప్రభుత్వానికి ఆలోచన లేదు. 2005లో దీనికి సంబంధించి సుప్రీం కోర్టులో విచారణకు వచ్చినపుడు అటార్నీ జనరల్ ఈ దేశ ప్రజలకు రహస్యాలపై ఏ విధమైన హక్కు లేదని చెప్పడం ద్వారా విషయాన్ని తేల్చివేశాడు. ఆసక్తికరంగా అపఖ్యాతిపాలు చేయడాన్ని నిలువరించడాన్ని కూడ నేరంగా పరిగణించింది. అదే సమయంలో ప్రభుత్వం దానికి భిన్నంగా ప్రజలు వారి యొక్క రహస్యాల భద్రతను కాపాడుకోవాల్సి ఉంటుందని వాదించింది. సుప్రీం కోర్టు సరియైన విధంగానే ఆధార్ కార్డును ఆరింటికి మాత్రమే పరిమితం చేసింది. అవి ప్రజా పంపిణీ వ్యవస్థలో, పెట్రోలియం గ్యాస్, జన్‌ధన్ యోజన, ఉపాధిహామీ చట్టం అమలులో, అది కూడ స్వచ్ఛందంగా మాత్రమే. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం అందరికీ ఖచ్చితంగా ఉండాల్సిందేనని, కోర్టు తీర్పుకు భిన్నంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం రాజ్యాంగంలో ఉన్న హామీలకు భిన్నంగా భారీ వివరాల విశ్లేషణలతో మన జీవితాలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ, మనలను సీమపందికొక్కుల స్థాయికి దిగజార్చే ప్రయత్నం చేస్తుందన్న విషయం స్పష్టంగా అర్థం అవుతుంది.

ప్రజలు మాట్లాడకుండా ఈ నోట్లరద్దు విపత్తును సహిస్తున్నారంటే, ఈ దుర్మార్గం ప్రజలలో ఉన్న కొద్దిపాటి ఆగ్రహం మాత్రమే అనుకుంటున్నారేమో!

**అనువాదం: బోడపట్ల రవీందర్**

# భవిష్యత్తుపై విశ్వాసంతో ముందుకు సాగండి



**- సాల్వడార్ అలెండి**

నేను మీతో మాట్లాడటానికి ఇదే చివరి అవకాశం. వైమానిక దళం, రేడియో స్టేషన్లు, టవర్లపై బాంబులు వేస్తున్నది. నామాటలు కఠినంగా ఉండవు. నిర్వేదంతో, తమ వాగ్దానాలను భంగం చేసిన వారికి నైతికమైన శిక్ష విధిస్తున్నట్లు ఉంటాయి. చిలీ సైనికులారా! అడ్మిరల్ మెరినో తనకు తానుగా నౌకాదళ కమాండర్‌గా ప్రకటించుకున్నాడు. నిన్న ప్రభుత్వానికి విధేయత ప్రకటించిన మెండోజా జాతీయ పోలీస్ చీఫ్‌గా ప్రకటించుకున్నాడు. ఈ వాస్తవాలను చూసినపుడు నేను రాజీనామా చేయటం లేదని కార్మికులకు చెప్పటమే నాకు మిగిలింది.

చారిత్రకమైన ఈ సంధికాలంలో నేను నా జీవితంతో ప్రజలకు విధేయత ప్రకటిస్తున్నాను. లక్షలాది మంది చిలీ ప్రజల ఆశీస్సులతో మనం నాటిన విత్తనాలు మొలవకుండా ఎప్పటికీ భూమిలోనే ఉండిపోవు.

వారికి బలం ఉంది. మనపై పైచేయి సాధించగలరు. కాని చారిత్రక పరిణామ క్రమాన్ని నేరాల ద్వారానో, బలంతోనో నిరోధించటం సాధ్యంకాదు. చరిత్ర మనవైపున ఉన్నది. ప్రజలు చరిత్రను నిర్మిస్తారు.

నాదేశ కార్మికులారా! న్యాయం కోసం జరుగుతున్న పోరాటంలో విశ్లేషకుడిగా మాత్రమే ఉన్న, రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవిస్తానని చెబుతున్న వ్యక్తిపై మీరు చూయిస్తున్న విధేయతకు, విశ్వాసానికి మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నిర్దిష్టమైన ఈ సమయంలో, మీతో నేను చివరిసారిగా మాట్లాడుతున్న ఈ సమయంలో జరుగుతున్న పరిణామాల నుండి గుణపాఠాలను తీసుకోవాలని కోరుతున్నాను. విదేశీ పెట్టుబడి, సామ్రాజ్యవాదం ప్రతీఘాతకులతో కలిసి సైనికదళాలు తమ సాంప్రదాయాన్ని భగ్నం చేసే వాతావరణాన్ని కల్పించాయి. తమ లాభాలను, ప్రత్యేక హక్కులను కాపాడుకోవటం కోసం విదేశీ సహాయంతో అధికారాన్ని తిరిగి పొందటానికి ప్రయత్నం చేస్తున్నారు.

నమ్రత కలిగిన, మనపై నమ్మకం ఉంచిన మనదేశ మహిళలతో, మరింత ఎక్కువగా శ్రమ పడుతున్న కార్మికులతో, పిల్లల భవిష్యత్తు పట్ల మన ఆందోళనను అర్థం చేసుకున్న తల్లులతో నేను మాట్లాడుతున్నాను. కొద్దిరోజుల క్రితం వృత్తిపరమైన నిపుణులు ఉన్న అసోసియేషన్లు, వర్గ ప్రాతిపదికన ఉన్న అసోసియేషన్లు ప్రారంభించిన దేశద్రోహానికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ సమాజంలో కొద్దిమందికి మాత్రమే ప్రయోజనం కలిగించే చర్యలను బలపరుస్తున్న వారితో పోరాడుతున్న దేశభక్తులైన నిపుణులతో నేను మాట్లాడుతున్నాను.

మనకు వారి సంతోషాన్ని, పోరాటస్ఫూర్తిని ఇచ్చిన యువకులతో నేను మాట్లాడుతున్నాను. రక్షించవలసిన బాధ్యత ఉన్నవారు నిశ్శబ్దంగా ఉండటంతో ఫాసిజం ఇప్పటికే మనదేశంలో కాలూనుకుని టెర్రరిస్టు దాడులు, బ్రిడ్జిలను కూల్చివేయటం, రైలుమార్గాలను విచ్ఛిన్నం చేయటం, ఆయిలు, గ్యాస్ పైపులైన్లను ధ్వంసం చేయటం చేస్తున్నది. ఫాసిజం చేతిలో శిక్షలకు గురౌతున్న చిలీ దేశపు కార్మికులు, రైతులు, మేధావులు అంకితభావం కలిగినవారు. చరిత్ర వారిని గురించి తీర్పు చెబుతుంది.

నిస్సందేహంగా రేడియో మగల్లనీన్ గొంతు నొక్కుతారు. ఈ పరికరాలు నిశ్శబ్దంగా ఉండటం వలన నా గొంతు ఇకముందు మీకు వినిపించదు. అది సమస్య కాదు. దానిని మీరు వింటూనే ఉంటారు. నేను ఎల్లప్పుడూ మీతోనే ఉంటాను. కార్మికవర్గానికి విధేయంగా, గౌరవప్రదంగా వ్యవహరించిన మనిషి జ్ఞాపకాలైనా కనీసం మీతో ఉంటాయి.

ప్రజలు తమను తాము బలిచేసుకోకూడదు. తమను తాము రక్షించుకోవాలి. తమను నాశనం చేయటానికి, బుల్లెట్‌లకు ఎర కావటానికి ప్రజలు అవకాశం ఇవ్వకూడదు. వారు అవమానాలకు కూడా గురికాకూడదు.

నా దేశ కార్మికులారా! చిలీ పట్ల, చిలీ భవిష్యత్తు పట్ల నాకు విశ్వాసం ఉన్నది. అనుకూలమైన పరిస్థితులు వచ్చినపుడు ఈ అంధకారాన్ని, క్లిష్ట పరిస్థితులను అధిగమిస్తారు. స్వేచ్ఛా మానవులు నూతన సమాజాన్ని నిర్మించటానికి ముందుకు సాగటానికి గొప్ప అవకాశాలు త్వరలోనే వస్తాయనే విశ్వాసంతో ముందుకు సాగండి.

**(చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండి 1973, సెప్టెంబరు 13వ తేదీన చేసిన చివరి ప్రసంగం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao,
RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.11. Published on March 1, 2017